# లోకానికి నేనే వెలుగు

Synod
2021
2023

For a synodal Church

communion | participation | mission
సహవాసము | భాగస్వమ్యము | ప్రేషితకార్యము

# కలసి పయనించుదాం

## పీఠాధిపతుల సమాఖ్య 2021-2023

సంపుటి-45 ఏప్రిల్-జూన్ 2022 సంచిక : 2

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం, హైదరాబాదు

## ప్రచురణ

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయ ప్రచురణలు
రామాంతపురం, హైదరాబాదు.

## సంపాదక వర్గం

ఫాదర్ పిల్లి అంతోని దాస్
ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్
ఫాదర్ దాసి సురేష్ కుమార్
ఫాదర్ కుర్మ తామస్

## గురువిద్యార్థుల బృందం

బ్రదర్ కొప్పర డేవిడ్
బ్రదర్ గోన పీటర్
బ్రదర్ కంకిపాటి అనిల్
బ్రదర్ బొమ్ము మత్తయి
బ్రదర్ కదిరేపోగు జయన్న
బ్రదర్ రామంచ శరత్ కుమార్
బ్రదర్ బాపనపాటి అలెక్స్
బ్రదర్ కండి కిషోర్
బ్రదర్ కోడిగంటి శౌరి నిఖిల్ తేజ
బ్రదర్ చాట్ల అలెగ్జాండర్
బ్రదర్ నెకూరి జాయ్ చందు
బ్రదర్ పెండేల ఉమేష్ చంద్ర
బ్రదర్ వంపుగళ్ళ ప్రదీప్ కుమార్

## చందా వివరములు

సంవత్సరానికి మీ చందాను రూ॥ 100/- యం.ఓ., డి.డి.ల ద్వారా
**St. John's Regional Seminary Society, Hyderabad**
పేరున పంపించి మమ్మల్ని ప్రోత్సహించమనవి. అన్ని సంప్రదింపులకు
మరియు మీ విరాళము పంపవలసిన అడ్రస్:

**St. John's Regional Seminary**
Ramanthapur, Hyderabad - 500 013.
Ph: 040-27201427, 27200370, Fax: 27209505
e-mail: stjohnshyd2@gmail.com

# లోకానికి నేనే వెలుగు

సంపుటి : 45 ఏప్రిల్-జూన్ 2022 సంచిక : 2

## కలసి పయనించుదాం

పీఠాధిపతుల సమాఖ్య 2021-2023

**గురుశ్రీ కుర్మా తోమస్**

సంచిక సంపాదకులు

**గురుశ్రీ పిల్లి అంతోని దాస్**

ప్రధాన సంపాదకులు

భక్త యోహాను ప్రచురణలు, భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం,
రామాంతపురం, హైదరాబాదు-500 013.
ఫోన్ : 040-29561761, 29561762
E-mail: stjohnshyd2@gmail.com
Website: stjohnseminary.org

# విషయసూచిక


సంపాదకీయం.................................................................. **5**

**1.** **సినడ్ నేపథ్యం**
*– బ్రదర్ నందిగం మణిహర్* ....................................... **8**

**2.** **సినడ్ – ద్వితీయ వాతికన్ మహాసభ బోధన**
*– బ్రదర్ గుంట కిషోర్* ............................................... **14**

**3.** **పవిత్ర గ్రంథములో సినడ్ ప్రస్తావన**
*– బ్రదర్ వంపుగళ్ళ ప్రదీప్* ......................................... **25**

**4.** **శ్రీసభ చట్టం ప్రకారం 'సినడ్'**
*– బ్రదర్ చాట్ల అలెగ్జాండర్* ....................................... **44**

**5.** **శ్రీసభ శాస్త్రములో 'సినడ్'**
*– బ్రదర్ బోనెల వినయ్ కుమార్* ................................ **51**

**6.** **ప్రస్తుత సినడ్ – ఫ్రాన్సిస్ జగద్గురువుల ఆశయాలు**
*– బ్రదర్ కోడిగంటి శౌరి నిఖిల్ తేజ* .............................. **62**

**7.** **సినడ్: శ్రీసభ భవిత**
*– బ్రదర్ కాలెంతు సాగర్* ............................................ **75**

**8.** **సినడ్ శ్రీసభ సువార్త పరిచర్య**
*– బ్రదర్ బొమ్మ మత్తయి* ............................................ **85**

**9.** **సినడ్ "నూత్నీకరించబడిన" శ్రీ సభ**
*– బ్రదర్ గోలి బాలస్వామి & బ్రదర్ కర్రి శేఖర్* ................ **97**

# సంపాదకీయం



ప్రియ పాఠకులారా!

గత ఏడాది నుండి విశ్వశ్రీసభలో ఒక సంచలనాత్మక వాతావరణం చోటు చేసుకుంది. ఎప్పుడు లేనటువంటి విధంగా శ్రీసభలో క్రొత్త ఆశలు ఆశయాలు, పవిత్రాత్మ ప్రేరణతో, ఈ లోకములో యేసుక్రీస్తు ప్రతినిధిగా, పునీత పేతురు అపోస్తోలిక వారసత్వమున పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారు శ్రీసభలో 'కలసి పయనించుట' అనే పీఠాధిపతుల సమాఖ్యకు పిలుపునివ్వడం శ్రీసభ ఉనికికి, భవితకు బంగారు బాటను వేసింది. ఇది ఏ మలుపు తిరుగుతుందో, ఎటువైపు మనలను పయనింపజేస్తుందో ఖచ్చితంగా నిర్ధారించలేము. నిర్ధారించేది, నడిపించేది పవిత్రాత్మ. ఏది ఏమైనా శ్రీసభకు మంచినే చేకూరుస్తుంది. గతములో ప్రతీ పీఠాధిపతుల సమాఖ్య శ్రీసభకు మంచినే చేకూర్చింది. కాబట్టి ఇటువంటి ఆశాభావముతో ముందుకు కొనసాగడం విశ్వాసులుగా మన వంతు. ఖచ్చితంగా ఈ పీఠాధిపతుల సమాఖ్య ఒక ప్రత్యేకమైనది, ఎందుకంటే ఈ ప్రస్తుత పీఠాధిపతుల సమాఖ్య ప్రతి ఒక్కరిని భాగస్తులనుగా చేస్తుంది కాబట్టి. ఈ పీఠాధిపతుల సమాఖ్య చిహ్నాన్ని మనం పరిశీలించినట్లైతే, పీఠాధిపతులను, గురువులను, మఠవాసులను, గృహస్థ విశ్వాసులను పవిత్రాత్మ సర్వేశ్వరుడు నడిపిస్తున్నట్లు చిత్రీకరించబడింది. ఇది కేవలం ఒక చిహ్నాన్ని ఏర్పాటు చేసుకోవడానికి మాత్రమే కాకుండా దానిని కార్యరూపంలో నిర్వర్తించేది పవిత్రాత్మ సర్వేశ్వరుడే. అందుకే శ్రీసభ అనాదిగా, పునీత సెవిల్లె ఇసిదోర్ గారికి అన్వయింపబడిన ప్రార్థనను, పవిత్రాత్మ ప్రేరణ కొరకు విశ్వశ్రీసభ శతాబ్దాలుగా ప్రార్థించి, ఇప్పుడు ఈ పీఠాధిపతుల సమాఖ్యకు సైతం, ఏక ఖంటంతో ప్రార్థిస్తుంది.

ఈ పీఠాధిపతుల సమాఖ్యకు మార్గచూపరిగా ఉండే మూడు మంచి భావాలను లేదా మార్గదర్శకాలను మనకు అందించడం జరిగింది. అవి,

సహవాసము, భాగస్వామ్యము, ప్రేషిత కార్యము. శ్రీసభలో అందరు కలసి వారి జీవిత స్థాయికి అనుగుణంగా గౌరవ ప్రదమైన జీవితాన్ని శ్రీసభలో జీవించుట, శ్రీసభ చేపట్టే ప్రతీ పనిలో భాగస్వామ్యమును కలిగి యుండుట, క్రీస్తు సువార్తను, ఈ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సమర్ధవంతంగా వ్యాప్తి చేయుట. ఈ పీఠాధిపతుల సమాఖ్య యొక్క ముఖ్య ఉద్దేశము శ్రీసభలో ప్రతీ ఒక్కరు వారి స్వరాన్ని వినిపించాలని. ఇది ఒక హక్కు, ఒక బాధ్యత కూడ. ఒకరు తమ స్వరాన్ని వినిపించాలంటే మిగతా వారు ఆలకించాలి. మన స్వరాన్ని ఇతరులు ఆలకించాలనే హక్కును మనం వినియోగించు కోవాలంటే ముందు మనం ఇతరుల స్వరాన్ని ఆలకించడానికి సంసిద్ధంగా ఉండాలి. ఇతరుల స్వరాన్ని ఆలకించే బాధ్యతను మనం సక్రమంగా నిర్వర్తించాలి. అప్పుడే పవిత్రాత్మ మన ద్వారా శ్రీసభకు అవసరమైన అంశాలను పరిగణించుటకు ప్రేరేపిస్తుంది. పవిత్రాత్మ ఎవరి ద్వారా పలికిస్తుందో మనం వేచి చూడాలి. బహుశా ఇప్పటి వరకు అవివేకులుగా పరిగణింపబడినవారి ద్వారా మాట్లాడవచ్చేమో. "ఎవడును తనను తాను మోసగించుకొనరాదు. మీలో ఎవడైనను లౌకికమైన విలువలను బట్టి తనను వివేకిగా ఎంచుకొనెనేని, నిజముగ వివేకవంతుడగుటకు గాను అతడు అవివేకి కావలెను. ఏలయన ఈ లోకముచే వివేకముగా పరిగణింపబడునది దేవుని దృష్టిలో అవివేకము" (1 కొరింతీ 3:18,19). "వివేకవంతులను సిగ్గుపడునట్లు చేయుటకు, లోకముచే అవివేకులుగా భావింపబడువారిని దేవుడు ఎన్నుకొనెను. శక్తిమంతులను సిగ్గుపడునట్లు చేయుటకు లోకముచే బలహీనులుగా భావింపబడు వారిని ఆయన ఎన్నిక చేసికొనెను" (1 కొరింతీ 1:27).

ఈ 2021-2023 పీఠాధిపతుల సమాఖ్యను మనమంతా కలసి అర్థవంతంగా కొనియాడుటకు మన వంతు ప్రార్థనా సహకారాన్ని, మన నుండి ఎలాంటి సహకారాన్ని కోరినా, అందించుటకు, అదేవిధంగా మన శ్రీసభ ఉన్నతికి ఉపయోగపడే భావాలను సకాలంలో అందించుటకు మనం సంసిద్ధంగా ఉండాలి. ఈ పీఠాధిపతుల సమాఖ్య ఉద్దేశం అదే. ప్రతి ఒక్కరికి శ్రీసభలో స్థానం ఉంది. ఈ విషయానికి వస్తే నాస్తికులకు సైతం స్థానం

ఉంది. దేవుని ఉనికి నాస్తికులు సైతం చవిచూచే విధంగా నేను ఏవిధంగా శ్రీసభలో నా విశ్వాసాన్ని ప్రకటించగలను అనే ప్రశ్నలు నేను పరిగణించాలి. నాస్తికులుశ్రీసభలో నా విశ్వాసాన్ని సవాలు చేస్తున్నారు, నా విశ్వాసాన్ని ప్రశ్నిస్తున్నారు. వారి ప్రభావం శ్రీసభలో ప్రస్ఫుటముగా కనిపిస్తుంది. నాస్తికులు దేవుని వెదకకపోయినా, దేవుడు వారిని వెదుకుతూ వస్తారు. దేవుని రాజ్య వ్యాప్తికి అందరం కలిస్తేనే అది సాధ్యమవుతుంది. ఈ పీఠాధిపతుల సమాఖ్య ఆ దృష్ట్యా మనలను నడిపిస్తుంది.

ఈ ఉద్దేశంతోనే ఈ సంపుటిని 'పీఠాధిపతుల సమాఖ్య 2021-2023' ముఖ్యాంశముగా ఎన్నుకొని భవిష్యత్తులో శ్రీసభను ముందుకు నడిపించే సేవకులైన గురువిద్యార్థులచేత వ్యాసములను రచింపచేసి మీకు అందించుటకు ఎంతో సంతోషిస్తున్నాము. ఈ అంశాలన్నిటిని పొందు పరచి, వారు తమ భావాలను స్వేచ్ఛగా శ్రీసభ అభివృద్ధికి ఉపయోగార్థముగా ఉండుటకు వారిని ప్రోత్సహించడం జరిగినది. శ్రద్ధతో పఠించి వారిని ప్రోత్సహించ మనవి.

**ప్రేమతో...**
**గురుశ్రీ కుర్మా తోమాస్**
*సంచిక సంపాదకుడు*

# 1. సినడ్ నేపథ్యం

**– బ్రదర్ నందిగం మణిహర్**



సినడ్ అనేది క్రైస్తవ మతానికి చెందిన పెద్దలు అనగా పాపుగారు, పీఠాధిపతులు వివిధ పాలక మండలికి చెందిన సభ్యులు కలిసి ఒక సమస్యపైన గాని లేక క్రైస్తవ సభ్యులు పాటించడానికి సిద్ధాంతాలను, విశ్వాసపరమైన, నైతికపరమైన లేదా పాలన శ్రీసభలో క్రమశిక్షణ ప్రయోజనాలకోసం అధికారికంగా సమావేశమవ్వడాన్ని “సినడ్” లేదా “సమాఖ్య” అంటారు. “సినడ్” అనే పదం గ్రీకుభాష నుండి తీసుకొనబడింది. సినడ్ అంటే కూడిక లేదా సమావేశము అని అర్థం. మన శ్రీసభ చరిత్రలో అనేక సినడ్లు చోటు చేసుకున్నాయి. ఈ సినడ్లలో శ్రీసభకు కాలానుగుణంగా అవసరమగు మార్పులను, అభివృద్ధి పదంలో నడుచుటకు కావలసిన జాగ్రత్తలు గురించి చర్చించి వాటిని క్రియారూపంలో పాపుగారి సలహాలను పాటిస్తూ అధికార పత్రాలను విడుదల చేస్తారు. ఒక సినడ్ సాధారణంగా ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి జరుగుతుంది. వీటినే “సాధారణ సమావేశముగా” పిలుస్తారు. కొన్ని సందర్భాలలో సమావేశాలను నిర్దిష్ట పరిస్థితులను ఎదుర్కొనడానికి సమావేశమవుతారు. వీటిని “అసాధారణ సమావేశాలు” అని కూడా పిలుస్తారు.

శ్రీసభలో పాపుగారి, పీఠాధిపతుల బాధ్యత ఎక్కువగా ఉంటుంది. శ్రీసభలో విశ్వాసులను దేవుని యొద్దకు నడిపిస్తూ, వారి విశ్వాసం చెదిరిపోకుండా, వారికి కలిగిన సందేహాలను, గురువులు, వివిధ మఠవాస సంస్థలకు చెందిన పెద్దలతో, కలిసి చర్చించి వాటిని తీర్చాలి. కొన్నిసార్లు అవసరతనుబట్టి

పాపుగారు కార్యప్రణాళికను నిర్ణయించి వాటి గురించి పీఠాధిపతులు, గురువులను సమావేశపర్చి వాటిలో మంచి చెడులను గ్రహించి, ఒక అధికార పత్రంలో పొందు పరచి విశ్వ శ్రీసభకు అందిస్తారు.

## ప్రస్తుత సినడ్ ఎంత కాలం జరుపబడుతుంది?

సినడాలిటిపై శ్రీసభ యొక్క ప్రస్తుత సినడ్ రెండు సంవత్సరాల ప్రక్రియగా ఉంటుంది. సినడాలిటిపై మొదటిగా మేత్రాసన స్థాయిలో మరియు ప్రాంతీయ, జాతీయ, ఖండాల పీఠాధిపతుల సమాఖ్యలలో, చర్చలు జరిపి ఒక వ్రాతపూర్వక నివేదికను రోమునగరానికి పంపుతారు. రోమునగరంలోఉన్న పాపుగారు, పీఠాధిపతులు, గురువులు, వ్రాతపూర్వకముగా పంపబడిన విషయాలను చదివి, మరోసారి పంపబడిన విషయాలను చర్చించి ఒక నిర్దిష్ట నిర్ణయానికి వస్తారు.

ఈ సినడ్ ముఖ్య ఉద్దేశము శ్రీసభలో గృహస్థ క్రైస్తవుల భాగస్వామ్యం గురించి తెలియజేయడానికి, మన కథోలిక శ్రీసభ ప్రేషిత సేవా కార్యాలలో గృహస్థ క్రైస్తవులు భాగస్వామ్యం అంతగా లేకపోవడం. ఆది క్రైస్తవ సమాజంలో క్రీస్తు ప్రభుని విశ్వాసులందరు ఒకటిగా జీవించారు. సంఘం అభివృద్ధికి వారు ఎంతగానో సహాయం చేశారు. వారికి ఉన్న ఆస్తులు అమ్మి అపోస్తులులకు ఇచ్చారు. విశ్వాసులు అందరు ఒక సంఘంగా, ఒక కుటుంబముగా జీవించారు. కాని నేటి సమాజంలో అది కనిపించడంలేదు. పాపుగారు, పీఠాధిపతులు, గురువులు ఎంత కృషిచేసినా, విశ్వాసులు అది గురువు పనిగా భావించి ఆ భాగస్వామ్యం చూపించడం లేదు.

అందుకే ఫ్రాన్సిస్ పాపుగారు 2021-2023 లో జరుగు పీఠాధిపతుల సమాఖ్యలో సహవాసము, భాగస్వామ్యము, ప్రేషిత కార్యము అను అంశాలను పరిగణించుటకు పిలుపునిచ్చారు. శ్రీసభలో గృహస్థ క్రైస్తవుల భాగస్వామ్యం ద్వారా సహవాసం పెరుగుతుందని, క్రైస్తవుల సహవాసం లేకుంటే శ్రీసభ తన గుణాత్మకతను సహజ స్వభావాన్ని కోల్పోతుంది. కాబట్టి శ్రీసభ తన చిన్నమందను విడిచిపెట్టకుండ వారిలో పూర్వపు విభజనలను నాటి శ్రీసభకు, విశ్వాసులకు మధ్య సంబంధం పెరిగే విధంగా చూడాలి.

సినడ్, సమాఖ్య పాపుగారు, పీఠాధిపతులు, వివిధ మఠవాస సంస్థలకు చెందిన అధికారులతో నిర్వహించబడుతుంది. ప్రతి సినడ్, సమాఖ్యలో మతపరమైన విషయాలను చర్చించి, మత అభివృద్ధికై వివిధ నిర్ణయాలు తీసుకుంటారు. అవసరమైతే వ్రాతపూర్వకంగా అంశాలన్నింటిని పీఠాధిపతులకు, గురువులకు, విశ్వాసులకు పంపుతారు.

## శ్రీసభ చరిత్రలో సినడ్, సమాఖ్య

తొలినాటి క్రైస్తవ సంఘంలో సున్నతి గురించి సమస్య ఏర్పడినది. అంతియోకియాకు వచ్చిన మనుష్యులు సున్నతి పొందిననే తప్ప మీకు రక్షణ లేదు అని బోధించారు. అందుకు అపోస్తలులు పౌలు, బర్నబాలు చర్చించి ప్రజల మధ్య వచ్చిన 'సున్నతి సమస్యను' పరిష్కరించారు. "ప్రభువైన యేసు అనుగ్రహము వలన రక్షింపబడుదుమని మనము విశ్వసింతుము అట్లే వారును రక్షణము పొందుదురు" (అపో. కా. 15:11). ఈ సినడ్ సమావేశాలు తొలినాటి క్రైస్తవ సంఘం నుండి వస్తున్నాయి.

శ్రీసభ చరిత్రలో అనేక సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాలు కొన్నిసార్లు పతనమవుతున్న శ్రీసభను నిలబెట్టడానికి, కొన్నిసార్లు శ్రీసభను మెరుగు పరచడానికి, అసత్య బోధనలను ఎదుర్కొనడానికి దోహద పడతాయి. శ్రీసభ ఆ యేసు ప్రభుచే తండ్రి దేవుడు ఏర్పాటు చేసుకున్నది కాబట్టి అందులో ఎటువంటి రాగ ద్వేషాలు, పక్షపాతం, అసత్య బోధనలు లేవు అని నిరూపించడానికి ఈ సమావేశాలు జరిగేవి. కొన్ని అసత్య బోధనలు 'తియోటోకోస్' క్రీస్తు దైవ స్వభావాన్ని తిరస్కరించాడు నెస్టోరియన్. నెస్టోరియన్ ప్రకారం, తల్లి మరియ క్రీస్తుకి జన్మనిచ్చింది కావున ఆయనకు దైవస్వభావం లేదు అని వాదించాడు. మూడవ క్రైస్తవ సమావేశంలో 381 లో ఎఫెసుస్ కూటములో పాల్గొనిన గురువు పవిత్ర గ్రంథ ఆధారంగా క్రీస్తు దైవ స్వభావాన్ని నిరూపించి, నెస్టోరియన్ వాదనను తిప్పికొట్టి తల్లి మరియ క్రీస్తోటోకోస్ అన్న వాదనను తీవ్రంగా ఖండించింది. అప్పటి నుండి తల్లి మరియ క్రీస్తు దైవ మానవ స్వభావానికి మాతృమూర్తియైనందు వలన తల్లి మరియను తియోటోకోస్ అని అధికారికంగా ప్రకటించారు. ఈ విధంగా క్రీస్తు ప్రభువు, తండ్రి దేవుడు

సమానం కాదు అని పుట్టుకొచ్చిన అసత్య బోధనలన్నింటిని తిరస్కరించి, వాటిని అసత్య బోధనలని నిరూపించారు.

## ఆది శ్రీసభ–నేటి శ్రీసభ

తొలినాటి క్రైస్తవ సంఘం దైవరాజ్య వ్యాప్తికోసం సంపూర్ణ భాగస్వామ్యం కలిగిన విశ్వాసుల సంఘం. అందులోని ప్రతి క్రైస్తవుడు క్రైస్తవ సంఘం పట్ల పూర్తి బాధ్యతతో వ్యవహరించేవారు. సంఘం పనుల్లో గురువులకు సహాయం చేస్తూ శ్రద్ధతో పాలుపంచుకునేవారు, క్రైస్తవులందరు దైవరాజ్య వ్యాప్తికోసం ప్రత్యేకంగా ఎంపికైనవారనే భావం, గౌరవం ప్రతి ఒక్కరిలో ఉండేది. దైవరాజ్య వ్యాప్తికై క్రైస్తవులందరు బాధ్యత, శ్రద్ధ కలిగి ఉండేవారు. వారి వ్యక్తిగత కర్తవ్యంగా భావించేవారు. "మీరు ఎన్నుకోబడిన జాతి, రాచరికపు బృందం, పవిత్ర జనాంగం, దేవుని సొంత ప్రజలు, దేవుని అద్భుత కార్యములు ప్రకటింప ఏర్పరుపబడినవారు" (1 పేతురు 2:9). దైవరాజ్య వ్యాప్తి సంఘ సభ్యులందరికి సమాన భాగస్వామ్యం, బాధ్యతగా భావించినందు వలన, గురువులు సామాన్యులు అనే బేధాభిప్రాయాలు, తేడాలు ఉండేవి కావు. అపోస్తలుల బోధనలు చేస్తూ, పరిపాలిస్తూ ఉన్నపుడు విధవరాండ్రకు సపర్యలు చేయలేకపోయిన సమయంలో విశ్వాసులను, విధవరాండ్రను చూసుకోవడానికి ఏడు ఉపగురువులను నియమించారు. వారిని డీకన్లు అని కూడా పిలుస్తారు. ఆనాటి తొలి క్రైస్తవుల మధ్య ప్రేమానురాగాలు ఉండేవి.

నేటి శ్రీసభలో తొలినాటి క్రైస్తవ సంఘం చూపించిన సమభావం, గౌరవం, సమాన బాధ్యత శ్రద్ధ ఆశించినంతగా కనబడుటలేదు. గురువులకు క్రైస్తవ సంఘం మధ్య బేదాభిప్రాయాలు చోటుచేసుకొంటున్నాయి. నేటి క్రైస్తవ సంఘం దైవరాజ్య వ్యాప్తి పాపుగారు, పీఠాధిపతులు, గురువులు, సకల విశ్వాసుల బాధ్యతగా భావించి వారికి శ్రీసభలో ఉన్న భాగస్వామ్యాన్ని మరచిపోతున్నారు. సంఘంలో ఒకరి యెడల ఒకరు చూపించుకోవలసిన ప్రేమాభిమానాలను మర్చిపోతున్నారు.

క్రైస్తవ సంఘ సభ్యులందరు క్రీస్తుతో విడదీయలేని బంధం కలిగి ఉన్నందు వలన ప్రతి ఒక్కరు సమాన విలువ, గౌరవం, హోదా కలిగినవారై ఉంటారు. అందుకే పునీత పౌలుగారు శరీరంలోని అవయవాలు ఒక దానితో మరొకటి అనుసంధానమై ఉండుటయేగాక, ఒకదానిపై మరొకటి ఆధారపడి ఉండే విధంగా సంఘంలోని అందరు ఒకరిపై ఒకరు పరస్పరం ఆధారపడి ఉంటారని ఉద్బోధించారు (1 కొరింతీ 12:21). ప్రధానమైన విషయమేమిటంటే సంఘంలోని బలహీనులను, అభాగ్యులైన వారిపట్ల మిగిలిన వారు శ్రద్ధ చూపించి ఆదరించాలి. అప్పుడే మనం ఒక సంఘంగా, ఒకే కుటుంబముగా ఉండగలుగుతాము.

అందుకే పాపుగారు కనుమరుగవుతున్న విశ్వాసుల భాగస్వామ్యాన్ని గుర్తుచేస్తూ దైవరాజ్య వ్యాప్తికి విశ్వాసుల బాధ్యతను గుర్తుచేస్తున్నారు. సినడాలిటీపై సినడ్ కు పిలుపునిచ్చారు. ఈ సినడ్ ద్వారా అందరు కలిసి ఒకే సంఘంగా, కుటుంబముగా ఉండాలని భావించారు.

## శ్రీసభ చరిత్రలో ద్వితీయ వాతికను మహాసభ

శ్రీసభ చరిత్రలో మధ్యయుగ కాలంలో శ్రీసభలో లోటుపాట్లను, కొరతలను గుర్తించి ద్వితీయ వాతికను మహాసభ ద్వారా ఆ లోటుపాట్లను, కొరతలను సవరించి, సంస్కరించి శ్రీసభ ఔన్నత్యాన్ని పునరుద్ధరణ చేశారు. పునీత 23వ జాన్ పాపుగారు ద్వితీయ వాతికను మహాసభకు పిలుపునిచ్చారు. కొన్ని విప్లవాత్మక సంస్కరణలకు పూనుకున్నారు. అప్పటి వరకు శ్రీసభలో జరిగిన సమావేశాలన్నీ శ్రీసభ లోపలి నుండి గాని వెలుపల నుండి గాని ఎదురైన సమస్యలకు మార్గాలను వెదకి పరిష్కరించడానికి ఈ ద్వితీయ వాతికను మహాసభను ఏర్పాటు చేశారు.

శ్రీసభ తనను తాను రూపుదిద్దుకొని, అన్ని విధాలుగా సంస్కరణకు పూనుకొన్నది. శ్రీసభ రూపనిర్మాణంలో, వ్యవహార శైలితో, పనితీరులోనూ గృహస్థ విశ్వాసుల భాగస్వామ్యం పెరిగి శ్రీసభ తన పూర్వ వైభవాన్ని తొలినాటి ప్రభావాన్ని సంతరించుకుంది. ఆశించిన విధంగానే శ్రీసభ ఆలోచన

విధానంలోను నిర్వహణ శైలిలోనూ సమూల మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ మహాసభ ద్వారా తెచ్చిన మార్పులు, ఆవిష్కరణలు ఆశ్చర్యపరిచే విధంగా శ్రీసభ ముఖ చిత్రాన్ని మార్చి వేశాయి. ఇది శ్రీసభలోజరిగిన రెండవ విశ్వవ్యాప్త సార్వత్రిక సర్వసభ్య మహాసభ ఎక్యుమెనికల్ సమాఖ్య. అందులో పాల్గొన్నవారు ప్రపంచంలోని అన్ని ఖండాలు, సంస్కృతుల నుండి 2600 మంది పీఠాధిపతులు, ప్రతినిధులు, 400 మంది వేదశాస్త్ర నిపుణులు, మొత్తం 3000 మంది పాల్గొన్నారు. ఈ మహాసభ మొత్తం 16 అధికారిక పత్రాలను వెలువరించినది. అందులో నాలుగు పాలనా పరమైన చట్టాలు, తొమ్మిది ఆదేశ తీర్మానాలు, మూడు అధికార ప్రకటనలు ఉన్నాయి.

## ముగింపు

సినడ్ 2021-2023 నకు ఫ్రాన్సిస్ పాపుగారు విశ్వశ్రీసభకు పిలుపు నిచ్చారు. దీనిని ముఖ్య ఉద్దేశం శ్రీసభలో గృహస్థ క్రైస్తవుల భాగస్వామ్యానికి ప్రాధాన్యతనివ్వడం. దైవరాజ్య స్థాపనకై జ్ఞానస్నానము పొందిన ప్రతి విశ్వాసి బాధ్యత అని గుర్తుచేసుకోవడం. గురువులు వారికి అప్పగింపబడిన విశ్వాస సంఘాన్ని ఆధ్యాత్మిక పదంలో నడిపించడం. విశ్వాస సంఘం వారికి ఒసగిన గురువులకు సహాయాన్నందించి సంఘం యొక్క అభివృద్ధికి పాటుబడడం. గురువులు తమ గొఱ్ఱెలను కంటికి రెప్పలా కాపాడాలి. అదేవిధంగా క్రైస్తవ సంఘం కూడా వారి కాపరులను గౌరవించాలి. ఎప్పుడైతే గురువు, క్రైస్తవ సంఘం మధ్య మంచి అనుబంధం ఉంటుందో ఆ సంఘం అభివృద్ధికి, శ్రీసభలో దైవరాజ్య స్థాపనకు దోహదపడుతుంది. కాబట్టి ఈ సినడ్ ద్వారా దైవరాజ్య స్థాపన మనందరి బాధ్యతగా గుర్తించి మనవంతు సహకారాన్ని అందిద్దాం. దేవుని కృపావరములు పొందుకుందాం.

# ౨. సినడ్-ద్వితీయ వాతికన్ మహాసభ బోధన

-బ్రదర్ గుంట కిషోర్



## ఉపోద్ఘాతం

ప్రపంచంలో చోటుచేసుకుంటున్న నిరంతర మార్పులకు ధీటుగా పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారి ఆలోచనావిధానం, కార్యాచరణ అత్యంత ప్రశంస నీయమైనవి. ప్రస్తుతం శ్రీసభలో నిర్మాణాత్మకంగా, శ్రీసభ చట్టపరంగా జరుగుతున్న అపారమైన మార్పులే వాటికి సాక్ష్యాలు. 'శ్రీసభ ఎల్లప్పుడు అనుదారవాద సంస్థగా ఉంటుంది' అనే ఆలోచనను మార్చడంలో పాపుగారు సఫలమౌతున్నారని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తిలేదు. పాపుగారిగా ఎన్నికైనప్పటి నుండి, ఊహించని సంస్కరణలు, మార్పులు తీసుకొచ్చారు. ఆ సంస్కరణలలో భాగమే ప్రస్తుత సినడ్ 2021-2023. ఇప్పటి వరకు జరిగిన సినడ్లు ఒక ఎత్తయితే ఇప్పుడు జరుగుతున్న సినడ్ ఇంకో ఎత్తు. ఈ సినడ్ ఎంతో విశిష్టమైనది. 2000 సంవత్సరాల చరిత్ర ఉన్న శ్రీసభలో ప్రప్రథమంగా సామాన్య క్రైస్తవులను కలుపుకొని నిర్వహిస్తున్న సినడ్ ఇది. ఈ సినడ్ లో బాగా వినిపిస్తున్న పదం, "సినడాలిటీ" అనగా దీని అర్థం, "శ్రీసభ విధి విధానాలలో, సువార్తాపయనంలో దేవుని ప్రజల ప్రమేయాన్ని భాగస్వామ్యాన్ని తెలియజేస్తుంది. అలనాటి ఆది అపోస్తలుల సంఘంలోనే జనియించిన భాగస్వామ్య శ్రీసభకు (అపో.కా. 4:32-35) అవే స్థితిగతులను ఏకతా బంధాన్ని గుర్తుచేస్తూ పాపుగారు ఈ పవిత్రాత్మ ప్రేరిత నిర్ణయం తీసుకోవడం ఒక వరం అనే చెప్పుకోవాలి. అయితే పాపుగారి ఆలోచనావిధానం ముందుగానే ద్వితీయ వాతికన్ మహాసభలో ఆవిష్కృతమైంది. అనేక సంస్కరణలతోపాటు భాగస్వామ్య శ్రీసభకు పెద్ద పీట వేసింది. అందువలన

ఈ వ్యాసంలో ప్రస్తుత సినడ్, సినడాలిటీ ప్రస్తావన, వాటికి సంబంధించిన విషయాలను, రూపాలను ద్వితీయవాతికను సభలో ఏవిధంగా చెప్పబడ్డాయో తెలుసుకుందాం.

## ద్వితీయ వాతికను మహాసభ విశిష్టత

శ్రీసభ చరిత్రలో ఒక అపూర్వమైన చారిత్రక ఘట్టం, "మరో పెంతుకోస్తు పర్వదినం" గా పిలువబడే ద్వితీయ వాతికను మహాసభ. శ్రీసభలో అణువణువునా సంస్కరణకు, అంచెలంచెలుగా నూత్నీకరణ ప్రక్రియకు నాంది పలికింది. యావత్కథోలిక ప్రపంచాన్నే సగర్వంతో తన్మయత్వంలో ముంచెత్తిన ఈ ఘట్టం రాబోయే శ్రీసభ భావితరాలకు దిశానిర్దేశాన్నిస్తూ అనేక విధాలుగా మార్గచూపరిగా నిలిచింది. మరి ముందుగా చెప్పుకున్నట్లుగా ప్రస్తుత సినడ్, సినడాలిటీకి సంబంధించిన అంశాలు ఈ మహాసభలో ఏవిధంగా ఆవిష్కృతమయ్యాయో చూద్దాం.

### I. దైవార్చన (Sacred Liturgy)

1.శ్రీసభలో భాగస్వామ్యం సంతరించుకునే ప్రప్రథమమైన స్థానం దైవార్చనలోనే. దేవునికి మహిమ, ఆత్మల రక్షణ చోటుచేసుకునే విశిష్టమైన కార్యమే దైవార్చన. ఇంతటి ప్రాధాన్యత కలిగిన దైవార్చనలో దేవుని ప్రజల భాగస్వామ్యముకు ఎంతో ఆవశ్యకత ఉంది. అందువలననే "దివ్య పూజలో పాల్గొనే క్రైస్తవ విశ్వాసులు అపరిచితులుగానో, మౌనప్రేక్షకులుగానో ఉండరాదనీ, అంతరార్థాలు తెలుసుకొని భక్తిభావంతో దివ్యబలిలో పాల్గొంటూ, పుణ్య ఫలాలను అందుకోవాలని శ్రీసభ కోరుతోంది. అంటే దివ్య పూజలోని ప్రతీ సాంఘ్యాన్నీ విశ్వాసులు అర్థం చేసుకోగలగాలి, అర్థవంతంగా ప్రార్థన చేయగలగాలి, ప్రతి సాంఘ్యంలోను భక్తిప్రపత్తులతో పాల్గొనగలగాలి" (Sacrosanctum Concilium 48), అని వారి ఆధ్యాత్మిక పరిణతి ప్రయోజనార్థం, ఆ మహాసభ అంత వరకు కేవలం లతీను భాషలోనే దివ్య పూజను సమర్పించే సాంప్రదాయాన్ని మారుస్తూ "స్థానిక భాషల్లో దైవారాధనలు చేయడం విశ్వాసుల భక్తి జీవనానికి మరింత ఉపయోగకరంగా ఉంటుంది.

దివ్యపూజా సమర్పణలోగాని, దివ్య సంస్కారాల ఆచరణలో గాని, ఇతర దైవారాధన ప్రక్రియల్లోగాని, స్థానిక భాషలను ఉపయోగించుకోవచ్చును" (Sacrosanctum Concilium 36) అనే సంస్కరణను నెలకొల్పింది. ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించే ఏ దైవార్చనలోనైనా మాతృభాషలను ఉపయోగించు కునేలా చేసింది.

2. "అన్ని సాంఘ్యాలలోను విశ్వాసులు పూర్తిగా పాల్గొనాలి" అనే ఉద్దేశంతో, దివ్యపూజలోని సత్ప్రసాద స్వీకరణ సాంఘ్యములో కేవలం గురువులు మఠవాసులు మాత్రమే కాకుండా సామాన్య క్రైస్తవులకు కూడా రెండు రూపాలలోను (అప్పము, ద్రాక్షారసము) దివ్య సత్ప్రసాదమీయవచ్చును (Sacrosanctum Concilium 55).

3. దైవార్చన సంవత్సరములో ఆదివారం అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రభు సంస్మరణ దినం కాబట్టి, ఆనాడు "విశ్వాసులందరు విధిగా ఒక చోట సమావేశం కావాలి, అందరు కలిసి దైవవాక్కును ఆలకించాలి, అందరూ కలిసి దివ్యబలిని సమర్పించాలి." (Sacrosanctum Concilium 106) ఆదివారంలో, అప్పుపండుగలోదివ్యపూజలో "విశ్వాసుల ప్రార్థనకు" అవకాశం కల్పించింది. ఎందుకంటే "ఇది ప్రజల సమిష్టి ప్రార్థనా సమయం" (Sacrosanctum Concilium 53).

4. ద్వితీయ మహాసభకు ముందు, గురువు దివ్యబలిని, ప్రజలకు అభిముఖంగా కాక, సిలువకు, పీఠానికి ఎదురుగా అర్పించేవాడు. ఈ సాంప్రదాయంలో గురువు మాత్రమే దివ్యబలిపూజను నెరవేర్చేవాడు. సామాన్య క్రైస్తవులకు ఎలాంటి భాగస్వామ్యం లేక ప్రేక్షకులుగా నిలబడేవారు. కాని ద్వితీయ మహాసభ చేసిన సంస్కరణ, దైవార్చనకే కొత్త అర్థాన్నిస్తూ దివ్యపూజ ఉద్దేశాన్ని నెరవేర్చింది. కేవలం గురువు మాత్రమే దివ్యబలిపూజను జరుపువాడు కాదు, దేవుని ప్రజల భాగస్వామ్యం అవసరం, దివ్యబలిపూజ సంస్కారంలో దేవుని ప్రజల భాగస్వామ్యం ఒక భాగం అని బోధిస్తూ "దివ్యబలిపూజలో గురువు ప్రజలకు అభిముఖంగా నిలబడి సమర్పించాలి" అనే వినూత్న సంస్కరణను, సాంప్రదాయాన్ని నెలకొల్పింది.

## II. శ్రీసభలో సామాన్య క్రైస్తవుల పాత్ర

క్రీస్తు రాజ్యాన్ని విస్తరింపజేసే ధర్మం కేవలం పీఠాధిపతులకు, గురువులకు, మఠవాసులకు మాత్రమే కాదు. క్రీస్తులో జ్ఞానస్నానం పొందిన ప్రతి సామాన్య క్రైస్తవుని ధర్మం అంటూ, ద్వితీయవాతికను మహాసభ క్రీస్తు రాజ్యాన్ని ప్రకటించడంలో శ్రీసభలో సామాన్య క్రైస్తవుల భాగస్వామ్యాన్ని ఉద్ఘాటించింది. శ్రీసభలో సామాన్య క్రైస్తవుల పాత్రను గొప్పగా పొగిడింది. "సామాన్య క్రైస్తవులు లేక శ్రీసభ లేదు, వారి అపోస్తోలిక సేవలు లేకుండా శ్రీసభ ఏ దశలోనూ మనుగడ సాధించలేదు, లోకరక్ష ధర్మ నిర్వహణలో కీలకమైన పాత్ర వహించడం సామాన్య క్రైస్తువుల క్రైస్తవ ధర్మంలో అంతర్భాగం" (Apostolicam Actuositatem1) "సామాన్య క్రైస్తవులుసాక్షాత్తు ప్రభు క్రీస్తుకు స్వంతమైన, యాజక ధర్మాన్ని (Priestly) ప్రవచన ధర్మాన్ని (Prophetic) రాచరిక ధర్మాన్ని (Kingly) పంచుకోగలుగుతున్నారు. ఈ త్రివిధ ధర్మాల కారణంగానే సామాన్య క్రైస్తవులకు ఇటు శ్రీసభలోను అటు ప్రపంచములోను ప్రభువు నిర్దిష్టమైన అపోస్తోలిక బాధ్యతలను అప్పగించారు" (Apostolicam Actuositatem 2). ఇందువలననే లోకరక్ష ధర్మ నిర్వహణలో దైవ ప్రజలు క్రియాశీలకమైన పాత్రను వహించగలుగుతున్నారు. ఈ సమకాలీన శ్రీసభలో సామాన్య క్రైస్తవులు చైతన్యవంతమైన పాత్రను వహించాలి, బహుముఖ అపోస్తోలిక సేవలు కొనసాగించాలి అని ద్వితీయ వాతికను మహాసభ వారి పాత్రకు మరింత ప్రాముఖ్యతను జతచేస్తూ, శ్రీసభ అపోస్తోలిక ధర్మంలో వారి భాగస్వామ్యాన్ని మరింత ఎక్కువగా ప్రోత్సహించింది.

## III. స్థానిక శ్రీసభ

ద్వితీయ వాతికను మహాసభ తెచ్చిన మార్పుల్లో మరొకటి స్థానిక శ్రీసభకు ప్రాధాన్యతనిస్తూ, పెద్ద పీట వేయడం. శ్రీసభ పలు స్థానిక శ్రీసభల కలయికతో ఏర్పడింది. ప్రతి స్థానిక శ్రీసభల్లో, విశ్వశ్రీసభ దర్శనమిస్తుంది. స్థానిక శ్రీసభలలో విశ్వశ్రీసభ తన ఉనికిని చాటి చెప్పుకుంటుంది. స్థానిక శ్రీసభ పరిచర్యల్లో తన సజీవశక్తిని ప్రదర్శిస్తుంది. "ఈ స్థానిక శ్రీసభలవ్యవస్థాగత నిర్మాణం– విశ్వకథోలిక శ్రీసభ నిర్మాణాన్నే పోలి ఉంటుంది. ఈ స్థానిక శ్రీసభల

సమాహారంతోనే విలక్షణమైన విశ్వశ్రీసభ రూపుదిద్దుకుంటుంది" అని ప్రబోధించింది (Lumen Gentium 23). ఈ కారణం చేతనే పీఠాధిపతులు తమ తమ స్థానిక శ్రీసభలలోని విశ్వాసులలో శ్రీసభ పట్ల ప్రేమాభిమానాలను పెంపొందించాలని గుర్తుచేస్తుంది. స్థానిక శ్రీసభల భాగస్వామ్యంతోనే విశ్వశ్రీసభ క్రీస్తు రాజ్య స్థాపనను సాధించగలదు.

## IV. సర్వ క్రైస్తవ సమైక్యతా ఉద్యమం (Ecumenism)

ద్వితీయ వాతికను మహాసభలో జరిగిన మరొక అద్భుత నూతన విశేషం "సర్వ క్రైస్తవ సమైక్యతా ఉద్యమం" "విడిపోయిన క్రైసవశాఖలన్నింటిని సఖ్యపరచి ఏకత్వాన్ని పెంపొందించడం, ఏకైక శ్రీసభను పునరుద్ధరించడం ద్వితీయ వాతికన్ మహాసభ ప్రధాన లక్ష్యాలలో ఒకటిగా ఎన్నుకున్నది (Unitatis-Redintegratio1). అందుకనే శ్రీసభ నూత్నీకరణ ప్రక్రియలో క్రైస్తవ సమైక్యతా సాధనకు ప్రత్యేక ప్రాధాన్యతను కనబరుస్తూ అనేక రంగాలలో, సమూలమైన సహేతుకమైన సంస్కరణ జరిగిస్తూ, నూత్నీకరణ పవనాలకు ఆజ్యం పోసింది ఈ ద్వితీయవాతికనుమహాసభ.

"క్రైస్తవ సమైక్యతా సాధనపట్ల శ్రీసభలో అందరికి ఆసక్తి ఉండాలి. అంకితభావం ఉండాలి. గురువులు, సామాన్య క్రైస్తవులనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ తమ తమ పరిధుల్లో తమ తమ శక్తి సామర్థ్యాలకనుగుణంగా క్రైస్తవ సమైక్యతా సదాశయంతో తగిన కృషి చేయడానికి ప్రయత్నించాలి. అది క్రైస్తవ సామాజిక జీవనంలో కావచ్చు, సామాజిక సంబంధాలలో కావచ్చు, లేదా వేదాంత చరిత్ర ఇత్యాదుల బోధన అధ్యయనాల్లో కావచ్చు. శ్రీసభలోని ప్రతి రంగంలోను, ఇతర క్రైస్తవ సంఘాలలోను, ఈ సమైక్యతా స్ఫూర్తికి సముచితమైన స్థానము ఉండాలి" (Unitatis Redintegratio 5), అని ఈ సర్వ క్రైస్తవ సమైక్యత కార్యాచరణకు పిలుపునిచ్చింది.

నూతన ఆలోచన కార్యాచరణను ప్రోత్సహిస్తూ సఫలం చేసే ప్రక్రియలో ముమ్ముందుగా ద్వితీయ వాతికను మహాసభ సర్వక్రైస్తవ విశ్వాసులకు ప్రేమాజ్ఞను గుర్తుచేసింది. దాని ప్రకారంగా క్రైస్తవులంతా పరస్పరం ప్రేమకలిగి ఉండాలని,

సోదరీ సోదరుల్లా కలిసి మెలిసి జీవించాలని పిలుపునిచ్చింది. ఈ సఖ్యతా పదం పవిత్రాత్మ సహకారంతో ఊపిరిపోసుకున్నదని వ్యాఖ్యానించింది.

ఈ ఉద్యమం ఎందుకు జరగాలి, ఏవిధంగా జరగాలి అంటూ వాటి నియమాలను జారీ చేసింది. (Unitatis Redintegratio 4) ఆ నియమాలు ఏమనగా:

1. విడిపోయిన క్రైస్తవ సంఘాలకు గౌరవహాని కలిగించే విధంగా ప్రవర్తించకూడదు.
2. వారిని దోషులుగా చిత్రించే విధంగా తీర్పులు చెప్పకూడదు.
3. చర్చల్లోను, చేతల్లోను సత్యానికి ప్రాధాన్యతఇవ్వాలి.
4. పరస్పరం సోదరభావంతో మెలగాలి.
5. ఈ క్రైస్తవ సమైఖ్యతా చర్చలు విద్యాధికులైన వేదాంత నిపుణుల మధ్యనే జరగాలి.
6. ప్రతినిధులు తమ సంఘాల ప్రబోధాలను, విశ్వాస సత్యాలను, సంఘాల ప్రత్యేకతను వెల్లడించాలి.

ఈ క్రైస్తవ సమైక్యత విషయంలో మహాసభ మంచి ఉద్దేశము, గొప్ప సంకల్పము నిస్వార్ధమైనదని, సిస్వాక్షికమైనదని రెండు విషయాలలో బహిర్గతమౌతుంది. అదేమిటంటే:

1. విడిపోయిన సోదరులందరిని క్షమాపణ అడగాలి.

2. మనల్ని బాధించిన వారందరిని మంచి మనస్సుతో మన్నించాలి.

ఈ విధంగా ద్వితీయవాతికన్ మహాసభ క్రైస్తవత్వంలో "భిన్నత్వంలో ఏకత్వాన్ని" గుర్తుచేస్తూ, ముఖాముఖి చర్చలు, ఉమ్మడి ప్రార్ధనలు, క్రైస్తవ ఉద్యమాలకు పిలుపునిచ్చింది.

## V. అన్యమతాలతో అనుబంధం (Relationship with non-Christian Religions)

ద్వితీయ వాతికను మహాసభ తీసుకొచ్చిన మరొక విప్లవాత్మకమైన

సంస్కరణ "అన్యమతాలతో అనుబంధం." అప్పటి వరకు మూసి ఉన్న శ్రీసభ తలుపులను తెరుస్తూ, శ్రీసభతనలోంచి తను బయటకు వెళ్ళి అన్యమతాలతో సత్సంబంధాలను ఏర్పరచుకోవాలనే వినూత్నమైన సాంప్రదాయానికి ద్వితీయ వాతికను మహాసభ తెరతీసింది. అంతే కాకుండా అన్యమతస్తులను కూడా శ్రీసభలోనికి ఆహ్వానించే సహృదయం శ్రీసభ కలిగి ఉండాలని గుర్తుచేసింది. మారుతున్న మానవుని స్థితిగతులతో ప్రపంచంలో చోటుచేసుకుంటున్న మార్పులతో శ్రీసభ కూడా ప్రపంచ మతాలతో పరస్పరం చేరువవ్వాలని నేర్పించింది. కఠోర చర్చల ఫలితంగా ఇందు నిమిత్తం ఒక ప్రత్యేకమైన "Nostra Aetate" అనే అధికారిక పత్రాన్ని ద్వితీయ వాతికను మహాసభజారీచేసింది. ఈ పత్రంలో అన్యమతాల సంబంధ విశిష్టతను తెలియజేస్తుంది. మొట్టమొదటి సారి శ్రీసభఅన్యమతాల నమ్మకాలను, ఆచారాలను, తత్వమహత్వాలను, ఊహకందని విధంగా నిస్వార్థంగా పొగిడింది. ప్రత్యేకంగా హైందవ మతం, భౌద్ధమతం, ఇస్లాం మతస్తులు, దేవునిపైవారికున్న నమ్మకాన్ని గొప్పగా ప్రస్తావించింది. అలాగే ప్రపంచంలో వర్ధిల్లుతున్న వివిధ మతాలన్నీ విలక్షణమైన దార్మిక సిద్ధాంతాలతో నైతిక నియమాలతో పవిత్రమైన అర్చనా రీతులతో కూడిన భక్తి జీవన మార్గాలను ప్రతిపాదిస్తున్నాయి. వాటి బోధనలే శాంతియుత జీవనానికి బాటలు వేస్తున్నాయి అని ద్వితీయ వాతికను మహాసభ విశ్లేషించింది. ఇదే ప్రక్రియలో యూదా మతానికి ప్రాధాన్యతనిస్తూ, క్రైస్తవత్వానికి, యూదామతానికి గల ప్రత్యేక సంబంధాన్ని ప్రస్తావించింది. క్రైస్తవులు యూదులు ఒకే ఆధ్యాత్మిక వారసత్వాన్ని కలిగి ఉన్న నేపథ్యంలో వారి మధ్య సత్వరమే సదవగాహన సఖ్యతా సంబంధాలు పెంపొందాలని ద్వితీయ వాతికన్ మహాసభ కోరుకుంది. ఇదే బాటను కొనసాగించడానికి కథోలికులంతా కలసి ప్రాపంచిక మతాలతో అనుకూల దృక్పథాన్ని కనబరచాలని ప్రస్తుత సినడ్ పరోక్షంగా ప్రోత్సహిస్తుంది. కతోలిక మతాధికారులు, అన్య మతాల అధికారులతో, సభ్యులతో కలసి పలు రకాల ఉద్యమాలలో, సాంఘిక కార్యక్రమాలలో పాల్గొనడం ప్రస్తుత శ్రీసభ విధివిధానాలలో స్పష్టముగా విదితమౌతుంది. ప్రస్తుత సినడ్ యొక్క బాట కూడా అదే. దీని ద్వారా ఒక నూతన సాంప్రదాయానికి ఈ సినడ్ శ్రీకారం చుట్టింది.

ఈ "Nostra Aetate" అధికార పత్రంలో మహాసభ చేసిన సంచలన, విప్లవాత్మకమైన ప్రకటన ఏమనగా: కథోలికశ్రీసభ, అన్య మతాలలోని సత్యమైనది, పవిత్రమైనది దేనినీ తిరస్కరించదు. శ్రీసభ, తన స్వంత బోధనకు అనేక విధాలుగా భిన్నంగా ఉన్నప్పటికి, ఇతర మతాల జీవన విధానం, నియమాలు, సిద్ధాంతాల పట్ల అధిక గౌరవం కలిగి ఉంది. అన్య మతాలు, మనుషులందరికి జ్ఞానోదయం కలిగించే సత్యపు కిరణాన్ని ప్రతిబింబిస్తాయి. శ్రీసభ, తన కుమారులను వివేకంతో దాతృత్వంతో ఇతర మతాల సభ్యులతో చర్చలు, సహకారంతో ప్రవేశించమని కోరుతుంది. క్రైస్తవులు వారి స్వంత విశ్వాసం, జీవన విధానానికి సాక్ష్యమిస్తూ, క్రైస్తవులు కాని వారిలో కనిపించే ఆధ్యాత్మిక నైతిక సత్యాలు, సామాజిక జీవితం, వారి సంస్కృతిని తెలుసుకొని సంరక్షించి, ప్రోత్సహించాలి" (Nostra Aetate 2).

మానవులందరు, వారు ఏ జాతికి, మతానికి చెందిన వారైన అందరూ దేవుని రూపురేఖలను పుణికిపుచ్చుకున్న దేవుని సంతానం. అందువలన ఏ ఒక్కరినైనా ఏ కారణంచేతనైనా ద్వేషించి వివక్ష చూపి వేధించినా, తోబుట్టువుల్లా ఆదరించకపోయినా మనం దేవుని తండ్రీ అని సంబోధిస్తూ ప్రార్థన చేయడానికి యోగ్యులము కామని ద్వితీయ వాతికన్ మహాసభ ప్రబోధించింది. ఇదే సిద్ధాంతాలను పాటించడం వల్ల నేటి సినడ్కు శ్రీసభ వినూత్నమైన తెరతీసింది. మానవులంతా దేవుని సంతానమని అందరు సహోదరిసహోదరులని ప్రస్తుత సినడ్ నిరూపించబోతుంది. ఈ ప్రక్రియలో "అందరిని కలుపుకొని సినడ్ నిర్వహించాలి" అన్న ఆలోచనే ఒక అద్భుతమైన మెట్టు. ఈ తరహాలోనే కథోలికులంతా, అన్య మతాలతో వారి సత్సంబంధాన్ని పంచుకొంటూ భవిష్యత్తులో మరింత బలపడే సూచనలను ప్రస్తావించవచ్చు, అందుకే ఈ సినడ్ విజయవంతం అవుతుంది అనే ఆశాభావం వ్యక్తమౌతుంది.

## VI. శ్రీసభ-మానవ రక్షణ

"Extra Ecclesiam Nulla Salus" అనగా "శ్రీసభ వెలుపల రక్షణ లేదు" అనాది కాలం నుండి శ్రీసభ నమ్ముతూ బోధిస్తున్న ఒక ధార్మిక అంశం. దీనిని మొట్టమొదట కార్తేజ్ సిప్రియను గారు ప్రబోధించారు. ఇదే మాటను

ఎంతో మంది శ్రీసభ పితరులు, పాపుగార్లు సమర్థిస్తూ వారి రచనల్లో మద్దతు పలికారు. వారిలో ప్రముఖులు పునీత అంతియోకుఇన్యాసిగారు. పునీత ఇరేనియస్, ఓరిజెన్ (Origen), లక్తాంతియుస్ (Lactantius), పునీత ఆంబ్రోసు, పునీత యోహానుక్రిసోస్తొమ్ మొదలగువారు.శ్రీసభ మహాసభలు కూడా ఈ మాటకు మద్దతు పలుకుతూ ప్రబోధించాయి. వాటిలో ప్రథమమైనవి ట్రెంటు మహాసభ, మొదటి వాతికను మహాసభ, శ్రీసభ వెలుపల రక్షణ లేదు అని కలాకండిగా చెప్పాయి. కాని 9 వ భక్తినాదపాపుగారు ఈ ధృక్పదానికి నూతన కోణాన్ని చూపించారు. ఆయన చెప్పిన మాట ఏమనగా, “మంచి ఉద్దేశం, నీతి గల జీవితం ఉన్న వ్యక్తులు, శ్రీసభ సభ్యులు కాకపోయినా, రక్షణకు పాత్రులౌతారని” చెప్పారు. ఇదే శైలిలో అపోస్తలుల కార్యములలో పునీత పేతురుగారు వారి ప్రసంగములో విశదీకరించారు. “దేవునికి భయపడుచు, సత్ప్రవర్తన కలవాడు ఏ జాతివాడైనను దేవునికి అంగీకార యోగ్యుడే” (అపో.కా. 10:35).

ఈ రహస్యాన్ని మరింత క్లుప్తంగా వివరించి కతోలిక ధోరణిని మార్చడంలో ద్వితీయ వాతికను మహాసభ నూరంతలుగా సఫలమైనది. మొదటిగా, శతాబ్దాలుగా వస్తున్న శ్రీసభ విశ్వాసాన్ని పరిరక్షిస్తూ “మానవులు ముక్తి భాగ్యాన్ని పొందడానికి శ్రీసభ ఆలంబనం అత్యవసరం” అని చెప్పింది. కాని ఇది కేవలం కథోలిక విశ్వాసులకు మాత్రమే వర్తిస్తుంది. ఎందుకనగా, “తన దివ్య దేహమనే శ్రీసభ ద్వారా క్రీస్తు ప్రభువు మనకు నిత్యమూ ప్రత్యక్షమవుతూనే ఉన్నాడు. మనము ప్రభు సాన్నిహిత్యాన్ని చవిచూడడానికి, రక్షణ భాగ్యాన్ని పొందడానికి విశ్వాసము, జ్ఞానస్నానము ఎంత అవసరమో స్వయంగా ప్రభువే నొక్కిచెప్పారు (మార్కు 16:16, యోహాను 3:5). అదే సమయంలో మానవ రక్షణసాధనలో శ్రీసభ ఆవశ్యకత ఎలాంటిదో కూడా ప్రభువు తెలియజేశారు. కాబట్టి శ్రీసభను సాక్షాత్తూ దేవుడే తన ద్వారా స్థాపించారని, మానవ రక్షణకు శ్రీసభ సభ్యత్వం అనివార్యమని తెలిసికూడా శ్రీసభలో ప్రవేశించడానికి నిరాకరించేవారు, శ్రీసభలో కొనసాగడానికి ఇచ్ఛగించని వారు ముక్తి భాగ్యాన్ని పొందలేరు” (Lumen Gentium 14) అని దృఢంగా నొక్కి వక్కాణించింది. కాని “శ్రీసభ

ఒక్కటే రక్షణకు సాధనము కాదని" ఒక విప్లవాత్మకమైన ప్రబోధాన్ని బోధించింది. ఇందుకే ద్వితీయ వాతికను మహాసభ "మరో పెంతుకోస్తు దినం" అని చెప్పుకోవడంలో యావత్ శ్రీసభ గర్విస్తుంది. మరి మానవ ముక్తి విషయంలో సాంప్రదాయమైన ధోరణి నూతన ఒరవడిని జతచేస్తూ మహాసభ బోధించిన అంశాలు (Lumen Gentium 16) :

1. దేవుడు నిర్దేశించిన రక్షణ ప్రణాళిక కేవలం ఎన్నుకొన్న ప్రజలకే కాదు. వారి అనుదిన జీవితంలో 'దేవుడు ఉన్నాడని ఆయనే సృష్టికర్తయని మనసారా విశ్వసిస్తే చాలు' అట్టి వారు రక్షణ భాగ్యానికి యోగ్యులౌతారు.

2. ఇంకొందరుంటారు: వారికి క్రీస్తు సువార్తా సందేశం గురించి గాని, ఆయన స్థాపించిన శ్రీసభ గురించి గాని తెలియదు. అయినా వారు చిత్తశుద్ధితో దైవ సాన్నిహిత్యాన్ని కోరుకుంటూ దేవుడు అనుగ్రహించే కృపావర ప్రభావంతో తమ అంతరాత్మల ప్రబోధాలకు విధేయులై ధర్మబద్ధంగ జీవిస్తూ తమకు తెలియకుండానే దైవ సంకల్పాన్ని నెరవేర్చుతూ ఉంటారు. అట్టివారు రక్షణ భాగ్యానికి యోగ్యులు కాగలరు.

3. అలాగే ఇంకా దేవుని గురించి తెలియని వారు మరికొందరుంటారు, అయినా వారు సత్కర్మలాచరిస్తూ, సజ్జనులుగా జీవిస్తుంటారు. మంచి చెడులతారతమ్యమెరిగి, మంచినే ఎంచుకొని సన్మార్గంలో జీవిస్తూ ఉంటారు. అట్టి వారికి దేవుడు రక్షణ భాగ్యాన్ని అందించకుండా ఉండడు.

4. పై చెప్పబడిన కోవకు చెందిన వారిలో గల మంచితనాన్ని 'సువార్తా బీజాలు" మొలకెత్తడానికి అనువైన 'మంచినేల' గా భావిస్తుంది శ్రీసభ. అట్టివారికిశ్రీసభ వెలుపల ఉన్నా కూడా రక్షణ సభిస్తుంది.

ద్వితీయ వాతికను మహాసభ ప్రకారం మానవ రక్షణ విషయంలో కేవలం కథోలికులు మాత్రమే అర్హులు కాదని, మంచి ఉద్దేశం ముక్తి కాంక్ష ఉన్న ఏ వ్యక్తియైనా రక్షింపబడతాడు. శ్రీసభ క్రీస్తు శరీరమైనప్పటికీ, యేసు క్రీస్తు యొక్క రక్షణ కార్యకలాపాలు, శ్రీసభ వెలుపల కూడా చురుకుగా ఉంటాయి. అంటే రక్షణ చరిత్రలో సమస్త మానవాళి కూడా భాగస్వామ్యులని ద్వితీయ

వాతికను మహాసభ బోధిస్తుంది. ఈ భాగస్వామ్యంలో అందరూ దేవుని బిడ్డలని ఉద్ఘాటించింది.

## ముగింపు

ప్రస్తుత సినడ్, సినడాలిటీను ముందు రూపము దాల్చుటలో, ద్వితీయ వాతికను మహాసభ విజయవంతమైందని చెప్పుకోవచ్చు. అణువణువునా సంస్కరణలతో, మార్పులతో "గది కిటికీలను తెరచి, క్రొత్త గాలిని లోపలికి ప్రవేశింపనివ్వడంలో" నూరంతలుగా ఫలించింది. ప్రస్తుత సినడ్ లక్ష్యాలైన సహవాసం (Communion), భాగస్వామ్యం (Participation), ప్రేషితకార్యం (Mission), ద్వితీయ వాతికను మహాసభలో చాలా స్పష్టంగా ఆవిష్కృత మయ్యాయి. అనేక విధాలుగా శ్రీసభ భావితరాలను, ద్వితీయ వాతికను మహాసభ నూత్నీకరణ వైపు నిర్దేశించింది. కాబట్టి ఈ ప్రస్తుత సినడ్ కూడా అదే నూత్నీకరణ తరహాలో ప్రయాణిస్తూ శ్రీసభ భవిష్యత్తుకు, పురోగతికి సమర్ధవంతమైనదిగా, సార్ధకమైనదిగా ఉపయుక్తమైనదిగా మారాలని కోరుకుందాం.

# 3. పవిత్ర గ్రంథములో సినడ్ ప్రస్తావన

- బ్రదర్ వంపుగళ్ళ ప్రదీప్



## ఉపోద్ఘాతం

సంఘం అంటే కలసి జీవించడం, కలసి ప్రయాణించడం. సృష్టిని, ప్రకృతిని, సృష్టించిన తర్వాత మానవ సృష్టికి వచ్చినప్పుడు మనిషి ఒంటరిగా ఉండడం మంచిది కాదని తలంచి నరునికి తోడుగా నారిని కూడా సృజించెను. మానవ సృష్టిగావించిన తదుపరి మానవుని ఒంటరిగా విడువక తనతో ఉండునట్లు, దేవుడు మనిషి కలసి ఉండులాగున చేసెను ఈ సహజీవన ప్రయాణం దేవునికి, మానవునికి మధ్య అలనాడు ఏదేనులో ప్రారంభమయ్యేను. ప్రతి రోజు దేవుడు, మనిషి ఏదేను వనములో కలసి సంచరించుచుండేవారు. కానీ మానవుని బలహీనత దేవునికి మనిషికి మధ్యలో మాత్రమే దూరాన్ని ఏర్పరచలేదు కానీ మనిషికి, మనిషికి మధ్యలో కూడా వర్ణింపశక్యంకాని దూరాన్ని ఏర్పరచుకున్నాడు. మనిషిలో ఉన్న దైవత్వం అనే గుణాన్ని కనుమరుగైపోవునంతగా, దేవుడు మనిషిలో ఉంచిన తన ఊపిరిని (దివ్యఆత్మ, దైవత్వం) సాతానువలలో పడికోల్పోయాడు. ఎవరు తప్పుచేసింది? అని దేవుడు ఆదామును ప్రశ్నించిన సమయంలో నీవు నాకు తోడుగా ఇచ్చిన అవ్వ ఈ తప్పుకు కారణం అని మనిషికి మనిషికి మధ్యలో విభేదం ఏర్పరచుకున్నాడు. కానీ దేవుడు మాత్రం తనకు మనిషి మీదగల ప్రేమను మాత్రం విడనాడక నిత్యం కలసి జీవించాలి అని మనిషి - మనిషి, దేవుడు మనిషి ఐక్యమత్యంతో జీవించాలి అని తిరిగి నోవాసమయంలో జల ప్రళయం తర్వాత మరల దేవుడు మానవాళి పట్ల ప్రేమను చాటుకున్నారు. (ఆది 8:22). ఆది 9:12-15 మానవుడు తప్పు త్రోవలో పడిన ప్రతీ సారి సందర్భానుకూలముగా,

సమయానుసారం దేవుడు సూత్రీకరిస్తూనేవున్నారు. మానవజాతి తమ రుచులకు, అభిరుచులకు తగినట్లు చిన్న చిన్న సమూహాములవలే మతం, కులం, ఆచారం, సాంప్రదాయం, వ్యవహార కట్టుబాట్లను అనుసరించి వేరే వర్గం వారిని శత్రువులు వలే లేక పరాయి వారివలే భావించి అనేక విభజనలు చేస్తూ అంతటితో ఆగకుండా తమ తమ సొంతవర్గంలో కూడా అనేక స్వప్రయోజనాలకు ఆశపడి పదవి, ద్వేషం, ఈర్ష్య, కోపం, అనేవాటి వలన సొంతవర్గం, సంఘంలో కూడా ఏకతాటి ప్రయాణం బహుకష్టంగా మారిపోయింది. ఇలా అనేక బానిసత్వపు చిక్కుల్లో పడిపోయిన మానవుని దేవుడు జ్ఞప్తికి తెచ్చుకుని దీవిస్తున్నారు (కీర్తనలు 115:12; కీర్తనలు 8:4). బైబిలు గ్రంథంలో ఇస్రాయేలు అను ఒక సంఘమును చూస్తున్నాము. బాని సత్వపు బ్రతుకున, కన్నీటిమున్నీటితో నిండిపోయి, ఆశలు అణగారిన సమయంలో దేవుడు తన ప్రతినిధియైన మోషేతో ఇట్లు పలికెను (నిర్గమ 3:7) "నా ప్రజలు అనుభవించు బాధలను కన్నులారా చూచితిని" అని దేవుడు ఇక్కడ సంబోధించడం గ్రహించ వలసిన విషయం. దేవుని ప్రజల జీవిత విధివిధానంలో మార్పులు వచ్చి వారు అనుభవిస్తున్న అగచాట్లు దేవుని హృదయమును నొప్పించెను. "నా ప్రజలు" అనే మాట ద్వారా దేవుడు మనుష్యునితో ఉన్న బాంధవ్యం ఎంతగొప్పదో అర్ధమగుచున్నది. కలసి జీవించడం, కలసి ప్రయాణం చేయడం సరిగ్గా ఇదే మన పావన జనకులు అయిన ఫ్రాన్సిస్ జగద్గురువులు ఏర్పాటు చేసిన (సినడాలిటీ) సమాలోచన/ కలసి ప్రయాణించే శ్రీసభ. ఒంటరి జీవితానికి నియమని బంధనలు ఎక్కువ అవసరం ఉండకపోవచ్చు కానీ సంఘ జీవితానికి, సంస్కృతి, సంస్కరణ, నియమని బంధనలు అవసరం, అత్యవసరం.

సంఘ జీవనానికి, ఐకమత్యం, కలసి కట్టుగా జీవించడం అనేవి ఆయువు పట్టువంటివి. కానీ ఈ కలసి జీవించడం, కలసి ప్రయాణించడం అనేది ఇప్పుడు ఇప్పుడే వచ్చిన విధానం కాదుగానీ ఇది బైబిలు ఆధారంగా ఎప్పటి నుండో వస్తున్నది. మరి ముఖ్యముగా సంఘజీవనంలో, అనేక సంస్కరణలు తగిన సమయంలో జరుగుతూనే ఉన్నాయి. నా ఆలోచన ప్రకారం సంస్కృతి, సంఘం ఉన్న ప్రతీచోటా సంస్కరణ అతిముఖ్యం. దైవానుగ్రహంవలన యుక్త

సమయంలో, కాలం పరిపూర్ణమై నప్పుడు ఈ సంస్కరణలు తప్పక జరుగుతాయి.

నిర్గమ 12:50–51 బానిసత్వంలో ఉన్న ప్రజలు తమ జీవన విధానాన్ని సరిచేసి కొనుటకు సంసిద్ధులైనప్పుడు తమను తాము సంస్కరించుకొనుటకు సిద్ధపడినప్పుడు దేవుడు వారిని విడిపించెను. ఎదో నామకార్థంగాకాక దేవుడు వారికీ తోడైనడిపించెను (నిర్గమ 13:21–22). ఈ సినడాలిటీ సమాలోచన అనేది మనలో ఉన్న కొన్ని విషయాలను సరిచేసుకొని, నూత్ని కరించుకొనుటకు తోడ్పడును. యిస్రాయేలీయులు తమ ప్రయాణాన్ని కొనసాగిస్తుండగా వారిలో, వారి జీవిత శైలిలో అనేక అవాంఛిత క్రియలను గమనించిన దేవుడు తన ప్రజలతో మోషే ద్వారా నియమ నిబంధనలను మరింతగా చెప్పాలి అంటే సీనాయి పర్వతం వద్ద తన ఆజ్ఞలను ఇచ్చి యిస్రాయేలు సంఘమునునుత్నీ కరించి ఒక ఒప్పందం చేసుకున్నారు.

## అబ్రాహాముతో ఒడంబడిక (ఆది 15:18)

మన అందరికి తెలిసినట్లే ఒప్పందం/ఒడంబడిక అంటే త్రెంచుకోలేనిది, రద్దుచేయలేనిది, జవదాటకూడనిది, ఇది ఒప్పందం. పాతని బంధనలో దేవుడు తన ప్రజలు పదే పదే తప్పిపోవడాన్ని గమనించి తన ప్రజలతో తాను ఒడంబడిక చేసుకొనెను (నిర్గమ 19:5 24:1–7, 12). ఒడంబడిక అనిన చేసిన బాసను తూచాతప్పక పాటించ వలసినది. మార్చుడానికి వీలులేనివి. ఇచ్చిన వాగ్దానమును తప్పక పాటించవలసినవి. ఇది ఈ విధంగా ఉండగా ప్రస్తుత బైబిలు గ్రంథంలో నూతన నిబంధన పాత నిబంధన అని రెండు రకాలని బంధనలు ఏమి ? పాత అని, క్రొత్త అని వాస్తవానికి అదిపాత, క్రొత్త కాదు కానీ పాతనిబంధనను మొదటిని బంధనగాను, క్రొత్తనిబంధనను రెండవదిగాను పరిగణించాలి. మొదటి నిబంధనలో చేసిన వాగ్దానములు ప్రజలు తమ బలహీనతల వలన నిలబెట్టుకోలేకపోయారు. అయినప్పటికీ పడిపోయిన ప్రతీసారీ దేవుడు తన సంఘంలో సంస్కరణలు అలనాటి దేవుని ప్రతినిధులు అయినవ్యక్తుల ద్వారా, రాజుల ద్వారా, యాజకులద్వారా, ప్రవక్తల ద్వారా ప్రజలను సమావేశ పరచి దేవునితోను, సాటి సంఘ సభ్యులతోను చర్చలు

చేసుకుంటూ నేటికీ మానవ జాతిని దేవుడు తన సాన్నిద్యంతో, సహవాసంతో నడిపిస్తూ ఉన్నాడు. సంస్కరణ జరగడం అంటే ఎదో ఒక వ్యక్తి నిర్ణయంకాక దేవుడు దేవుని ప్రతి నిధులు అయిన మానవులు కలసి సమాలోచనలు జరిపి, పవిత్రాత్మ దేవుని తోడ్పాటుతో జరిగించినవి. అలనాడు జరిగినవి నేడు ఈ సినడ్ అనే ప్రక్రియ ద్వారా నూతన యిస్రాయేలు సంఘము అయిన, తల్లియైన పవిత్ర శ్రీసభలో దేవుని సంకల్పాను సారం, హెచ్చు తగ్గులు లేకుండా అందరమూ భాగస్వామ్య శ్రీసభగా మారుతున్నాం.

## మోషే

యిస్రాయేలు ప్రజలు ఐగుప్తు బానిసత్వం నుండి బయటకు రావడం కేవలం వారి ఆలోచన మాత్రమే కాదు కాని దేవుని సంకల్పం – నిర్గమ3:7, దైవ సేవకుని ప్రతిస్పందన – నిర్గమ 3:4, దైవప్రజలు అయిన ఇశ్రాయేలు ప్రజల ఎదురుచూపు– నిర్గమ 1:11–14. వీరు అందరు కలసి చేసిన సమాలోచన, భాగస్వామ్యం, ప్రేషితకార్యం నేడు చరిత్రలో యిస్రాయేలు ప్రజల విడుదలనుచూస్తున్నాం. ఇదే మొదటి భాగస్వామ్య యిస్రాయేలు సంఘం. ఇలా సంస్కరణలో భాగంగా జరిగినవే 10 ఆజ్ఞలు ( నిర్గమ 20:1–17) ఈ 10 ఆజ్ఞలు ఒక ఒడంబడిక/ ఒక సంస్కరణ/ నిబంధన. దీనిని సుస్థిర పరచడానికి మోషే బలి అర్పించి రక్తపు నిబంధనగా మార్చాడు. అలనాటి ఆ పశువుల బలి రక్తం నిబంధనకు, సంస్కరణకుగుర్తు (నిర్గమ 24:8). ఇంతటి సుస్థిరమైన నిబంధన కూడా అనేక మార్లు మోషే సమయంలో ప్రజలు పెడచెవిన పెట్టారు. కాని దైవసేవకుడైన మోషే పట్టు విడువక అందరము బాగస్వాములము, దేవుడు, మనిషికలసి ప్రేషిత కార్యమును నెరవేర్చవలెను అని ప్రజల పక్షమునుండి దేవుని, దేవుని పక్షమున నుండి ప్రజలను కలుపుతూ (నిర్గమ 34:8) తన ఉనికిని చాటుకున్న ఉత్తమ దైవ సేవకుడు నేటిసినడాలిటీలో మన గురువులు అలనాటి మోషేకు సాదృశ్యంగా నిలుస్తున్నారు.

## యెహోషువ: భాగస్వామ్యం - ఐక్యమత్యం

మోషే తదనంతరం యెహోషువ తన భుజస్కందముల పైన ఇశ్రాయేలీయులను వాగ్దాన భూమికి నడిపించే బాధ్యతను స్వీకరించిన తరువాత, యెహోషువా దేవుడు చేసిన నియమముల ప్రకారము 12 గోత్రముల వారిని ఐక్యపరిచి, వారికి కేటాయించిన పనులను అందరు కలసి ఒకరికి ఒకరు సహాయం చేస్తూ, తోడ్పాటుతో యొర్దానునదిని ఎటువంటి ఇబ్బంది, ఆటంకము, భిన్నాభిప్రాయములు లేకుండా సునాయా సముగా ఏక తాటి పై దాట గలిగారు. 12 గోత్రములు విభజన చేయడానికి ముందు పెద్ద సమస్య లేకుండా ఉండవచ్చు గాని, గోత్రవిభజన చేసిన తర్వాత అందరు ఏకాభిప్రాయముతో ఒకే ఆలోచనతో, సహ భాగస్వామ్యంతో, సమాలోచనతో దేవుని తోడ్పాటుతో మాత్రమే యొర్దాను నదినిదాటగలిగారు, యెహోషువ 3:12, 14; 4:9. ఇది భాగస్వామ్య శ్రీసభ కలసి నెరవేర్చిన ప్రేషితకార్యం. భాగస్వామ్యం అనగా పంచుకోవడం - ఐక్యమత్యంగా కలసి ఉండడం, ఏకతాటిపై కలసి ప్రయాణించడం విజయ సిద్ధింపుకు సోపానములు. దేవునికి అసాధ్యమైనది ఏదియునులేదు (మార్కు 9:23), కాని దేవుడు సాధారణమైన, బాని సత్వంలో మ్రగ్గిన యిస్రాయే లీయులను తన శక్తి ద్వారా వినియోగించుకొని ఐక్యమత్యం, కలసి ప్రయాణించడం ముఖ్యంగా దేవుని వాక్కుకు విధేయులై, చెప్పినది చెప్పినట్లుగా ఆచరించి, అసాధ్యమైన కార్యమును కూడా సుసాధ్యంగా కత్తి, బాకు లేకుండా దైవప్రసన్నత, దైవస్తుతి ద్వారా యెరికోగోడలను నేలమట్టంచేశారు. మత్తయి18:19-20 ఇద్దరు లేదా ముగ్గురు కూడిన చోట దేవుడు వారి మధ్య వసించును. శ్రీసభ కూడా మన వద్ద నుండి ఆశించునది ఇదియే. ప్రాపంచిక పోకడలో అధికారం, కులం అనే విభజనలు మాని ఐక్యమత్యంగా అందరు కలసి జీవనాన్ని కొనసాగిస్తూ, దేవుని సజీవ వాక్కు ద్వారా నడిపింపబడి, తండ్రి దేవుడు మన ద్వారా ఏ ప్రేషిత కార్యమును చేయుటకు కృతనిశ్చయులైయున్నారో ఆపనిని సంపూర్తిగా నెరవేర్చుటకు దేవుని చిత్తాను సారం ఏర్పాటు చేయబడినదే ఈ సినడ్. యెహోషువ 6:1 - శ్రీసభ, (దేవుని జనం) కలసి కట్టుగా ప్రయాణం చేయడం అనేది విరోధికి భయమును

కలిగించును. యెరికో వాసులు యిస్రాయేలీయులకు భయపడి వారి ద్వారములను బిగించుకొని ఉండెను. కానీ దేవుని వాక్కు అనుసారం యిస్రాయేలీయులు పట్టణము చుట్టూ తిరుగగా, కోటగోడలు ఉన్నవి ఉన్నట్లుగా కుప్పకూలిపోయెను (యెహోషువ 6:20). ప్రియ స్నేహితులారా ఇక్కడ మనం గమనించవలసినది ఏమన, నేటి సినడ్ద్వారా మన జగద్గురువులు నేటి సమస్త శ్రీసభను ఐక్యపరచి, దేవుని బిడ్డలు అనిన విరోధికి భయం కలిగించునట్లు చేయును. రెండవ మెట్టుగా, కలసి ప్రయాణించడం మాత్రమే కాక దైవవాక్కును ప్రకటించడం, పాటించడం ద్వారా సాతానుకు, విరోధికి అపజయం కలిగి దైవరాజ్య స్థాపన జరిగించబడును. ఇది దైవ సంకల్పం ఇది దైవం అప్పగించిన ప్రేషితకార్యం. ఇదే నేటి సినడ్.

## న్యాయాధిపతులు

దేవుడు యిస్రాయేలు ప్రజలకు ప్రతినిధిగా మోషే, అహరోను, యెహోషువ తరువాత న్యాయాధిపతులను ఏర్పరచి వారి వారి చిన్న సంగములలో అనేక సంస్కరణలు, అనేక విధములైన సమస్యలకు పరిష్కారములు నెరవేర్చుచుండెను. న్యాయాధిపతిగా వారి వారి బాధ్యతలు నెరవేరుస్తూ వారి కంటూ కేటాయించిన విధులను నిర్వహిస్తూ ఉన్నారు. కానీ, ఇక్కడ గమనించ వలసినది ఏమనగా ఇప్పటి వరకు కేవలం పురుషులు మాత్రమే ఆధిపత్యం వహిస్తూ వచ్చారు కానీ న్యాయాధిపతుల సమయంలో స్త్రీలు కూడా కలసి దైవ సంఘమైన యిస్రాయేలు ప్రజలను నడిపించారు. దెబోరా అనే స్త్రీ తన విషయ పరిజ్ఞానం ద్వారా దైవ ప్రణాళికలో తన దైన శైలిలో దేవుని చిత్తాన్ని నెరవేర్చింది. దేవుడు ఈ సినడల్ (భాగస్వామ్య, సమాలోచన) శ్రీసభకు ఆది నుండి ఇలా పునాదులు వేస్తూనే వచ్చారు (న్యాయాధిపతులు 4,5 అధ్యాయాలలో దెబోరా అనే స్త్రీ తన పరిచర్యలు చూస్తున్నాం). “యెహోషువ కూడా తన పరిచర్యను కేవలం పురుషులకు మాత్రమే కాక స్త్రీలకు, పిల్లలకు, పరదేశీయులకు సరిసమానంగా భోదించుచుండెను” ( యెహోషువ 8:35). నిస్పక్షపాతంగా నీవు నేను కూడా జీవించుటకు నేటి సినడల్ శ్రీసభ మనలను ఆహ్వానిస్తుంది.

## ఎజ్రా (సమాలోచన సంఘం - సంస్కరణ సంఘం)

మానవ బలహీనత వలన సంఘాలలో లోటు పాటులు సర్వసాధారణంగా వస్తూనే ఉంటాయి, ఉన్నాయి. అదే విధంగా దేవునితో నిబంధ నేర్పరచుకున్న ఈ యిస్రాయేలు సంఘంలోను అనేక సందర్భాలలో లోటు పాట్లు కనిపిస్తూనే ఉన్నాయి. ఈ లోటుపాట్లు సరిచేసే ప్రక్రియను, సంస్కరణ అంటారు. మరొక మాటలో చెప్పాలంటే మరమత్తులు చేయడం అంటాం. భవనాలకు మరమత్తులు చేస్తే, సంఘానికి సంస్కరణ చేస్తాం. ఈ సంస్కరించుకొనడానికి ఏర్పాటు చేయబడిన దైవ ప్రణాళికే ఈ సినడాలిటీ. యెరూషలేమును కొల్లగొట్టి యిస్రాయేలీయులను బాబిలోనియాకు ప్రవాసముగా కొనిపోయారు. దేవునినగరమైన యెరూషలేము, దేవాలయము దుర్భర అవస్థలో ఉండగా దైవాను గ్రహంవలన శిథిలమైన దేవాలయమును నిర్మించుటకు రాజులను ప్రేరేపించి (ఎజ్రా 1:1,2), ఆరాధనను తిరిగి ప్రారంభించుటకు యాజకులను సిద్ధపరచి (ఎజ్రా 3:2,3) దేవాలయమును పునర్నిర్మించుటకు ప్రజలను దేవుడు ప్రేరేపించి సిద్ధపర్చి పనిని ప్రారంభించెను. ఎజ్రా3:8 ఎన్నో అడ్డంకులు వచ్చినా ప్రవక్తల ద్వారా ప్రోత్సహిస్తూ (ఎజ్రా 5:1-3), ఇలా అందరూ కలసి దేవుని కార్యము, ప్రేషిత కార్యమును పూర్తిచేసిరి (ఎజ్రా 6:13-16). రెండవదిగా ఆనాటి సాంఘిక ఆచారం ప్రకారం యిస్రాయేలీయులు వేరొక జాతితో వివాహ సంబంధం ఏర్పరచుకొనకూడదు. కానీ అనేక మంది ప్రవాసంలో ఉండివారికి ఇష్టం వచ్చినట్లు వైవాహిక సంబంధాలను ఏర్పరచు కొనిరి కానీ ఎజ్రా అనే ధర్మశాస్త్ర పండితుడు (ఎజ్రా 7:6) ధర్మశాస్త్రం ప్రకారం నియమములు ఉల్లంఘించిన వారిని శిక్షించడం కాక వారు పశ్చాత్తాపపడి, ప్రాయశ్చిత్తం చేసుకొనునట్లుగా, మరల వారి అన్యజాతి వివాహములు రద్దుచేస్తూ యిస్రాయేలు సంఘమును సంస్కరించి దేవునితో ఐక్య పరచుటకు కృషిచేసాడు (ఎజ్రా 9:1; 10:1, 3, 6, 10, 17, 19, 44).అవును ప్రియ స్నేహితులారా! కలసి ప్రయాణించడం అంటే కేవలము భౌతికంగా కలసి నడవడం మాత్రమేకాక, మానవ బలహీనతల వలన ప్రత్యేకించి విశ్వాసంలో కుంటుపడిన, కుప్పకూలిన ప్రతి ఒక్కరిని మనతో కలసి విశ్వాస ప్రయాణం చేయించడం నేటి విశ్వశ్రీసభలో

అనేక మంది విశ్వాసులు, ఆధ్యాత్మికంగా కుంటి, గ్రుడ్డి, మూగ, చెవుడు, అవిటి ఇంకా కఠినంగా చెప్పాలి అంటే మరణించిన శరీరములు వలే జీవిస్తున్నాము. కానీ నేటి సమాలోచన, భాగస్వామ్య శ్రీసభ మనలను అందరిని కలసి ప్రయాణం చేయడానికి, ఆప్రయాణం కూడా సిలువ నీడలో, మనకంటే ముందుగా నడచిన ఆ సిలువ మార్గంలో, దేవుని సజీవ శరీర రక్తములు అయిన దివ్యసత్ప్రసాద పోషణలో కలిసి ఉంటూ మనము భవిష్యతరాల వారు కూడా విశ్వాస ప్రయాణంలో ఉన్నతమైన జీవనం సాగించడానికి, దేవునికి ప్రీతికరమైన జీవనం కొనసాగించు లాగున నేటి ఈ మన సినడల్ శ్రీసభ ఆహ్వానిస్తుంది.

## నెహెమ్యా

బాబిలో నియా నుండి మూడవ జట్టులో తిరిగి వచ్చిన వారిలో నెహెమ్యా ఒకడు. కానీ అప్పటికే దేవుని నగరమైన యెరూషలేము గోడలు శిధిలావస్థలో ఉన్నవి. ఈ విషయం గ్రహించిన నెహెమ్యా యెరూషలేము ప్రాకారం మళ్ళీ నిర్మించబడవలెనని కన్నీరుకార్చి, ఉపవాసం ఉండి ప్రార్థించేవాడు (నెహెమ్యా1:3) కానీ ఈ నెహెమ్యా కేవలము రాజుకు పానీయ వాహకుడు మాత్రమే. దేవుని నగరం పట్ల తనకు గల ప్రీతివలన రాజు అనుమతి పొందుకొని కోటబురుజులను నిర్మించుటకు అవసరమైన కలప కూడా శత్రువులు, ప్రవాసానికి తీసుకుపోయి, బానిసత్వం చేయించుకుంటున్న రాజు తనం తటతానుగా సహాయము చేయులాగున మెప్పించి రాజు హృదయమును గెలుచుకొని నగర ప్రాకారములు తిరిగి నిర్మించ పూనుకున్నాడు (నెహెమ్యా1:11, 2:3). ప్రాకారములు తిరిగి నిర్మించాలి అని భావించినది నెహెమ్యా మాత్రమే కానీ ఈ దైవిక కార్యమునకు స్వయముగా కొందరు వచ్చి పనినిచేశారు (నెహెమ్యా 3:1). లేవీయులువచ్చి ప్రాకారములు నిర్మించుటలో తోడ్పడిరి (3:17, 32) అట్లే యాజకులు (3:22) ఇతర జనములు (3:27) ఇలా అందరు కలసి పనిచేయడం ద్వార మాత్రమే ఎన్నో ఎదురు ఆటంకాలు, విమర్శల మధ్యలో కూడా (4:2) వారి ప్రేషిత కార్యం మాత్రం ఆగిపోనీయక

కొనసాగించి పూర్తిచేసారు (4:6, 6:15,16). కలసి ప్రయాణించడం అనేది నా దృష్ట్యా ప్రతి ఒక్కరికి ఒక రక్షణ వలయమును, రక్షణ ప్రాకారమును, కంచుకోటను నిర్మించు కోవడంవంటిది. భౌతిక రక్షణ మాత్రమే కాక మానసిక/ ఆర్థిక రక్షణ కూడా. ఏ విధంగా అనగా నెహెమ్యా కాలంలో ఆర్థిక పరిస్థితి అందులో యూదులలో కష్టతరంగానే ఉండేది. "బిడ్డలను మారకం చేసి ధాన్యము కొని తెచ్చుకొనేవారు" (నెహెమ్యా 5:1). కానీ నెహెమ్యా దైవాను గ్రహంవలన అందరిని ఏకతాటిపై నడిపించడమేకాక, భాగస్వామ్య జీవితము జీవించినట్లుగా హెచ్చరించి, సరిచేసి సమాజమున మానసికంగా, ఆర్థికంగా అన్నింటి కంటే ఆధ్యాత్మికంగా బలోపేతం చేసెను (నెహెమ్యా 5:4, 6, 8, 9, 10-13). భాగస్వామ్య శ్రీసభ అనగా పరులపట్ల శ్రద్ధ కలిగిన శ్రీసభ, ఐక్యమత్య శ్రీసభ, సమాలోచన శ్రీసభ, సహస్త శ్రీసభ, సహజీవ శ్రీసభ ఇదే నేటి సినడల్ శ్రీసభ.

## ప్రవక్తలు

ఈ విధంగా ఇంకా ఎన్నో సందర్భాలలో, ఎందరో వ్యక్తుల ద్వారా దేవుడు తనదైన శైలిలో, కాలానుగుణంగా శ్రీసభను బలోపేతం చేస్తూ, ఐక్య పరుస్తూనే ఉన్నారు. నీతిన్యాయంగా జీవించాలి అనేది మాత్రమే ప్రవక్తల ప్రబోధం కాదుకానీ, దుష్ట వర్తనము నుండి వైదొలగి మంచి జీవితాన్ని జీవించాలి అని సామాజిక, ఆర్థిక, తారతమ్యము లేక అందరూ కలిసి ఎవ్వరిని అనాధారము చేయకుండా ప్రత్యేకముగా ఆనాథలు, విధవరాండ్రు, పేదలను అభాగ్యులను వేరుపరచక అందరూ కలిసి ఒకరికి ఒకరు తోడుగా జీవించాలి అనేది ప్రవక్తల బోధన (యెహెజ్కేలు 11:16-20, 18:23, 26, 31). నేటి విశ్వాస శ్రీసభలో కూడా దేవుని హృదయ భారం ఇది ఒక్కటే. అందరూ కలవడం ఒక ప్రక్క అయితే, ఆ కలయికకు ముందుగా దుష్కార్యముల నుండి వైదొలగడం మరొక ప్రక్క. సర్వ శ్రీసభ ఒకే కుటుంబముగా జీవించ గలిగినప్పుడు ఎవరు దుష్కార్యాములకు పాల్పడతారు? అందరూ నూతన హృద్యము కలిగి ప్రేమాను రాగాలతో కలిసి జీవించుటకు ఆహ్వానమే నేటి సినడల్ శ్రీసభ.

## సూసన్న

కతోలికులమైన మనకు అందరికి సూసన్న జీవితం గూర్చి తెలిసినదే, (దానియేలు13 వ అధ్యాయం) సూసన్న జీవితములో ఎదుర్కొన్న సంఘటన చాలా గోరమైనది. కుటుంబం, కన్నబిడ్డలు, నమ్మినబంటులు, కట్టుకున్న భర్త, తల్లితండ్రులు ఏమియు బదులు పలుకలేకపోయారు. మానవ తీర్పు తప్పుత్రోవలోపోతున్నది. చివరకు మరణమే దారిలా కనిపించినది, కానీ ఆమె విశ్వసించిన దేవుడు, ఆమె ప్రార్థించిన దైవం ఎప్పుడైతే ఆమెకు విధించిన తీర్పులో జోక్యం చేసుకున్నారో నిజం వెలికిరావడం ఆరంభించింది. ఆత్మ దేవుని జోక్యం వలన నిజం ఏమిటో అచ్చట ఉన్న సంఘం అంతా గ్రహించిగినది. గమనించ వలసిన విషయమేమనగా , కేవలం మానవ తీర్పు, మానవ ప్రయాణం అనేవి సత్యము అనే గమ్యమునకు ప్రతిసారి సంపూర్ణముగా చేర్చకపోవచ్చు 2 కొరింతీ 4:4. ఇహలోక సాతాను సత్యము మనము గ్రహించకుండుటకు మనలను గ్రుడ్డివారిగా మార్చివేయును, అప్పుడు కన్నులు ఉండియు చూడ జాలని అంధులుగా మారిపోతాం, కానీ దేవునితో ఆయన సహవాసంలో కలిసి ప్రయాణించే వారితో, ఆయన ప్రసన్నత వారి కంటే ముందుగా వెళ్లి వక్ర మార్గాలను సక్రమం చేయును, గరుకు మార్గములను నునుపు చేయును, లోయలను పూడ్చివేయును, అగ్నిలో, నీటిలో నడచినను ఏ ముప్పు వాటిల్లదు. ఇలా దైవం మానవుడు కలిసి ప్రయాణించేందుకు దైవం ఏర్పరచిన మార్గం మన శ్రీసభ. దైవ నిర్ణయం దేవుని తీర్పువలన నిత్యం ఇహలోకంలో కూడా సత్యమైన మార్గములో నడిపించును. ఎందుకనగా మనం అనుసరించే యేసు, ఆయనయే సత్యం, జీవం, మార్గం.

## నూతన నిబంధన

యెహెజ్కేలు గ్రంథము నందు తండ్రి దేవుడు వాగ్దానము చేసిన నూతన నిబంధన (యెహెజ్కేలు 36:26-27; 37:14) మానవాళికి నూతన హృదయమును దయచేసి తమ నియమ నిబంధనలను మన హృదయ పలకము పై ముద్రించి, యోవేలు 2:26 "ఆయన ఆత్మను అందరి పై కుమ్మరించి", "ఎండిన ఎముకలలా మారిన ఈ మానవ కోటికి నూతన జీవమును ఇచ్చును"

యెహెజ్కేలు 37:14, అని చేసిన వాగ్దానమును నెరవేర్చుటకు, యోహాను3:16 ప్రకారం తండ్రి దేవుడు తన కుమారుని, మానవునికి దేవునికి మధ్య నిబంధన గుర్తుగా మార్చి తన ప్రణాళికను నెరవేర్చెను. తన కుమారుడైన యేసు క్రీస్తు ద్వారా నెరవేర్చెను. మానవత్వంలో "యేసు" అనగా "రక్షకుడు" అని దైవత్వంలో క్రీస్తుగ అభిషేకించబడి, దైవానికి మానవునికి మధ్య చెరిగిపోయిన సంబంధమును తిరిగి నూత్నీకరించి, తన రక్తమును నిబంధన ముద్రగా మార్చెను. ఈ సందర్భములో నాకు దయచూపి నేర్పించిన విషయము ఏ మనగా క్రీస్తు జయంతి మరియు పునఃరుత్థాన పరమ రహస్యము ఏ మనగా క్రీస్తు జయంతి, క్రిస్మస్ అనగా సర్వమహిమలు కలిగిన పరలోకం భూలోకంలో అడుగుపెట్టడం, పునఃరుత్థానము అనగా సర్వ భూలోకం పరలోకంలో ప్రవేశించడం. పరలోకం నుండి భూలోకానికి వచ్చినది తిరిగి వచ్చిన రీతిగా పోవడానికి కాదు, కానీ భూలోకంలో ఉన్న సమస్త మానవాళిని పరలోకంలో ప్రవేశించే మార్గం సరిచేసి, సర్వసాధారణమైన ఈ భూలోక జీవితము ద్వారా పరలోక మహిమలోకి మనము కూడా ప్రవేశించగలమని, తప్పక ప్రవేశించాలని, ప్రవేశించడం ప్రతి ఒక్కరికి సాధ్యం అని నిరూపిస్తూ; ఈ భూలోకములో పరలోక రాజ్యం స్థాపించే ప్రేషితకార్యమే క్రీస్తునాధుని జీవితము. ఈ పరలోక భూలోకములను ఐక్యపరచుటలో క్రీస్తు ద్వారా తండ్రి చూపిన ప్రథమమైన మార్గం; దేవుని ప్రేమించవలెను అదే విధముగా నీ పొరుగు వారిని ప్రేమించు అని ఇచ్చిన అజ్ఞ (లూకా 10:27). అదేవిధంగా సమరియుడు అని అనేక సార్లు విన్నాం కానీ ఆ సమరియుడు ఎవరోకాదు. ఆకాలంలో, క్రీస్తుయేసు, నిన్నమదర్ థెరెసా నేటి సమాజానికి నువ్వు, నేను, మనందరమూ, మంచి సమరియునిగా మారగలిగితే ఈ భాగస్వామ్య శ్రీసభ చరితార్థం అవుతుంది.

ఈ సినడ్‌ని మరింతగా బైబిల్ ఆధారముగా అర్థం చేసుకోవడానికి ముందుగా దేవుని హృదయం అర్థం కావాలి, దేవునికి మనిషి మీద ఉన్న ప్రేమ అర్థం కావాలి. యోహాను1:1 ఆదిలో వాక్కు ఉండెను, వాక్కు దేవుని యొద్ద ఉండెను ఆ వాక్కు దేవుడై ఉండెను. యోహాను1:18 ఎవరు ఎప్పుడు దేవుని చూడలేదు తన కుమారుడు తప్ప, ఆ కుమారుడు మనకు ఆ దేవుని

ఎరుకపరచారు. అది కూడ ఆ కాలము సంపూర్ణమైనప్పుడు గలతీ 4:4. ఈ క్రీస్తు ప్రభువు తనంతట తాను ఏమియు చేయలేదు కానీ తండ్రి దేవుడు చెప్పినది చెప్పినట్లుగా, చేయమన్నది చేయమన్నట్లు గానే తండ్రి చిత్తాన్ని నెరవేర్చాడు. యోహాను14:10,8:29,6:39 ఎందువలన అనగా "దేవుని ఆత్మ సంవృద్ధిగా ఒసగబడెను" అని బప్తిస్మ యోహానుగారు క్రీస్తును గూర్చి సాక్షం పలుకుచున్నారు (యోహాను 3:3). అలనాడు పాస్కా పరమ రహస్యము ద్వారా దేవుడు ఇశ్రాయేలీయులను ఫరో బానిసత్వవము నుండి విడిపించెను. నేడు యేసు క్రీస్తు అనే ఈ పరలోక రహస్యము ద్వారా సమస్త మానవాళిని రక్షింపబడుటకు, ఆశ కలిగిన ప్రతి వ్యక్తిని కుల, మాత, జాతివర్గ బేధాలు లేకుండా అందరిని రక్షింప ఏరపర్చిన ఒక నిబంధన. ఈ అడుగు జాడలలో నడిచే ఒక చక్కని నిదర్శనమే నేటి సినడల్ శ్రీసభ.

ప్రభువు తన జీవిత కాలంలో ఎక్కడికైతే ప్రయాణం, చేసారో లేదా ఎవరిని సందర్శించారో వారి నందరిని దేవునితో ఐక్యపరచుటకు సత్యమైన మార్గములో నడచుటకు మార్గం చూపించారు. కనానీయులు, సమరీయులు వారిని అంటరాని వారు అని విడిచిపెట్టలేదు, కానీ దేవుని కృపావరములు, ప్రేమ ఆప్యాయతలను చూపించారు. దొంగలను వ్యభిచారులను, లేవీయులను, శతాధిపతులను, రాజోద్యోగులను, జాలరులు , పాపులను, డబ్బుకు అమ్ముడు పోయే వ్యక్తులను, మానసిక రోగులను, ఆధ్యాత్మిక రోగులను, పిశాచి శక్తులచే వేధింపబడే వారిని, శారీరిక రోగులను, చనిపోయిన వారిని ఇలా చెప్పుకుంటే ప్రతీ ఒక్కరిని కలిసి, కలిసి విడిచిపెట్టక కలుపుకుని తాను ఉండే చోటులోనే అనగా దేవుని కుడిపార్శ్వమున ఉండునట్లు వారికి బోధించి, నేర్పించి, నడిపించారు. అ.కా. 10:38 "నజరేయుడైన యేసు గ్రామ, గ్రామం వెళుతూ ప్రతి ఒక్కరిని నూత్నికరిస్తూ, స్వస్థపరుస్తూ సహోదరభావాన్ని, దైవభయమును పెంపొందిస్తూ సమైక్యంగా ఒకరి కష్టాన్ని నష్టాన్ని బాధను, వారిలోపాన్ని తన విగాభావిస్తూ భాగస్వామిగా మారి, వారిని అందులో నుండి విడిపించి అందరికి మంచి చేస్తూ తండ్రి దేవుడు తనను పంపిన ప్రేషిత కార్యమును నెరవేర్చెను. నేటికిని ఈ (సినడల్) భాగస్వామ్య శ్రీసభ ద్వారా నెరవేరుస్తూ, పరిపూర్తి చేస్తున్నారు.

## యేసు మాత్రమే సత్యమార్గము (యోహాను 14:6)

పరలోక రాజ్య ప్రకటనమే క్రీస్తు ఇహలోక ప్రయాణము (లూకా 4:14 –15). యేసు పట్టణములయందు, గ్రామములయందు పర్యటించుచు, దేవుని రాజ్యమును గూర్చి సువార్తను బోధించెను (లూకా 8:1,13:22). ఆయన పరలోక రాజ్యమునకు పోవు మార్గములను బోధించుచుండెను లూకా 20:21. ఆయనయే సత్యమైన మార్గము (యోహాను14 :16). ఈయనయే తండ్రి అగు దేవుని యొద్దకు మార్గము.

## ఎమ్మావు అనుభవము (లూకా 24:13–35)

దేవుని ప్రసన్నత నుండి దూరముగా వెళ్ళు సంఘములో, ఉత్థాన ప్రభుని చొరవవలన, దేవుని వాక్యం అనే అగ్నిని రగిలించడం వలన శిష్యులకు కనువిప్పు కలిగెను. వీరి మనోపరివర్తనకు మూలకారణం ఉత్థానుడైన యేసు సోలిపోయిన సంఘమైన శిష్యులతో కలిసి ప్రయాణించడం. ఎమ్మావు గ్రామమునకు వెళ్ళుచూ (లూకా 24:13) వారు ఆయనను "చూచిరి కానీ గుర్తుపట్టలేకపోయిరి" లూకా 24:16, విచారంతో నిలిచిపోయిరి (లూకా 24:18). అప్పుడు యేసు ఇద్దరు శిష్యులతో ఓ అవివేకులారా! ప్రవక్తల ప్రవచనములు నమ్మని మందమతులారా! (లూకా 25:25) అని గద్ధించుచూ, మోషే మొదలు కొని ప్రవక్తల అందరి లేఖనములలో తనను గూర్చి వ్రాయబడినవి అన్నియు వారికి వివరించెను (లూకా 24:27). అంతటా వారు ప్రొద్దువాలినది, సంధ్యవేళ అగుచున్నది మాతో ఉండుము. అని అడుగగా యేసు అంగీకరించెను (లూకా 24:29). ఆ సంధ్యా సమయమమున యేసు రొట్టి విరుచుటను చూచి శిష్యులు యేసును గుర్తించిరి ఆయన మనతో మార్గములో మాట్లాడి నప్పుడు లేఖనములు వివరించినప్పుడు మన హృదయములు ప్రజ్వలింపలేదా? అనుకొనిరి (లూకా 24:32).

ప్రియా మిత్రులారా గత 2022 సంవత్సరములుగా క్రీస్తు ప్రభువు మనతో నడుస్తూ నేవున్నారు. మన హృదయములు సోలిపోయి ఉన్నందున గుర్తించ లేకపోయాము, క్రీస్తు తన శ్రీసభ ద్వారా మనతో ప్రవక్తల ప్రభోధములు

చెప్పుచూ, ప్రతిరోజు రొట్టెను విరచి మనకు తానే ఆహారంగా మారి మనకు ఇస్తూ ఉన్నారు. ఈ సినడ్ ద్వారా మన హృదయములలో ఉన్న విచారం తొలగిపోవును. మనము నడచివచ్చిన దారి మనకు ఎరిగించబడును, ప్రతి ఒక్కరి జీవితంలో సంధ్యా సమయం చీకటి సమయము వచ్చును. కానీ నేటి శ్రీసభ మనకు నేర్పించునది ఏమనగా "మన రాత్రి సమయము ముగిసినది, మనము పునఃరుత్థానము అనే వెలుగుకు సంబంధించిన బిడ్డలము." నేటి సినడ్ ద్వారా మన హృదయములు ప్రజ్వలింప బడుచున్నవి, యేసుతో మాత్రమే కాక సకల శ్రీసభతో కలసి ప్రయాణించ వలిసిన సమయము వచ్చియున్నది. అందరితో కలిసి రొట్టెను పంచుకునే గడియ మన ముందు సిద్ధముగా ఉన్నది. కనువిప్పు కలిగి అందరము కలిసి దేవుని ప్రేషితకార్యమును నెరవేర్చు గడియ ఆసన్నమైనది. ఈ సినడ్ ద్వారా ఎన్నటికీ తిరిగిరాని చీకటిలోనికి పడిపోకుండా, నిత్యనరకాగ్ని లోనికి జారిపోకుండా, వెలుగు కలిగిన బిడ్డలముగా జీవింప శ్రీసభ మనకు అందరికి ఆహ్వానం పలుకుచున్నది. వెలుగు బిడ్డలవలే మనము కూడ లోక వెలుగులా ఉండి, మనము కూడా క్రీస్తు సహచరులము అని నిరూపించు ప్రేషిత కార్యమునకు ఆహ్వానమే ఈ మన సినడల్ శ్రీసభ.

## అపొస్తలులు

నూతన నిబంధనలో ప్రత్యేకముగా అపొస్తలులు క్రీస్తు వద్ద నుండి అధికారం పొందుకున్నారు, పరిశుద్ధాత్మ దేవుని శక్తిని పొందుకున్నారు అట్లే క్రీస్తు ప్రభుని సంకల్పాను సారం వారికి ఇవ్వబడిన అధికారం ద్వారా "ప్రపంచ నలుమూలాల సువార్తను బోధిస్తూ, అందరికి తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ నామములో జ్ఞానస్నానమిచ్చి దేవుని బిడ్డలుగా మార్చుము" (మత్తయి 28:19, 20) అని అపోస్తలులకు ఒక ప్రేషిత కార్యమును అప్పగించి పంపెను. ఈ కార్యములలో సకల పరలోకము, అనగా త్రిత్వము అపోస్తలులకుతోడై ఉండి, వారితో కలిసి ప్రయాణం చేస్తూ "వారి బోధయధార్ధమని అద్భుత కార్యముల ద్వారా సూచక క్రియల ద్వారా నిరూపించెను" (మార్కు 16:20). అలనాడు అపొస్తలులతో నడచిన దేవుడు ఈరోజు మన తల్లి శ్రీసభతో కలిసి నడుస్తూ, నడిపిస్తూ తన ప్రసన్నతను నిరూపిస్తూ, అలనాడు తొలి శ్రీసభలోనే నేటి సినడ్‌కు

పునాదులు వేశారు. బాప్తిస్మము ద్వారా క్రీస్తు అధికారంలో సమభాగం పొందుకుని, క్రీస్తును అభిషేకించిన అదే పవిత్రాత్మ అభిషేకము పొందుకొని క్రీస్తువలే, క్రీస్తు ద్వారా, క్రీస్తుతో తండ్రి సన్నిధికి చేరుకోగలము అనేది పరిపూర్ణ సత్యము (యోహాను 16:13). ఈ సత్యమును ప్రకటించి పాటించుటయే నేటి సినడల్ శ్రీసభ యొక్క ప్రముఖ లక్ష్యము. ఒకే బాప్తిస్మములో సహాభాగము పొందుకోవడము, ఒకే ఆత్మను శక్తిగా పొందుకోవడము, ఒకే రొట్టెను భుజించడము, ఒకే పాత్రము నుండి పానము చేయడము, ఒకే విశ్వాసము కలిగి జీవించడము, ఒకే విశ్వాస నావలో అందరూ కలిసి ప్రయాణము చేయడము, ఒకే గమ్యమును కలిగివుండడము, ఇవి క్రీస్తు అనుచరుల లక్షణములు, నేటి సినడ్ లక్ష్యాలు. ఇదే కలిసి కట్టుగా క్రీస్తు శరీరమైన శ్రీసభను నిర్మించడము, నూతన యిశ్రాయేలును నిబంధన లోనికి తీసుకు రావడమే ప్రేషిత కార్యము.

## అపోస్తుల కార్యములు

క్రీస్తు ప్రభువు పరిచర్య చేస్తున్నప్పుడు ఎవరుగొప్ప? ఎవరు సింహాసనమును అధిష్టించాలి? యేసు ప్రభువు తరువాత ఎవరు గొప్పస్థానాన్ని పొందబోవు చున్నారు? అని అనేక తర్కణలు శిష్యుల మధ్య ఉన్నవి, కానీ ఎప్పుడైతే క్రీస్తు ప్రభుని మరణ పునఃరుత్థానాల తరువాత శిష్యులు అందరూ ఒకే కుటుంబముగా సహవాసములో ఉన్నారో, కాలము పరిపక్వము అయినప్పుడు దేవుడు వారిని పవిత్రాత్మతో బలపరచారు. ఆత్మ అభిషేకం పొందుకున్న తరువాత వారిలో విభజనలు కానీ అధికార పోరాటం కానీ, స్వలాభం కానీ లేక, ఎంతటి ఘోరమైన శిక్షనైనా అనుభవించడానికి, వారు చవిచూచిన యేసును పరులకు భోధించకుండా ఉండలేక పోయారు. సహవాసములో వారు పునఃరుత్థాన క్రీస్తును, ఆయన చిత్తాన్ని తెలుసుకోగలిగారు. ఆయన చిత్తం జరిగించుటకు తగిన శక్తిని ఆదరణకర్తయైన ఆత్మ దేవుడు శిష్యులకు ప్రసాదించారు. అపోస్తులు ఈ విధముగా ఆత్మ సహవాసములో బాగస్వామయములో, ప్రేషితకార్యము నెరవేర్చుటకు ఏర్పరచిన సంఘమే అలనాటి సినడల్ శ్రీసభ. నేడు మనము కూడా అదే శక్తితో, అదే ధైర్యముతో, సమాలోచనలో, సహా భాగస్వామ్యముతో,

ప్రేషిత కార్యము నెరవేర్చుటకు ఏర్పరచినదే నేటి సినడల్ శ్రీసభ. అలనాటి శిష్యులు వారికి ఒప్పగింపబడిన ప్రేషిత కార్యమును నెరవేర్చుటలో వారు చేసిన అతిముఖ్యమైన పని ఏమనగా? వారు ప్రతి నిత్యము పవిత్రాత్మ దేవుని స్వరమును ఆలకించి ఏ విధముగా, ఏదారిలో పనిని కొనసాగించవలెనో తెలుసుకుని ఆ ప్రకారం నడుచుకునేవారు. హింసల మధ్యలో, చెరసాల లోపల కూడా దేవుని స్వరముతో నడిపింపబడ్డారు (అపో.కా. 5:19-21). ప్రభువు దూత ఫిప్పును ఇతియోపియా ఉద్యోగి వద్దకు నడిపించెను (అపో. కా. 8:26, 29,39). దేవుని వాక్కును బోధించు సేవకులను ఎన్నుకొనుటలో పవిత్రాత్మ దేవుని నడిపింపు ఉండెను (అపో.కా. 5:19-21). ప్రభువు దూత ఫిప్పును ఇథియోపియా ఉద్యోగి వద్దకు నడిపించెను (అపో.కా. 8:26,29,39), దేవుని వాక్కును బోధించు సేవకులను ఎన్నుకొనుటలో పవిత్రాత్మ దేవుని నడిపింపు ఉండెను. అపో.కా. 13:1-3 ఏడుగురు డీకనులను ఎన్నుకొనుటలో ఆత్మ దేవుని హస్తము శిష్యులకు తోడుగా ఉండెను.

## నూతన నిబంధనలో మొదటి భాగస్వామ్య శ్రీసభ (అపో.కా. 6:1-6)

క్రైస్తవ సంఘములో అలనాటి సంఘ అవసరముల మేరకు శిష్యులు ఆధ్యాత్మిక, సామాజిక అవసరములలో ప్రజలకు సహాయపడుతూ అందరిని ఏకత్రాటి పై నడిపిస్తుండేవారు. సంఖ్య అధికమగుచున్న కొలది సంఘములో పలు రకములైన సామాజిక సమస్యలు తలెత్తుతూ వచ్చాయి. గ్రీకు, హెబ్రీయ ప్రజల మధ్యలో ఆహారం పంచిపెట్టే విషయంలో సమస్య. సమస్య చిన్నదే కానీ సాతాను పన్నాగం పెద్దది. సంఘములో విభజనలు, కోపం, పగ, అసూయ ఇటువంటి ఆలోచనలే వారి మధ్య ఉన్న సమస్య. వాక్య పరిచర్య చేసేవారు ఆబాధ్యతలు తీసుకుని సమస్య పరిష్కరించ వచ్చు కానీ, సువార్త ప్రకటన అశ్రద్ధచేబడ వచ్చేమో అని తలంచారు, ఇది ఒక ఝటిల సమస్య కానీ ఆత్మ దేవుడు వారిని సరైన త్రోవలో నడిపించి సంఘమును ఏకము చేసి దైవకార్యమును నిర్లక్ష్యము చేయక ప్రజల నుండి, ప్రజల కొరకు "ప్రభుని ఆత్మ ప్రేరణలో ఏడుగురు సహాయకులను" ఎన్నుకొని సంఘములోని సమస్యకు పరిష్కారం మాత్రమే కాక శ్రీసభలో సంస్కరణలు జరిపి, డీకనులను నియమించి

సాతాను క్రియలను కట్టివేసి దేవుని రాజ్యస్థాపనలో ముందుకు కొనసాగిపోవునట్లు చేసినది ఈ సంఘటన. సరిగ్గా ఇదే నేటి శ్రీసభలో జరిగేది ఈ మన భాగస్వామ్య శ్రీసభ ఆశించేది. ఈ సినడాలిటీ ద్వారా సాంఘిక సమస్యలను సంస్కరించి, పరిష్కరించి అలనాటి తొలి శ్రీసభవలే ఆత్మ ప్రేరణలో నడిపింపబడుతూ దేవుని రాజ్యస్థాపన ఏతారతమ్యము లేకుండా సంఘములోని సభ్యులు అందరూ సంఘము కొరకు, సంఘమంతా కుటుంబముగా, కలిసి ప్రయాణిస్తూ, ప్రోత్సహించుకుంటూ, సంస్కరించుకుంటూ, ఒకరికి ఒకరు బోధించుకుంటూ, దైవకార్యమును నెరవేర్చుటయే ఈ సినడాలిటీ భాగస్వామ్య శ్రీసభ యొక్క ముఖ్య ఉద్దేశం.

## రెండవ సమస్యసున్నతి (యెరూషలేము సమావేశము, అపో.కా. 15:1-11)

సున్నతి క్రైస్తవత్వ మునకు ఒక అర్హతా? తప్పకసున్నతి చేయబడవలెనా? ప్రశ్నచిన్నదే కానీ కలకలంరేపే ప్రశ్న. రక్షణ అందరి కొరకు, వైద్యుడు అనారోగ్యుల కొరకు, కాపరి తప్పిపోయిన గొర్రెల కొరకు. ఇలా రక్షణ కేవలము యూదుల కొరకు మాత్రమే కాదుకానీ దేవుని నమ్మిన ప్రతిఒక్కరికి. నమ్మిక వలన విశ్వాసము, విశ్వాసము వలన రక్షణ వచ్చును. ఈ శారీరకసున్నతి కంటే హృదయ పరివర్తన, నమ్మిక, విశ్వాసం అనేవి బహుమహత్తరమైనవని నిర్ణయించి అన్యులను కూడా ఆహ్వానించింది అలనాటి సినడల్ శ్రీసభ (అపో. కా. 15 :2,4,7-12). ఆ రోజు వారి నిర్ణయమే నేడు నీవు నేను క్రైస్తవులుగా పరిగణలో వున్నాము. యెరూషలేము సమావేశము (మహాసభ) అలనాటి సామాజిక జీవనంలో తీవ్రమైన క్లిష్టపరిస్థితులలో చోటుచేసుకున్నది. అప్పటికి భౌతికంగా అంతటి క్రమ పరిస్థితులు పద్ధతులు, పథకాలు శ్రీసభలో లేకున్నను ఒక క్రమ పద్ధతిలో ప్రతిఒక్కరు తమ పాత్రను సుస్పష్టముగా పోషిస్తూ, దైవాను గ్రమువలన సమస్యను కలిసి కట్టుగా, బాధ్యతగా, సహభాగస్వామ్యముతో, పరిష్కరించ గలిగారు. నేటి శ్రీసభలో కూడా అనేక సమస్యలను కలిసి కట్టుగా పరిష్కరించ వలసి ఉన్నది. ఆ రోజులలో అపోస్తలులు వారిబాధ్యతలను నెరవేర్చారు కానీ నేటి అపోస్తలత్వం ప్రామాణికంగా శ్రీసభ పెద్దలలో ఉన్నప్పటికీ సాధారణ ప్రజలు కూడా నేటి అపోస్తలులుగా, అందరూ కలసి జగద్గురువులతో

మేత్రాణులతో, గురువులతో, డీకనులతో, ఉపదేశులతో, కన్యస్త్రీలతో, గురువిద్యార్థులతో, అందరూ కలిసినడుస్తూ ఆ దేవుని ప్రేషిత కార్యమును సమాలోచన, భాగస్వామ్యము ద్వారా నెరవేర్చుటకు కాలం పరిపక్వమైన ఈ సమయములో దేవాది దేవుడు పరిశుద్ధ ఫ్రాన్సిస్ జగద్గురువులను ఆత్మ దేవుని సహాయసహవాసముతో ప్రేరేపించి ఇచ్చిన ఒక బృహత్తరమైన దైవ పిలుపే నేటి సినడల్ శ్రీసభ. దీనికి మూలం (1 కొరింతీ. 12:12-27, రోమీ. 12:4-5, ఎఫెస్సీ. 4:4). ఇది వాస్తవము పునీత పౌలు గారు చెప్పినట్లు క్రైస్తవ సంఘము అనునది దేవుని శరీరము, శరీరములోని ప్రతి అవయవము ముఖ్యమైనది. అన్ని అవయవాలు కలిసి పనిచేయుట ద్వారానే సంకల్పించిన పనినెరవేరును. అట్లే క్రీస్తు దేహమునకు అవయవములుగా ఉన్న మనము అందరము కలిసి పనిచేయ గలిగితేనే ప్రేషిత కార్యమును నెరవేర్చగలము. ఎఫెసీయులు4:7 ప్రకారము ప్రతివ్యక్తియు దేవుడు అనుగ్రహించిన శక్తికొలది ఈ ఐఖ్యత కొరకు, పేషిత కార్యము కొరకు ధారాళముగా స్పందించి కృషిచేసి దైవచిత్తాన్ని నెరవేర్చాలి.

## ముగింపు

మనిషిని చేసిన దేవుడు మనిషితో కలిసి ప్రయాణించారు. (ఆది 3:8). అబ్రాహాము ద్వారా సకల జాతులను ఆశీర్వదించారు. భూమండల మందలి సకలజాతి జనులను దీవించారు (ఆది 12:2,3). దేవుని బిడ్డలతో, దేవుడు కలిసినడుస్తూ వారికి తోడుగా ఉన్నారు అని విరోధులు కూడా గమించులాగున చేయును (ఆది 32:2,3). ఇలా మోషేకు తోడై ఉన్నారు, యెహోషువకు, న్యాయాధిపతులకు, రాజులకు, ప్రవక్తలకు, అందరితో దేవుడు కలిసినడిచారు, వారిని నడిపించారు. బలహీనతలను ఎత్తిచూపక సరిచేసి ప్రోత్సహించారు. ఆలా ఏదేనువనములో మనతో నడచుటకు ప్రారంభించిన దేవుడు, క్రీస్తు ప్రభువు ద్వారా మరలా మనిషిని దేవునితో ఐక్యపరచుటకు వాక్కై ఉన్నవాడు మానవునిగా మన మధ్య వెలసెను. యేసు ప్రభు తండ్రితో, వునాకు ఒసగిన వారిలో ఒక్కరినైనను పోగొట్టుకొనలేదు. అను ప్రవచనం నెరవేరునట్లుగ పలికెను. ఆయన చేతి నుండి దేవుని ప్రజలను ఎవ్వరు అపహరింపలేరు.

అంధుకనే యేసు ఇమ్మానుయేలుగా మనతో ఉండుటకు వచ్చారు. ఎమ్మావు గ్రామమునకు అలసిన శిష్యులతో ఒకటిగా నడిచారు. దూరముగా వెళ్లిపోవు వారిని తీసుకువచ్చారు, సంధ్యా సమయమున పునఃరుత్థాన వెలుగుతో నింపారు. ఇంతటితో ఆగిపోక సాగిపోవ నిశ్చయించుకున్న దేవుడు "సదా కాలము నేను మీతో ఉందును." అని అభయమిచ్చారు. దేవుడు మానవ మాత్రులమైన మనతో నడుస్తూవున్నారు. ఆయన ఇచ్చిన ఆజ్ఞ దేవుని ప్రేమించడం మనిషిని ప్రేమించడం. సాటి మనుషులను అందరిని ఒక్క కుటుంబముగా మలచుకుని కలిసి ప్రయాణించే మార్గమే ఈ సినాడాలిటీ. దేవుని సంకల్పమును నెరవేర్చు ఒక ఉన్నతమైన పరలోక ప్రయాణము. ఈ ప్రయాణములో ప్రతి ఒక్కరిని కలుపుకుని తిరిగి దేవునికి మానవునికి మధ్య ఉన్న ఈ నూతన నిబంధనను నూత్నీకరించుకుంటూ దివ్యసంస్కారములు ద్వారా ప్రత్యేక విధముగా దివ్యబలిపూజ ద్వారా, దైవ వాక్కు ద్వారా ఏక కుటుంబముగా భాగస్వామ్యములో ప్రయాణించుదాము, ప్రేషిత కార్యమును నెరవేర్చుదాము. ఈ సినడల్ ప్రయాణంలో దేవుడు మనకు తోడుగా ఉండి, సురక్షితముగా గమ్యము చేర్చుదురు గాక! ఏ దేనులో నడచినదైవం, ఎమ్మావు దారిలో నడిచినదైవం, లోకాంత్యము వరకు తోడుగా వచ్చు దైవం ఆయనకు ప్రీతీకరమైన మార్గములో మనలను నడుపుదురు గాక ఆమెన్.

# 4. శ్రీసభ చట్టం ప్రకారం 'సినడ్'

– బ్రదర్ చాట్ల అలెగ్జాండర్

## ఉపోద్ఘాతం



దశాబ్దాల కాలం నుండి క్రైస్తవులు మహాసభలను, సినడ్ లను చవిచూస్తున్నారు. వారికి వీటిపై చాలా అవగాహన ఉంది. 1965 వ సంవత్సరములో అప్పటి 6 వ పౌలు పాపుగారు ఏర్పాటు చేసిన పీఠాధిపతుల సమాఖ్య ఈ మహాసభలకు చక్కటి ఉదాహరణ. ఈ పీఠాధిపతుల సమాఖ్య ద్వారా శ్రీసభ అజ్ఞానపు తిమిరముతో, విజ్ఞానపు సమరం సలిపి, ఉదయించే ఊపిరికి ఉజ్వల రూపమై, ప్రగతి పదంలో పయనించడంలో ఎంతగానో విజయిభవించినదని నిస్సందేహముగా చెప్పవచ్చు. ఇలాంటి కోవకు చెందినదే నాడు మన ప్రియతమ పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారు ఏర్పాటు చేసిన పీఠాధిపతుల సమాఖ్య. ఈ పీఠాధిపతుల సమాఖ్య, నాడు శ్రీసభ ప్రేషిత కార్యంగా ఎంతగానో ప్రభావితం చూపుతూ శాంతి స్వరూపిణిగా, త్యాగనిరతితో, ఖ్యాతిని గాంచుతూ, ఐఖ్యతతో అణుకువతో మొలగ నడుముభిగించింది.

1983 శ్రీసభ చట్టమును ఆధారంగా చేసుకొని ఈ పీఠాధిపతుల సమాఖ్య అడుగులు ముందుకు వేస్తుంది. ఈ మహాసభలో ముఖ్యముగా శ్రీసభ విషయాలపై లోతైన శ్రద్ధ వహించడం, పీఠాధిపతుల సహాలను అనుసరించి అన్నీ విధాలుగా అలుపెరుగని ఆలోచనతో విజ్ఞానోత్తములై వేదశాస్త్రము యొక్క ఆవశ్యకతను తెలియజేస్తుంది. శ్రీసభలో నిర్వహించే ఎలాంటి మహాసభయైనా ఎటువంటి పీఠాధిపతుల సమాఖ్య అయినా సత్యాన్ని అన్వేషించడానికి, శ్రీసభ మనుగడకు ఉద్దేశించబడినది.

ఆదిమ క్రైస్తవుల కాలం నుండి ఎన్నో మహాసభలు జరిగాయి. అలాంటి మహాసభలలో మొట్టమొదటిగా వెలుగులోనికి వచ్చిన మహాసభ యెరూషలేము మహాసభ. ఈ మహాసభ గురించి అపో. కా. 15 వ అధ్యాయములో మనము చూడవచ్చు. ఈ యెరుషలేము మహాసభలో సున్నతి గురించి పౌలు, బర్నబాల మధ్య తీవ్రమైన వాదనలు జరిగిన సందర్భములో వారిరువురు యెరూషలేములోని పెద్దలు, అపోస్తలుల మధ్య సమావేశమై ఈ సున్నతి గురించి పెద్దల అభిప్రాయాలను అంగీకరించి వారి ముందున్న సమస్యను పరిష్కరించుకోవడం మనం చూస్తున్నాం. అదేవిధంగా మనందరికి మరింతగా అవగాహన ఉన్న ద్వితీయ వాతికను మహాసభ మనకు నేర్పిస్తున్న విధంగా పీఠాధిపతుల సమిష్టి కృషి శ్రీసభను అన్ని వేళల జీవన రథంబుపై ధర్మపదాన వెలుగొందేలా, కష్టాల కడలిలోనైనా, కన్నీటి నావలోనైనా, శాంతిపదములో నడిపిస్తూ, కడదాక తల్లి శ్రీసభ ఒడిలో కడతేరిపోయేలా వారి కృషి, పెదాలపై పలికే పదాలతో వర్ణించలేనిది. దైవానుభవ మహద్భాగ్యాన్ని పొందిన ఈ పీఠాధిపతుల సమాఖ్య ఉబయ వంశ తరంబులను ఉద్దేశించేలా ఉంటుంది. వారి జీవన విధి విధానమే ఈ మహాసభలకు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. అందుకే ఈ సభలకు శ్రీసభలో ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ఈ సభలలో ముఖ్యముగా విశ్వాసపరమైన అంశాలను క్షుణ్ణంగా చర్చించి, తర్కించి, బలమైన, భక్తిపరమైన విశ్వాసానికి దృఢమైన సత్యాలను నేర్పించడం జరుగుతుందని శ్రీసభ పితామహులైన ఎల్యూసియుస్ తెర్తూలియను, సుప్రియను అను వారలు నొక్కి వక్కాణిస్తున్నారు. శ్రీసభ, మహాసభలకు ప్రాముఖ్యత ఇవ్వడం వలన సినడల్ అధికారం, ఇతర సంఘాలతో క్రైస్తవ సంఘు అనుసరణకు ప్రాముఖ్యత సంతరించుకుంది. కాబట్టి అధికారం అనేది దేవుడిచ్చే ఒక ప్రత్యేకమైన బహుమానమని ఆంగ్లికన్ రోమన్ కతోలిక శాఖ వివరించి, ఈ సినడాలిటీని అధికార ప్రణాళికలో చేర్చడం జరిగింది. శ్రీసభ, ఒక మహాసభ అని తెలియజేస్తుంది, ఆమె త్రియేక దేవుని యొక్క సాక్షాత్కారము అందువలననే శ్రీసభను పరిపూర్ణ దేవుని శరీరమని పిలుస్తున్నాము.

శ్రీసభ త్రియేక దేవుని ప్రతిరూపము, జీవితము. ఏలయన, శ్రీసభలోనే సామరస్యపూర్వకమైన ఈ జీవితం రక్షించబడి, పవిత్రపరచబడినది. క్రీస్తు శరీరమైనటువంటి శ్రీసభ, పరిశుద్ధాత్మ కార్యంలో వ్యవహరిస్తుండగా శ్రీసభ జీవితం, శ్రీసభ యొక్క వివిధ అత్యున్నత అంతస్తుల పరిపాలనా విధానాన్ని గురించి చర్చించడం అత్యవసరమైనటువంటి విషయం. శ్రీసభ వ్యవహారల గురించి మట్లాడేటప్పుడు క్రైస్తవ విధి, విధానల కోణంలో వాటిని అర్థంచేసుకొని చర్చించాలి. శ్రీసభయొక్క ఆధ్యాత్మిక జీవిత విధానాన్ని అర్థం చేసుకోకుండా, శ్రీసభను కేవలం ఒక సంస్థ అనే కోణములో చూస్తే అది నిజమైన భావన కాదు. అన్నీ కోణాలలో శ్రీసభను మనము అర్థం చేసుకొని, ఆత్మార్పణ చేసుకోవడం ద్వారా రానున్నటువంటి పీఠాధిపతుల సమాఖ్యా విధానం, వారు తీసుకునే నిర్ణయాల విధానం, వారు ఆలోచించి కొత్త పద్దతులను అనుసరణలోనికి తెచ్చే విధానాల గురించి తెలియజేస్తుంది.

శ్రీసభలో ఉన్న ఈ పీఠాధిపతుల సమాఖ్య శ్రీసభ చట్టములో ఉన్నటువంటి ఒక వాస్తవికత అని ద్వితీయ వాతికను మహాసభ తెలియజేస్తుంది. ఈ వ్యాసం శ్రీసభ చట్టము యొక్క ప్రాముఖ్యతను, పీఠాధిపతుల సమాఖ్య ప్రభావం ఏవిధాంగా ఉంటుంది, జగద్గురువుల యొక్క ప్రాధాన్యత గురించి వివరిస్తుంది. మహాసభలలో జగద్గురువుల, పీఠాధిపతుల ప్రాధాన్యత గురించి తెలియజేస్తుంది. శ్రీసభలోని అత్యున్నత అధికార విధానాలను కూడా తెలియజేస్తుంది. ఈ మహాసభలు జగద్గురువులకు, పీఠాధిపతులకు, ఇతర క్రైస్తవశాఖల సభలకు, కార్డినళ్ళకు ప్రత్యేక సంబంధం కలిగి ఉంటుంది.

పరిశుద్ధ ఫ్రాన్సిస్ జగద్గురువుల ఆధ్వర్యములో జరిగే ఈ పీఠాధిపతుల సమాఖ్య, శ్రీసభ జీవితం ప్రేషిత కార్యం మీద ఎంతగానో ప్రభావం చూపబోతుందని స్పష్టంగా తెలుస్తుంది. 2023 లో జరిగే ఈ పీఠాధిపతుల సమాఖ్యలో కేవలం పీఠాధిపతుల అభిప్రాయాలను మాత్రమేకాక, విశ్వశ్రీసభలో ఉన్న సకల విశ్వాసుల సూచనలను, సలహాలను స్వీకరించి ప్రార్థన ద్వారా మిళితమవ్వడం ఒక అద్భుతమైన విషయంగా మనం చెప్పుకోవచ్చు.

## శ్రీసభ చట్టం

ఈ మహోన్నతమైన శ్రీసభకు ఒక చట్టం ఉంది. ఈ చట్టాన్ని అనుసరించే శ్రీసభ విజయవంతంగా ముందుకు సాగుతుంది. ఈ చట్టం క్రైస్తవ మతానికి సంబంధించిన అన్నీ సిద్ధాంతాలను కలిగా ఉంటుంది. శ్రీసభలో ఏ కార్యం జరగాలన్నా ఈ చట్టాన్ని ఆధారంగా చేసుకొని అడుగులు ముందుకు వేయాలి.

శ్రీసభ చట్టంలోని మతపరమైన సంస్థలన్నింటిని బహుళ స్థాయి నుండి విశ్లేషణ చేయాలి. ఏ అధికారంతోనైతే మతపరమైనటువంటి సంస్థ సృష్టించబడిందో అదే అధికారాన్ని స్థాపించి దాని విధి విధానాలు, కూర్పులు, సభ్యత్వం, ప్రక్రియలను పేర్కొనవలసిన అవసరం ఎంతగానో ఉంది. ఇలాంటి విశ్లేషణ చేసే సమయంలో, సంస్థ మార్పుల మీద, అభివృద్ధి మీద శ్రద్ధ వహించడం ఎంతో అవసరం. ద్వితీయ వాతికను మహాసభ ఇటువంటి పీఠాధిపతుల సమాఖ్య సభలు స్థాపించడానికి పిలుపునిస్తూ 6వ పౌలు పాపుగారు వ్రాసినటువంటి 'అపోస్తోలిక సొల్లిచితూదో' (apostolica sollicitudo) అనే విశ్వలేఖ ద్వారా ప్రకటించడం జరిగింది. కాబట్టి ఇటువంటి మహాసభల స్థాపిత ప్రక్రియ 1966లో ప్రారంభించి 1967 లో మొట్టమొదటి మహాసభను నిర్వహించడం జరిగింది. 'క్రీస్తుస్ దోమినుస్' అనే సామరస్యపూర్వకమైన ఆజ్ఞ పీఠాధిపతుల కార్యనిర్వహణ గురించి చర్చిస్తూ పీఠాధిపతుల ఎంపిక ప్రక్రియ పరిశుద్ధ పాపుగారు 1965 అపోస్తోలిక విశ్వలేఖ ద్వారా ప్రపంచంలో ఉన్నటువంటి పీఠాధిపతులందరూ రోమునగర పీఠాధిపతుల సేవకు సహాయంగా ఉంటూ ఇలాంటి సభలలో పాల్గొనడం ద్వారా వారి మధ్య ఉన్న తత్సంబంధాన్ని సూచిస్తూ ఉన్నాయి. పీఠాధిపతులు పరిశుద్ధ పాపుగారితో కలిసి. ప్రేషిత కార్యాన్ని నిర్వహించడం ద్వారా, విశ్వశ్రీసభ యొక్క రక్షణ కార్యంలో పాలుపంచుకుటుంన్నారు అనే విధానాన్ని సూచిస్తుంది.

మతపరమైన సంస్థలన్ని పరిశుద్ధ పాపుగారి యొక్క 1965 విశ్వలేఖకు అనుగుణంగా ఉండాలని 1983 శ్రీసభ చట్టం 342–348 స్పష్టంగా సూచిస్తుంది. శ్రీసభ చట్టం ఇటువంటి మహాసభలను, శ్రీసభ యొక్క క్రమానుగత సంస్థలుగా పేర్కొంటుంది. అదేవిధంగా అత్యున్నతమైన శ్రీసభ అధికారాన్ని కూడ సూచిస్తుంది.

శ్రీసభ చట్టం 342 ప్రకారం పీఠాధిపతుల సమాఖ్య అనేటువంటిది, పీఠాధిపతుల సమూహం. వీరు ప్రపంచ నలుమూలల నుండి ఎన్నుకోబడి, ఉద్దేశించబడిన ఒక సమయంలో కలుసుకుని, శ్రీసభ విషయములపై చర్చించడం జరుగుతుంది. పీఠాధిపతులు, వారి సహోదారులు అందరు కలిసి ఈ క్రింది వ్యవహారాల మీద పరిశుద్ధ పాపుగారికి సహాయపడతారు.

1. విశ్వాసమును, నీతి నియమములను పరీక్షించి పెంచడంలో
2. శ్రీసభ యొక్క క్రమశిక్షణను సంరక్షించి బలపరచడంలో
3. ప్రపంచంలో శ్రీసభ యొక్క కార్యకలాపాల వ్యవహారాలలో సహాయపడతారు.

ఆశక్తికరమైన విషయం ఏమిటంటే 1965లో 6వ పౌలు పాపుగారు తమ విశ్వలేఖలో పీఠాధిపతుల సమాఖ్య యొక్క ముఖ్య లక్ష్యాన్ని చాలా చక్కగా వర్ణించారు. అది ఏమిటనగా, పీఠాధిపతులంతా వివిధ అభిప్రాయాల మీద అలుపెరుగని ఆలోచనతో ఆలోచించి, ఒకే ఒప్పందానికి రావడం ఒక ఎత్తైతే శ్రీసభ ముఖ్య సిద్ధాంతాలను శ్రీసభ జీవిత విధానాన్ని వీడిపోకుండా ఒకే నిర్ణయానికి వచ్చి శ్రీసభ విలువలను, గౌరవ ప్రధమైన ఆజ్ఞలను కాపాడుకుంటూ రావడం ఎంతో అద్భుతమైన విషయం. కేవలం దేవుని సహాయం ఆయన ఉనికి ఉంటేనే నేటికి శ్రీసభ సిద్ధాంతాలను అనుసరిస్తూ రాతిపై చెక్కుచెదరకుండా నిలబడుతూ, దేవుని ప్రేమను ప్రపంచమంతట వెదజల్లుతుంది.

శ్రీసభ చట్టం 342 ముఖ్య ఉద్దేశం ఏమిటనగా, ప్రపంచములోని ప్రజలందరికి సువార్తను వెదజల్లడం లేదా సువార్త ప్రచార వ్యాప్తి చేయడం అనేది పీఠాధిపతులకు చెందిన ప్రక్రియ. కావున ఈ పీఠాధిపతుల సమాఖ్య ప్రధానంగా శ్రీసభ ప్రేషిత కార్యం మీదను, శ్రీసభ యొక్క పవిత్ర విధి, విధానల మీద ప్రత్యేక శ్రద్ధ కనపరచాలని పరిశుద్ధ 6వ పౌలు పాపుగారు తమ అపోస్తోలిక లేఖ ద్వారా తెలియజేస్తున్నారు. దీనిని బట్టి మనం అర్థం చేసుకోవలసినది ఏమిటి అనగా, శ్రీసభలో పీఠాధిపతుల బాధ్యత అంతా ఇంత కాదు. భారాన్ని వారి భుజాలపై మోస్తూ ప్రాణాలు పోయేవరకు దేవుని సేవలో ఆయన సన్నిధిలో సాష్టాంగపడి వారి జీవితాలను అర్పిస్తున్నారు.

శ్రీసభ చట్టం 343 ప్రకారం పీఠాధిపతుల ముఖ్య విధి ఏమనగా, విశ్వాసానికి సంబంధించిన ఏ విషయమైనా పరిశుద్ధ పాపుగారు ఉద్దేశపూర్వకమైన అధికారం ఇచ్చిననే తప్ప, పీఠాధిపతులు ఆ విషయాలను గురించి చర్చించడానికి వారికి అనుమతిలేదు. వారు విశ్వాసానికి సంబంధించిన విషయాలపై చర్చించాలన్నా, పరిష్కారం చేయాలన్నా, పరిశుద్ధ పాపుగారి అనుమతి కావాలి. ఈ కోణంలో అత్యున్నత అధికారం పరిశుద్ధ పాపుగారి చేతిలోనే ఉంటుందని శ్రీసభ చట్టం 343 స్పష్టంగా తెలియజేస్తుంది.

శ్రీసభ చట్టం 345–346 ప్రకారం, పీఠాధిపతుల సమాఖ్య, సమూహము, సభ్యత్వాన్ని అనుసరించి మూడు రకాలుగా చెప్పవచ్చు.

**1. సాధారణ సభ:** ఈ సభలో శ్రీసభ శ్రేయస్సు గురించి సామాన్యమైన లేదా అతిసమాన్యమైన సమావేశంలో చర్చించడం జరుగుతుంది. సాధారణ సమావేశంలో పీఠాధిపతులను సాంగత్యంగల ప్రత్యేక చట్టములో ఎన్నుకోవడం జరుగుతుంది. తదుపరి ఇతర సభ్యులను, శ్రీసభ చట్టం ప్రకారమే గుర్తించడం జరుగుతుంది. వారిని పరిశుద్ధ పాపుగారే ఎన్నుకోవడం జరుగుతుంది. మఠవాస జీవితం జీవిస్తున్న గురువులను కూడా ఎన్నుకోవడం గమనార్హం.

అతిసాధారణమైన సమావేశంలో పీఠాధిపతుల పాత్ర చాలా విభిన్నమైనది. త్వరగా పరిష్కారం చేయవలసిన విషయాలను గురించి చర్చించి, శ్రీసభ చట్టం ప్రకారం నిర్ణయం తీసుకోవడం జరుగుతుంది.

**2. ఈ సమావేశం అనేది ఒక ప్రత్యేకమైనది:** ఇది నిర్ధారించబడిన ప్రాంతాల గురించి చర్చిస్తుంది. ఈ ప్రత్యేక సమావేశానికి సంబంధించిన సభ్యులను వివిధ ప్రాంతాల నుండి ఎన్నుకొని పీఠాధిపతుల సమాఖ్యను, వారి సమావేశాలను చట్ట ప్రకారం నిర్వర్తించడానికి దోహద పడుతుంది. 1967 నుండి నేటి వరకు 13 సాధారణ సమావేశాలు, 2 మహాసభలు, 10 ప్రత్యేక సభలు రెండు సంవత్సరాల కాల వ్యవధిలో జరిగాయి. పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారు 2014 అక్టోబరు మాసంలో కుటుంబ సువార్త పరిచర్య యొక్క సవాళ్ళు, ప్రేషిత కార్యం సందర్భానుసారం 3వ అతిసాధారణ సమావేశమును నిర్వహించడం జరిగింది. 1969 లో రెండు సమావేశాలు జరిగాయి. అందులో పీఠాధిపతులు అందరు పాల్గొనడం జరిగింది. ఈ సమావేశంలో ద్వితీయ

వాటికను యొక్క 20 వ వార్షికోత్సవమును పురస్కరించుకొని అందులో భాగంగా ఈ సమావేశాన్ని నిర్వహించడం జరిగింది.

శ్రీసభ చట్టం 346 ప్రకారం శ్రీసభలోని సాధారణ సమావేశాలలో త్వరగా చర్చించవలసిన విషయాలగూర్చి చర్చించడం జరుగుతుంది. 2015 వ సంవత్సరంలో కుటుంబ విషయాలపై చర్చించడానికి పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారు సాధారణసభను ఏర్పాటు చేయడం జరిగింది. రెండవ జాన్ పౌలు పాపుగారు పలికిన విధముగ, పీఠాధిపతుల సమాఖ్య, చర్చించిన విషయాలను దృష్టిలో ఉంచుకుని, ఇటువంటి సమావేశాలు శ్రీసభకు, ద్వితీయ వాతికను మహాసభ అనుసారంగా, విశ్వాసంలో ఎదగడానికి ఎంతో అవసరమని ఉద్ఘాటించారు. పరిశుద్ధ పాపుగారి అధ్యక్షతన, ఈ సమావేశ ముగింపులో పీఠాధిపతులు, సభ్యులు చేయవలసిన అనేక పనులను గురించి తెలపడం జరిగింది.

శ్రీసభ చట్టం 347 ప్రకారం పీఠం కాళీగా (Sede vacante)ఉన్న సమయంలో సందర్భానుసారంగా కొన్ని సూచనలను ఈ మహాసభలకు ఇవ్వడం జరిగింది. శ్రీసభ చట్టం 348 ప్రకారం శాశ్వత సాధారణ కార్యదర్శకత్వానికి, పీఠాధిపతుల సమాఖ్యకు కొన్ని ప్రత్యేకమైన కట్టుబాటులను పొందుపరచడం జరిగింది. ఈ శాశ్వత సాధారణ కార్యదర్శకత్వం, అనుబంధ కూటములు, పీఠాధిపతుల సమాఖ్య శ్రీసభ సలహాలను సారంగదృష్టి సారించడం జరుగుతుంది.

**3. 1983 శ్రీసభ చట్టం చాలా ప్రాముఖ్యమైనది:** ఎందుకనగా పీఠాధిపతుల సమాఖ్య సమావేశాలు పవిత్రమైనవి, శ్రీసభ విధివిధానాలలో ప్రధానమైన పాత్ర పోషించడమే కాకుండ, శ్రీసభకు వెన్నుముకగా ఈ మహాసభలు నిలుస్తున్నాయి. తూర్పు ప్రాంత శ్రీసభలో ఈ పీఠాధిపతుల సమాఖ్య సాధారణ ప్రక్రియ. పితామహ, అతిమేత్రాసనాలలో కూడా ఇది ఒక సాధారణ ప్రక్రియ మాత్రమే. పీఠాధిపతుల సమాఖ్య గురించి చర్చించడంలో 1990 తూర్పు ప్రాంత శ్రీసభల చట్టం, లతీను శ్రీసభ చట్టం '46' ను కొంతవరకు పొందుపరచడం జరిగింది. కావున ఈ పీఠాధిపతుల సమాఖ్య, లతీను శ్రీసభ, తూర్ప ప్రాంత శ్రీసభలలో ఉంది. ఈ రెండు పీఠాధిపతుల సమాఖ్యలు సూటిగా పాపుగారి ఆధీనంలో ఉంటాయి.

# 5. శ్రీసభ శాస్త్రములో "సినడ్"

- బ్రదర్ బోనెల వినయ్ కుమార్



## ఉపోద్ఘాతం

క్రీస్తు ప్రభువు, పేతురు అనే రాతి మీద నిర్మించిన సంఘము క్రైస్తవ సంఘము. ఈ క్రైస్తవ సంఘమునే మనము 'శ్రీసభ' లేక 'తిరుసభ' అని పిలుస్తున్నాము. శ్రీసభ సజీవంగా ఉంటూ సువార్త పరిచర్యలో నిత్యము నిమగ్నమై విశ్వవ్యాప్తంగా వర్ధిల్లాలని క్రీస్తుప్రభు ఉద్దేశము. పరిశుద్ధాత్మ సహకారముతో, తోడ్పాటుతో పలురకములైన పరిస్థితులను, సవాళ్ళను ఎదుర్కొని ప్రస్తుతం ఒక పటిష్టమైన, గౌరవప్రదమైన సంఘముగా గుర్తింపబడుతుంది.

## 'శ్రీసభ' అంటే ఏమిటి?

'శ్రీసభ'ను ఆంగ్లములో 'చర్చ్' అని పిలుస్తాము. ఈ 'చర్చ్' అనే పదము 'ఎక్లేసియా' అనే గ్రీకు పదం నుండి వచ్చినది. ఆ పదానికి 'దేవునికి చెందినవారు', 'దేవుని ప్రజ' లేదా 'దేవుని జనం' అని అర్థం. ఒకే ఉద్దేశంతో, ఒకే లక్ష్యంతో విశ్వాస సారూప్యత కలిగిన వారిని ఒక చోట సమావేశ పరచడం, సంఘముగా ఏర్పాటు చేయడం అని అర్థం.

'శ్రీసభ' అనేది ముఖ్యముగా ఎటువంటి తారతమ్యము లేని సంఘము, ఈ సంఘము రెండు రకాలైన వ్యక్తులతో మిళితమై ఉంది. అభిషిక్తులు, సామాన్య విశ్వాసుల సమూహము. అభిషిక్తులు, సామన్య విశ్వాసులు తమ జీవిత గమ్యమును చేరుకొనుటకు సహాయపడతారు. సామాన్య విశ్వాసుల బాధ్యత ఈ అభిషిక్తుల బోధనలను అనుసరించి, వారు చూపే మార్గములో నడవడానికి ప్రయత్నించడం.

శ్రీసభను ఉద్దేశించి ఫ్రాన్సిస్ జగద్గురువులు చాలా చక్కగా చెప్పడం జరిగింది. శ్రీసభ అనేది పవిత్రాత్మకు ఆలయమని, జ్ఞానస్నానము ద్వారా మనమందరము ఆ ఆలయములో సజీవరాయిలమని, ఇటువంటి ఆలయ నిర్మాణమునకై అందరు అవసరమని, ఏ ఒక్కరు కూడా తీసివేయబడడానికి వీలులేదని చెప్పడం జరిగింది. శ్రీసభలో అందరూ ముఖ్యమైనవారే. దేవుని దృష్టిలో అందరూ సమానులే. అందుకే ఫ్రాన్సిస్ జగద్గురువులు మనమందరము సోదరీ సోదరులమని, అందరూ ఒక్కటేనని మరొకసారి ప్రస్తుత సినడ్ ద్వారా మనకు గుర్తుచేస్తున్నారు.

ఈ క్రైస్తవ సంఘము ఆరంభము నుండి అనేక మంది శ్రీసభ పితామహులు, జగద్గురువులు, వేదపండితులు, మేత్రాణులు 'శ్రీసభ' అనేది భాగస్వామ్య శ్రీసభ అని చెబుతుండేవారు. అందుకు తగినట్లే విశ్వాసులు కూడా శ్రీసభ కార్యక్రమాలలో భాగస్తులయ్యేవారు. శ్రీసభ శాస్త్రము కూడా శ్రీసభ అనేది భాగస్వామ్య శ్రీసభ అని చెబుతుంది.

## ఆది శ్రీసభ – భాగస్వామ్య శ్రీసభ

ఆరంభములో ఆదిక్రైస్తవ సంఘము వేర్వేరు చోట్ల చిన్న చిన్న సంఘాలుగా ఉండేది. విశ్వాసులందరు ఒక ఇంట్లో లేదా ఒక చోట కలిసి ప్రార్థిస్తూ ప్రభుభోజనాన్ని సమిష్టిగా పంచుకుంటూ, పరస్పర సహవాసం కలిగి సువార్త సందేశానికి జీవితసాక్ష్యమిస్తూ క్రీస్తుకు సాక్షులుగా జీవించేవారు. ఆదిమ క్రైస్తవులు ఒక సినడ్ గా ఏర్పడి క్రీస్తుప్రభుకు తమ జీవిత విధానము ద్వారా పలువురికి సాక్షులుగా ఉండేవారు. సినడ్ అంటే అందరు కలిసి ఒక్కమ్మడిగా మార్గములో ప్రయాణించడం అని అర్థము.

ఈ సహవాస సాంగత్యము, కలిసి ప్రయాణించడం, కలిసి జీవించడం అనేది దేవుని పరమరహస్యం నుండి జన్మించినదే. సినడ్ పుట్టుపూర్వోత్తరాలు త్రిత్వైక దేవుని నుండి జన్మించినవే. పిత, పుత్ర, పవిత్రాత్మలో దేవుడు ఒకటిగా రావడం. ఇక్కడ మనము త్రిత్వైక దేవుని ఒక సినడ్ గా చెప్పుకోవచ్చు. ఎందుకంటే పిత, పుత్ర, పవిత్రాత్మగా కలిసి జీవించడం. కలిసి ప్రయాణించడం.

సినడ్ కి నిజమైన, సరైన ఉదాహరణ త్రిత్వైక దేవుడు. అందుకే శ్రీసభ త్రిత్వైక దేవునికి ప్రతిబింబముగా ఉండడానికి, దేవునిపోలి జీవించడానికి పిలువబడుతుంది.

క్రీస్తు ప్రభుని అనుసరించే వారిని,'మార్గము యొక్క అనుచరులు' అని పిలుస్తుండేవారు. ఆ మార్గము క్రీస్తు ప్రభువే. క్రీస్తు ప్రభుని అనుచరులు క్రీస్తుతో ప్రయాణించేవారు, క్రీస్తుతో కలిసి జీవించేవారు. మనము పరిశుద్ధ గ్రంథమును పరిశీలించినట్లయితే, అపోస్తులుల కార్యము 15వ అధ్యాయములో మొట్టమొదటి సినడ్ మనకు కనిపిస్తుంది. యెరూషలేములో అపోస్తులులు, పెద్దలు తాము ఎదుర్కొన్న మొట్టమొదటి సమస్యను పరిష్కరించుటకు, దాని గురించి ఆలోచించుటకు సమావేశమయ్యారు. తాము ఎదుర్కొనిన సమస్య ఏమిటంటే, అన్యులు ఎవరైతే జ్ఞానస్నానము పొంది క్రైస్తవులుగా ఉండడానికి సిద్ధపడిన వారికి, మోషే చట్టప్రకారము, యూదుల ఆచారము ప్రకారము, సున్నతి లేకుండా జ్ఞానస్నానము ఇవ్వవచ్చా? ఈ సమస్యను పరిష్కరించడానికి యెరూషలేములో సమావేశమయ్యారు. వారు పవిత్రాత్మ ప్రేరణతో నడిపింపబడి, రక్షణపొందడానికి, జ్ఞానస్నానము పొందడానికి, యూదులుగా ఉండనవసరం లేదు. సున్నతి కూడా అవసరం లేదు అని ఈ సమస్యకు పరిష్కారం తెలియజేశారు. విశ్వ శ్రీసభలో ఇదే మొట్టమొదటి సినడ్/సినొడోస్ (క్రీస్తు అనే మార్గములో కలిసి ప్రయాణించడం.)

## శ్రీసభ - సంపూర్ణ భాగస్వామ్యం

ఆదిమ క్రైస్తవ సంఘములో ప్రతి ఒక్కరు సంపూర్ణ భాగస్వామ్యం కలిగి, సంఘం పట్ల పూర్తి బాధ్యతతో వ్యవహరించేవారు. ఒకరిని ఒకరు సమభావనతో చూచుకొనేవారు. ఒకరి పట్ల ఒకరు గౌరవం కలిగి జీవించేవారు. వారి ప్రధాన లక్ష్యం క్రీస్తు సంఘాన్ని నిర్మించడం. ఆ క్రీస్తు సంఘాన్ని నిర్మించడంలో అందరు సమాన బాధ్యత, శ్రద్ధ కలిగి, తమ వంతు సహకారాన్ని అందించేవారు. ఆనాడు వారి మధ్య ఎటువంటి తేడాలు, తారతమ్యాలు ఉండేవికావు. ఈ ప్రేషిత సేవాకార్యక్రమాలలో అందరికి బాధ్యత ఉందని భావించినందువల్ల ఎటువంటి వ్యత్యాసము లేదు.

అపోస్తలులతో పాటు సామాన్య క్రైస్తవులు కూడా కలిసి ప్రేషిత కార్యాలలో, సువార్త ప్రచారంలో చురుకుగా పాల్గొని, తమ తమ సేవా వరాలను, సామర్థ్యాలను స్వచ్ఛందంగా, ధారాళంగా వినియోగించడం వల్లనే, ఆనాడు క్రీస్తు సువార్త, క్రైస్తవ విశ్వాసం త్వరగా, విస్తృతంగా వ్యాప్తి చెందింది. పురుషులు, స్త్రీలు అనే తారతమ్యము లేకుండా తొలినాటి క్రైస్తవ సంఘం సంపూర్ణ భాగస్వామ్యం కలిగి జీవించింది.

## శ్రీసభ మొదటి సహస్రాబ్దిలో సినడ్

మొట్టమొదటిగా అపోస్తలులు తమ సువార్తా ప్రచారం ద్వారా స్థానిక శ్రీసభలను స్థాపించారు. ప్రథమముగా అపోస్తలులు క్రీస్తు సువార్తను అందరికీ బోధించి, క్రీస్తునందు విశ్వాసాన్ని వ్యక్తపరచిన వారికి జ్ఞానస్నానం ఇచ్చి, ఆయాచోట్ల చిన్న చిన్న విశ్వాసుల సంఘాలను స్థాపించారు.

రెండవ శతాబ్దం ప్రారంభంలో పునీత అంతియోకు ఇగ్నేషియసుగారు వివిధస్థానిక శ్రీసభలు, క్రైస్తవులందరిని ఉమ్మడిగా చేర్చే ఒకే శ్రీసభ అని సినడ్ యొక్క అవగాహనను తెలియజేస్తున్నారు. ఎఫిసీయులలోని సంఘానికి రాసిన లేఖలో, "జ్ఞానస్నానము, క్రీస్తుతో సాంగత్యము వలన విశ్వాసులందరూ "ప్రయాణంలో, మార్గంలో సహచరులు" అని తెలియజేశారు. శ్రీసభ యొక్క విలక్షణమైన మూడు లక్షణాలను మనకు తెలియపరుస్తున్నారు. అవి: 1. అపోస్తులుల బోధనకు విశ్వసనీయత చూపించడం, 2. అపోస్తులుల వారసులైన పీఠాధిపతుల మార్గదర్శకత్వంలో దివ్యపూజాబలిని సమర్పించడం, 3. తమకు అప్పజెప్పిన బాధ్యతలను సక్రమముగా నిర్వర్తించడం.

మూడవ శాతాబ్ద సాంప్రదాయానికి వ్యాఖ్యాత అయిన కార్తేజ్ సిప్రియన్ గారు, శ్రీసభ స్థానికంగా మరియు సార్వత్రిక (ప్రపంచ) స్థాయిలో పాటించాల్సిన ఎపిస్కోపల్ మరియు సినడల్ సూత్రాన్ని రూపొందించారు. స్థానిక శ్రీసభలో పీఠాధిపతి లేకుండా ఏమి చేయకూడదని, ఏమి జరుగకూడదని, గురువులు, ఉపగురువులు లేకుండా ఏమి చేయకూడదని, అదేవిధంగా ప్రజల ఏకాభిప్రాయం లేకుండా ఏమి చేయకూడదు అనే ఎపిస్కోపల్ మరియు సినడల్

సూత్రాన్ని రూపొందించారు.

నాల్గవ శతాబ్దం నుండి మతపరమైన ప్రాంతాలు (ప్రోవిన్స్లు) స్థాపించబడ్డాయి. ఇవి స్థానిక శ్రీసభల మధ్య సంఘాన్ని ప్రదర్శించి, ప్రోత్సహించాయి మరియు ఇవి ఒక మెట్రోపోలిటన్ నేతృత్వములో ఉన్నాయి. ప్రాంతీయ సినడ్లు, శ్రీసభ సినడ్లను అమలు చేయడానికి నిర్దిష్ట సాధనాలు సమకూర్చబడ్డాయి.

నాలుగు, ఐదు శతాబ్ద కాలంలో క్రీస్తుశాస్త్రాన్ని (క్రీస్తు దైవత్వం-మానవత్వం) గురించి బోధించినపుడు సమావేశాలు జరిగాయి. ఉదాహరణకు:

## 1. నైసియా విశ్వాస మహాసభ (325)

నైసియాలో జరిగిన శ్రీసభ తొలి విశ్వాస మహాసభ. ఇది రోమ చక్రవర్తి కాన్స్టాంటైన్ నేతృత్వములో జరిగింది. ఏరియుస్ అనే వ్యక్తి క్రీస్తు యొక్క దైవత్వాన్ని నిరాకరించాడు. అదేవిధంగా క్రీస్తు ప్రభు తండ్రి దేవునితో సమానం కాదు అని బోధించాడు. ఈ తప్పుడు సిద్ధాంతాన్ని, తప్పుడు సిద్ధాంతాన్ని బోధించిన వ్యక్తులను బహిష్కరించుటకు నైసియా విశ్వాస మహాసభ ఏర్పడడం జరిగింది. ఈ సమావేశంలోనే నైసియా విశ్వాస సంగ్రహము ఇవ్వబడింది. ఈ సమావేశములోనే క్రీస్తు ప్రభు దైవత్వాన్ని-మానవత్వాన్ని కలిగి ఉన్నారు అని తెలియపరచబడింది.

## 2. ఎఫేసుస్ మహాసభ (431)

431 వ సంవత్సరములో ఎఫేసుస్ మాహాసభ జరిగింది. ఈ మహాసభ నెస్టోరియన్ తప్పుడు సిద్ధాంతమును ఖండించింది. మరియతల్లి దేవుని తల్లి కాదు, క్రీస్తుకు తల్లి అని బోధించాడు. ఈ మహాసభ ఆ తప్పుడు సిద్ధాంతమును ఖండించి, మరియమాత దేవుని తల్లి అని ఆ సమావేశములో నిర్ధారించబడింది.

ఈ విధంగా మొదటి సహస్రాబ్దిలో స్థానిక సినడ్ లు, ఒక వైపు అపోస్తులుల సాంప్రదాయాన్ని అనుసరిస్తూ మరోవైపు అవి నిర్వహించబడిన ప్రదేశాలలో ఆచరణాత్మక విధానాలు ప్రభావితమయ్యాయి.

స్థానిక శ్రీసభ సినడ్ విషయంలో సంఘం మొత్తం పాల్గొని, ఆ సంఘానికి అప్పజెప్పిన పాత్రకు అనుగుణంగా సమూహముగా ఉండేది. సర్వత్రా సినడ్లలో వివిధ స్థానిక శ్రీసభల పీఠాధిపతులు పాల్గొనేవారు. అదేవిధంగా, గురువులు, మఠవాసులు సహాయం అందించడానికి ఆహ్వానించబడేవారు. మొదటి సహస్రాబ్దిలో జరుపుకునే ఎక్యుమినికల్ మాహాసభలలో పీఠాధిపతులు మాత్రమే పాల్గొనేవారు. ఈ విధంగా మొదటి సహస్రాబ్దిలో సినడల్ విధానాన్ని రూపొందించడానికి ఈ స్థానిక శ్రీసభ సినడ్లు, సర్వత్రా సినడ్లు ఉపయోగపడ్డాయి.

## రెండవ సహస్రాబ్ది

కాలక్రమేణా ఈ భాగస్వామ్య శ్రీసభ కనుమరుగైపోయింది. కనుమరుగై పోవడానికి పలు కారణాలు ఉన్నాయి. మొట్టమొదటిగా పీఠాధిపతులు, గురువులు, మఠవాసులు వారే శ్రీసభ పాలకులు అనే భావనతో వ్యవహరించే వారు. పరిచారిక అంతస్తు కాస్త అధికార హోదాగా మారిపోయింది. అదేవిధంగా శ్రీసభలో జగద్గురువుల పాలనాధికారం కూడా భాగస్వామ్య శ్రీసభ కనుమరుగైపోవడానికి ఒక కారణం. కనుమరుగైపోతున్న శ్రీసభను ట్రెంటు మహాసభ పునరుద్ధరించడానికి పూనుకొన్నది.

## ట్రెంటు మహాసభ (1545-1563)

16 వ శతాబ్దంలో శ్రీసభలో ప్రతి సంస్కరణలు చోటుచేసుకొన్నాయి. ఈ ప్రతి సంస్కరణలకు ముఖ్యకారకుడు మార్టిన్ లూథర్. శ్రీసభ ఈ లోకానికి సంబంధించింది కాదని, అది పరలోకానికి సంబంధించినదని, కంటికి కనిపించనిదని మార్టిన్ లూథర్ మరియు తదితరులు తమ యొక్క బోధనా సిద్ధాంతాన్ని బాహాటంగా వెల్లడించారు. అయితే శ్రీసభ ఇహలోకానికి కూడా సంబంధించినదని, అది విశ్వవ్యాప్తియై ఉటుందని, అందులో కంటికి కనిపించే అంశాలు ఎన్నో ఉన్నాయని, అదేవిధంగా జగద్గురువుల నాయకత్వంలో నడిపింపబడే విశ్వవ్యాప్త విశ్వాసుల సంఘాల కూడికే నిజమైన శ్రీసభ అనే అంశాన్ని క్రీ.శ. 1545-1563 మధ్య ఇటలీలోని ట్రెంటు పట్టణములోని

మూడు విడతలుగా జరిగిన మహాసభ స్పష్టము చేసింది. దీనినే విశ్వవ్యాపిత శ్రీసభ శాస్త్రంగా పేర్కొనడం జరిగింది.

ట్రెంటు మహాసభ తరువాత 1963-1965 సంవత్సరాలలో జరిగిన ద్వితీయ వాతికను మహాసభ భాగస్వామ్య శ్రీసభ ఔన్నత్యాన్ని, అవసరతను మరింతగా గుర్తించి వాటి పునరుద్దరణపై దృష్టి సారించి, శ్రీసభ శాస్త్రపరంగా ద్వితీయ వాతికను మహాసభ కొన్ని ప్రధాన విలక్షణ ముఖ్యాంశాలను తీసుకొచ్చింది.

## ద్వితీయ వాతికను మహాసభ:(1963-1965)

శ్రీసభ చరిత్రలో ద్వితీయ వాతికను మహాసభ అత్యంత ప్రాతినిధ్యమండలి సమావేశం. ఇది శ్రీసభలో జరిగిన 21 వ విశ్వవ్యాప్త సార్వత్రిక సర్వసభ్య మహాసభ. ఈ మహాసభ 1963-1965 సంవత్సరములలో నిర్వహించబడింది. 6వ పౌలు జగద్గురువులు "క్రీస్తుస్ దోమినుస్" అనే అధికారిక పత్రములో సినడ్ యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. "సినడ్ అనేది ప్రపంచములోని వివిధ ప్రాంతాల నుండి ఎన్నుకోబడిన పీఠాధిపతుల సమూహము. ఈ సినడ్ ముఖ్య ఉద్దేశము జగద్గురువులు, పీఠాధిపతుల మధ్య సన్నిహిత ఐక్యతను పెంపొందించడానికి, విశ్వాస, నైతిక, మతపరమైన క్రమశిక్షణను పాటించడానికి, వాటిని బలోపేతము చేయడానికి ప్రపంచములోని శ్రీసభ యొక్క కార్యాచరణలకు సంబంధించిన ప్రశ్నలను పరిగణలోనికి తీసుకోవడానికి, పీఠాధిపతులు, జగద్గురువులతో నిర్ణీత సమయాల్లో కలుసుకొని, తమ తమ సహకారాన్ని అందించడానికి సహాయపడతారు."

శ్రీసభ శాస్త్ర పరంగా ద్వితీయ వాతికను మహాసభ తీసుకొనిన ప్రధాన విలక్షణ ముఖ్యాంశాలు:

## 1. శ్రీసభ దేవుని పరమ రహస్యం

శ్రీసభ అనేది ఒక దైవ పరమరహస్యం. జ్ఞానస్నానము ద్వారా ప్రతి వ్యక్తి తిరుసభకు, దేవునికి బిడ్డలుగా చేయబడతారు. ఈ దివ్య సంస్కారము ద్వారా త్రియేక సర్వేశ్వరుని సహాయంతో ఐక్యతతో కూడిన సహవాస జీవనము కలిగి

జీవించాలి. శ్రీసభలో ఉన్న సభ్యులందరు సమాన హోదా, సమాన గౌరవం కలిగి జీవించాలి. దేవుని దృష్టిలో శ్రీసభ సభ్యలందరు సమానులే. కాబట్టి ప్రతి వ్యక్తియు క్రీస్తు స్వభావంలో విలీనమైపోవడమే సహవాస సాంగత్యము. శ్రీసభ పరమ రహస్యమే సహవాస సాంగత్యము. ఈ సహవాస సాంగత్యము క్రీస్తులో పొందడానికి క్రైస్తవులు పిలువబడతారు.

## 2. శ్రీసభ అంటే దైవజనం

శ్రీసభ అంటే వంశానుగత లేదా క్రమానుగత పారంపర్య అధికారం కాదు. శ్రీసభ అంటే దైవ జనం. శ్రీసభలో ఉన్న విశ్వాసులు తాము చేస్తున్న సేవలో తారతమ్యాలు ఉన్నా, జ్ఞానస్నానము స్వీకరించిన ప్రతి వ్యక్తి కూడా క్రీస్తు దేహమైన శ్రీసభ నిర్మాణంలో అందరు కూడా సమాన గౌరవాన్ని సేవా బాధ్యతలను కలిగి ఉంటారు. ద్వితీయ వాతికను మహాసభకు ముందు వరకు పీఠాధిపతులు, గురువులు, మఠవాసులు తప్ప మిగిలిన వారినందరిని దైవజనం, దైవ ప్రజలు, విశ్వాసులు అని పిలిచేవారు. కాని ద్వితీయ వాతికను మహాసభలో పీఠాధిపతులు, జ్ఞానస్నానము స్వీకరించిన వారందరు దైవజనులు, విశ్వాసులు అని తెలియజేశారు. పీఠాధిపతుల నుండి చిట్టచివరి క్రైస్తవ విశ్వాసి వరకు అందరు దైవ ప్రజలేనని తేట తెల్లం చేసింది.

దైవ ప్రజలందరూ క్రీస్తు ప్రేషిత కార్యంలో భాగస్తులే. జ్ఞానస్నానము స్వీకరించిన ప్రతి వ్యక్తి తన జీవితం ద్వారా క్రీస్తు ప్రభునకు సాక్షిగా నిలవాలి. దైవ సేవకు అంకితం చేసుకున్నవారు తమ నడవడిక, ప్రవర్తన ద్వారా క్రీస్తును పోలి జీవించాలి. అదేవిధంగా గృహస్త క్రైస్తవులు తమకు అప్పజెప్పిన పనిని నెరవేర్చి క్రీస్తుకు సాక్షులుగా జీవించాలి. దైవ సేవకులు, గృహస్థ క్రైస్తవులు అందరూ దైవ జనులనే భావనతో జీవించి క్రీస్తుకు సాక్షిగా జీవించాలి.

## 3. శ్రీసభ ప్రేషిత కార్యం - అందరి బాధ్యత

శ్రీసభ ప్రేషిత కార్యం క్రీస్తు ప్రభు శ్రీసభకు ఇచ్చిన రక్షణ కార్యము. క్రీస్తు రక్షణ కార్యాలను మూడు భాగాలుగా విభజించవచ్చు.

1. ప్రావక్తిక (బోధించడం)
2. గురుత్వం (పవిత్ర పరచడం, బలిని అర్పించడం)
3. రాచరికరం (పరిపాలించడం)

ద్వితీయ వాటికను మహాసభ అధికార పత్రం "లోకానికి వెలుగు" *(Lumen Gentium),* 3, 4 అధ్యాయాలలో క్రీస్తు ప్రభుని రక్షణ కార్యాలను నిర్వహించడంలో పీఠాధిపతులు, గురువులు, సామాన్య గృహస్థ క్రైస్తవుల పాత్రను వివరించారు.

"శ్రీసభలో పీఠాధిపతులు" అనే పత్రంలో ఈ త్రివిధ సేవా ధర్మాలను విశ్వాస సత్య సిద్ధాంత వివరణ, శుద్ధీకరణ సాంఘ్యాల నిర్వహణ, సంఘ పరిపాలనగా వివరించారు.

"గురువుల సేవాధర్మం–జీవన విధానం" అనే పత్రంలో దేవుని వాక్యాన్ని బోధించడం, దైవ సంస్కారాలను ముఖ్యంగా దివ్య బలిపూజను కొనియాడడం, దైవజన కాపరిగా ఆత్మల సంరక్షణ కార్యాన్ని నెరవేర్చడంగా త్రివిధ సేవలను వివరించారు.

"సామాన్య క్రైస్తవుల సేవాధర్మం" అనే పత్రం, గృహస్థ క్రైస్తవుల పాత్ర గురించి వివరిస్తుంది. ప్రతి సాధారణ క్రైస్తవ విశ్వాసి కూడా ప్రభుయేసు క్రీస్తు త్రివిధ సేవాధర్మంలో భాగస్తులు అవుతారు. సువార్తకు సాక్షులుగా జీవిస్తూ, సువార్త విలువలకు దూరంగా జీవిస్తున్నవారిని సన్మార్గంలో నడిపించుట ద్వారా అనగా పవిత్ర పరచుట ద్వారా ధర్మకార్యాలను, సాంఘిక సేవా కార్యాలను చేయుట ద్వారా గురువులకు ఆత్మరక్షణ విధుల్లోనూ, శ్రీసభ ఆత్మల పరిరక్షణలోనూ సహకరించడం ద్వారా, త్రివిధ సేవా ధర్మాలను గృహస్థ క్రైస్తవులు నెరవేర్చుచున్నారు.

## 4. శ్రీసభ పొందిన అధికారం సేవకోసమే గాని, ఆధిపత్యం కోసం కాదు

శ్రీసభలో అధికారం వంశానుగత అధికారం కాదు. శ్రీసభ అనేది ఏదో ఒక కుటుంబానికో లేదా ఏదో ఒక సంఘానికో సంబంధించినది కాదు. శ్రీసభ అందులో ఉన్న విశ్వాసులందరికి సంబంధించినది. శ్రీసభలో పొందివున్న

అధికారం దైవసేవకులు దేవుని అభిషేకం ద్వారా పొందుతారు. పొందినటువంటి ఈ అధికారం సేవ చేయడానికే గాని ఆధిపత్యం చెలాయించడానికి మాత్రం కాదు. అభిషిక్తులైన వారితోపాటు విశ్వాసులందరూ శ్రీసభలో సమాన సభ్యులే. విశ్వాసులందరూ ఏ హోదాలో ఉన్నా, ఏ పని చేస్తున్నా అందరూ సమానులే. అందరు కూడా క్రీస్తు అధికారానికి, ఆయన వాక్కుకు లోబడి ఉన్నవారే. అందుచేత శ్రీసభ ధర్మపాలనకు, కర్తవ్య నిర్వహణకు ఇరువురూ అవసరమే. వారు ఒకరి సేవా కార్యాలలో ఒకరు పరస్పర సహాయ సహకారాలను అందించుకోవాలి. ఒకరిని ఒకరు గౌరవించుకోవాలి. ఒక విశ్వాసిగా దైవ సేవకులను అంగీకరించి, గౌరవించాలి, ఒక దైవ సేవకుడుగా విశ్వాసులను గౌరవించాలి. ఎప్పుడైతే అలా జీవిస్తామో అప్పుడు మనము పొందిన అధికారముగాని, హోదాగాని సేవకోసమే వినియోగించగలుగుతాము.

ద్వితీయ వాతికను మహాసభ ఈ విధంగా శ్రీసభశాస్త్రములో శ్రీసభ, సినడ్ యొక్క ఔన్నత్యాన్ని తెలియజేసింది. ద్వితీయ వాతికను మహాసభ తరువాత తదుపరి జగద్గురువులు పలురకాలైన 'సినడ్' లను ఏర్పరిచారు. ముఖ్యముగా ఫ్రాన్సిస్ జగద్గురువులు స్థాపించిన ఈ సినడ్ మరొకసారి శ్రీసభలో ఉన్న విశ్వాసులందరి కర్తవ్యాన్ని గుర్తుచేస్తూ, అందరూ సమానమే, అందరూ కలసి ప్రయాణించినపుడు, అందరూ కలసి ఆ మార్గములో (క్రీస్తులో) నడిచినపుడు శ్రీసభ మరింత ఔన్నత్యాన్ని పొందుతుందని తెలియజేస్తున్నారు.

## ప్రస్తుత సినడ్: ఆలకించే శ్రీసభ

ఫ్రాన్సిస్ జగద్గురువులు తమ పాలన ప్రారంభం నుండి (2013) పీఠాధిపతుల సినడ్ పై ప్రత్యేక ఆసక్తిని కనబరిచేవారు. మరుసటి సంవత్సరం జగద్గురువులు "కుటుంబం యొక్క కర్తవ్యం మరియు రక్షణ కార్యములో వారి బాధ్యత" తెలియజేయడానికి, అసాధారణ, సాధారణ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ద్వితీయ వాతికను మహాసభ సమయంలో స్థాపించబడిన పీఠాధిపతుల సినడ్ యొక్క 50 వ వార్షికోత్సవాన్ని 2015 వ సంవత్సరములో గుర్తించారు. ఆ వార్షికోత్సవ వేడుకలలో ఫ్రాన్సిస్ జగద్గురువులు సినడ్ పై తమ అభిప్రాయాలను తెలియజేశారు. సినడ్ అంటే సహకరించి జీవించడం అని

మరొకసారి విశ్వాసులందరికి గుర్తుచేశారు. ఆ వార్షికోత్సవ వేడుకలో "సినడ్ శ్రీసభ" అంటే "ఆలకించే శ్రీసభ" అని తెలియజేస్తూ యేసు ప్రభు శిష్యులకు నిన్న, నేడు, ఎల్లప్పుడు ఏకైక అధికారం సేవ యొక్క అధికారమని, ఏకైక శక్తి సిలువ శక్తి అని ప్రకటించారు. అప్పటి నుండి ఫ్రాన్సిస్ జగద్గురువులు సినడల్ శ్రీసభను పునరుద్ధరించడానికి, దానిని అందించడానికి చర్యలు తీసుకున్నారు. 2018వ సంవత్సరములో సినడ్ ప్రక్రియలో భాగంగా అన్ని స్థాయిలలోని సంఘాలతో, సంస్థలతో విస్తృత సంప్రదింపులను ప్రోత్సహించే కొత్త నిబంధనలను జారీ చేశారు.

## ముగింపు

ప్రస్తుత సినడ్ శ్రీసభలో మరింత నిష్కాపట్యత, సహకారం తీసుకొనిరావడానికి ఈ ప్రయత్నాలన్నిటికి పరాకాష్ట. మునుపటి సినడ్ ల మాదిరిగా కాకుండా, ఇది అధికారికంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అన్ని మేత్రాసనాల్లో ప్రారంభమౌతుంది. ప్రతి స్థానిక శ్రీసభల మధ్య పరస్పర సంప్రదింపులు, సహకారం ఉండాలి. శ్రీసభ ప్రారంభ కాలం నుండి ఇప్పటి వరకు మేత్రాసన, ప్రాంతీయ, ప్రపంచ స్థాయిలో సినడ్లు జరిగాయి. వీటిలో ఎక్కువగా మేత్రాణులు, సంఘ నాయకులు పాల్గొనేవారు. కాని ఇప్పుడు ఈ సినడ్ ప్రక్రియలో విశ్వాసులను కలుపుకొని, వారు చెప్పేది వినాలని ఈ సినడ్ ద్వారా ఫ్రాన్సిస్ జగద్గురువులు తెలియపరుస్తున్నారు. అప్పుడే అది భాగస్వామ్య శ్రీసభ అని పిలువబడే దానిని ప్రతిబింబిస్తుంది. సినడల్ శ్రీసభ అంటే కలిసి నడిచే, కలిసి ప్రయాణించే సంఘం.

# 6. ప్రస్తుత సినడ్ - ఫ్రాన్సిస్ జగద్గురువుల ఆశయాలు

– బ్రదర్ కోడిగంటి శౌరి నిఖిల్ తేజ



## ఉపోద్ఘాతం

సినడాలిటి అనేది కలసి ప్రయాణించడం. సాధారణంగా ఇది పీఠాధిపతులు అందరు కలసి సమావేశమై శ్రీసభ విషయాలను చర్చించడం అనే భావనకు సంబంధించినది. ముఖ్యముగా ద్వితీయ వాతికను మహాసభ సమావేశాల నుండి ఇది మరింత ప్రాచుర్యం పొందింది . కాలక్రమేణా దీనిని వివిధ రకాలుగా అర్థం చేసుకోవం జరిగింది. పునీత రెండవ జాన్ పౌలు జగద్గురువులు సినాడాలిటి అనేది కేవలం శ్రీసభ గురించి మాత్రమే కాక అందులో జరుగుతున్న విషయాల గురించి, గురువుల మధ్య, సభ్యుల మధ్య బలోపేతం చేయుట ద్వారా నవ్య శ్రీసభను రూపొందించవచ్చు అని తెలియజేసారు. తదుపరి ఎవాంజేలీ గౌదియుం *(Evangelii Gaudium)* అనే విశ్వలేఖ ద్వారా ఫ్రాన్సిస్ జగద్గురువులు గురువులకు, ప్రజలకు మధ్య దూరాన్ని తొలగించి వారధి నిర్మించాలనే ఉద్దేశాన్ని వ్యక్తపరిచారు. అంతేకాకుండా సంఘ సభ్యుల స్వరాన్ని ఆలకించమని తెలియజేసారు. దీనికి అనుగుణంగా 2015 వ సంవత్సరంలో వివాహం, కుటుంబంపై సినడ్ ఏర్పాటు చేసి ప్రజలకు ప్రాధాన్యత ఇచ్చి వారి సమస్యలపై దృష్టి సారించారు

ప్రస్తుత సినడల్ ప్రక్రియ అనేది దేవుడు మనందరికీ చెప్పేది వినడానికి మరియు ఒకరి మాట మరొకరు వినడానికి సహాయపడుతుంది. దేవుని ప్రజలుగా ఉన్న మనం, మన ప్రయాణంలో కలసి ముందుకు నడవడానికి,

మనకు సహాయం చేయడానికి, పరిశుద్ధాత్మ ఎవరి ద్వారానైనా మాట్లాడగలదని గ్రహించాలి. దీని గురించి అర్థవంతంగా తెలియజేయడానికే ఫ్రాన్సిస్ జగద్గురువులు ఈ ప్రక్రియను రెండు సంవత్సరాలు ఉండే విధంగా ఏర్పాటు చేసారు. మసక బారిన మనస్తత్వాలు, ప్రక్క వారితో సరైన అన్యోన్యత లేని సమాజంలో ప్రస్తుతం మనం జీవిస్తున్నాం.అటువంటి మనస్తత్వాలను తొలగించి ఏకమై జీవించడానికి ఈ సినడల్ ప్రక్రియను ప్రారంభించారు.

ఈ సినడాలిటి అనేది పోయే దశ కాదు. శ్రీసభలో అందరూ కలసి నడిచి నవశకానికి నాంది పలికే దశ. శ్రీ సభ ప్రారంభంలో పునీత జాన్ క్రిసోస్టోమ్ గారు 'శ్రీసభ', 'సినడ్' అనేవి పర్యాయపదాలుగా వివరించారు. ఎందుకంటే ఈ రెండింటి అర్థం కలసి నడవడం, సహవాసం చేయడం గురించే సూచిస్తుంది. ఈ కోణంలో సీనాదాలిటి అనేది ఒకరితో మరొకరు ఐక్యంగా కలసి జీవించడానికి, ప్రపంచంలో పరిచర్యలు మెరుగ్గా నిర్వహించడానికి, శ్రీసభ యొక్క మూలాలను పునరుద్ధరించడానికి ఒక సరైన మార్గం. మనమందరము క్రీస్తు దేహానికి చెందిన వారిగా గుర్తించి అందులో ప్రతీ ఒక్కరు విలువైన వారే అని విశ్వ మానవాళికి బోధిస్తుంది పరిశుద్ధాత్మ స్వరంతో పాటు ప్రతీ ఒక్కరి స్వరాన్ని వింటూ కలసి ముందుకు నడుస్తూ శ్రీ సభతో అనుబంధమై క్రీస్తు మార్గంలో నడవాలని ప్రస్తుత సినడ్ యొక్క ఆశయం.

## సహచరులతో కలసి ప్రయాణం

సినడాలిటి అనేది కలసి నడవడం. ఇది ఫ్రాన్సిస్ జగద్గురువులు గారి పరిపాలన కాలంలో శ్రీసభలో ప్రధాన అంశంగా మారింది. ఇప్పటి వరకు జరిగిన సినడ్ కేవలం పీఠాధిపతులుకు మాత్రమే ఉండేది. కాని ప్రస్తుత సినడ్ పీఠాధిపతులతో పాటు శ్రీసభ జనావళి అందరిని ఈ సినడ్‌లో పాలుపంచుకోమని ఆహ్వానించారు. పీఠాధిపతులు, గురువులు, మఠవాసులు, డీకనులను, గృహస్థ క్రైస్తవులు కలసి శ్రీసభలో ముందుకు ప్రయాణించాలని ఆహ్వానించారు.

శ్రీసభలో దైవ ప్రజల జీవిత అనుభవాలు చాల ముఖ్యమైనవి. ప్రతి ఒక్కరికి వారి పరిస్థితులను బట్టి, వాతావరణాన్ని బట్టి విభిన్నమైన అనుభవాలను

కలిగి ఉంటారు. సహచరులతో కలసి ప్రయాణించడం వలన సంఘ కాపరి, సంఘముయొక్క విభిన్న అనుభవాలను తెలుసుకుంటాడు. శ్రీసభలో అనేక సందర్భాలలో సంఘ కాపరి తన ప్రజలతో కలసి జీవిస్తున్నా, మనస్సులు మాత్రం దూరంగా ఉంటాయి. నులివెచ్చని స్వభావంతో ప్రజలతో పాక్షిక ప్రయాణాన్ని కొనసాగిస్తాడు. అటువంటి స్వభావాలు మారాలని జగద్గురువులు పిలుపునిచ్చారు. తనకు ఇవ్వబడిన సంఘాన్ని తనతో కలసి దేవుని మార్గంలో నడిపించాలని తెలియజేస్తున్నారు. కాపరి తన సంఘంతో కలసి మెలసి దేవుని మార్గంలో నడిపించాలని తెలియజేస్తున్నారు. తప్పిపోయిన ప్రజలను, శ్రీసభకు దూరంగా జీవిస్తున్న వారిని తన సంఘంలో ఏకం చేసుకొని సహచర ప్రయాణాన్ని ముందుకు కొనసాగించాలి. ఎప్పుడైతే కాపరి తన సంఘ సభ్యులను కలుపుకొని వారి అనుభవాలను తెలుసుకుంటాడో అప్పుడు వారి సాధక బాధలను గ్రహించి, ఆధ్యాత్మిక ఆకలిని తీర్చి, సంఘంతో కలసి దేవుని వైపు తమ ప్రయాణాన్ని కొనసాగిస్తారు. సినడల్ ప్రక్రియలో జగద్గురువులు శ్రీసభ అంతా ఏకమై ప్రయాణించాలని కోరుకుంటున్నారు.

## ఆలకించడం/ చెవియొగ్గడం

సద్బుద్ధితో ఒకరిని ఒకరు గౌరవపూర్వకంగా ఆలకించడం మొదటి మెట్టు. కాని దీనికి ఎటువంటి దురభిప్రాయాలు లేకుండా విశాల హృదయం కలిగి ఉండాలి (PD 30). శ్రద్ధతో ఒకరి భావాలను మరొకరు ఆలకించటం చాల ముఖ్యం. ఉభయుల సంభాషణలో లోపాలు వెదక్కుండా సత్యాన్ని గ్రహించి, మంచిని చూడగలగాలి. ఈ విధంగా ఒకరి భావాలను మరొకరు ఆలకించడం ద్వారా ఎదుట వారి మీద మనకున్న గౌరవాన్ని, వారి శ్రేయస్సు కోసం మనకున్న తాపత్రయాన్ని సూచిస్తుంది.

ఫ్రాన్సిస్ జగద్గురువులు ఈ సినడాలిటి ద్వారా సమాజంలో వివిధ అంతస్థులలో ఉన్నా ప్రజలను ఏ విధంగా ఆలకిస్తున్నామని ప్రశ్నిస్తున్నారు. దైవ ప్రజల పట్ల, మఠవాసులపట్ల, మైనారిటీలపట్ల, వికలాంగులపట్ల, బహిష్కరింపబడిన వారిపట్ల మనం ఏ విధంగా ఆలకిస్తున్నామని ప్రశ్నిస్తున్నారు.

ఇవి చాల నిర్దిష్ఠమైనవి, ఆలోచింపదగినవి. శ్రీసభలోని పీఠాధిపతులు, గురువులు, అధికారులు, ఆలోచించదగిన ప్రశ్నలు. సభ్యులను సవాలు చేసే విధంగా ఈ ప్రశ్నలు  ఉన్నాయి.

ఫ్రాన్సిస్ జగద్గురువులు ఈ సినడాలిటి ద్వారా రానున్న రెండు సంవత్సరములలో శ్రీసభ అనునది వినే శ్రీసభ అని, అది కేవలము సాధారణంగా ఉండేది అని, పరస్పర సంభాషణా స్వరంగా ఉండవలెనని అదేవిధంగా దీనిలో ప్రతి ఒక్కరూ ఎంతో కొంత నేర్చుకోవాలని జగద్గురువుల కోరిక. సాధారణ విశ్వాసులు మొదలు గురువులు, ప్రాంతీయ పీఠాధిపతులు తుట్టతుదకు జగద్గురువులు వరకు అందరు ఒకరు చెప్పినది మరియొకరు వినుచు దేవుని స్వరాన్ని ఆలకించాలి. శ్రీసభకు దేవుని ఆత్మ ఏమి బోధించుచున్నదో గ్రహించి ఐక్యమై స్వరాన్ని వినడానికి పీఠాధిపతులు ప్రాతినిధ్యం ప్రజలకు ఆ స్వరాన్ని అందించేటప్పుడు వారి స్వరం కాక దేవుని ప్రతినిధులుగా దైవ స్వరాన్ని తెలియజేస్తున్నారు *(LG 12).*

ఒక సంఘ కాపరి యొక్క స్వరం సంఘానికి, సంఘకాపరికి, ఇతరులకుమధ్య పరస్పర సంభాషణ ఉండాలి. గృహస్థ క్రైస్తవులను, యువతీ యువకులను, స్త్రీలను ఆలకించాలి. వారి కష్టసుఖాల్లో పాలు పంచుకోవాలి. జీవిత అంచుల్లో ఉన్నవారిని, బలహీన వర్గాలను, పేదరికంలో ఉన్నవారిని ప్రక్కకు నెట్టకుండా వారిని ఆలకించి వారితో కలసి ప్రయాణించాలి. ప్రతిబంధకాలన్నింటిని తొలగించి వారిని సమాజం నుండి వేరు చేయకుండా వారి గోడు వినిపించేందుకు అవకాశాన్ని కల్పించి వారితో కలసి ప్రయాణించాలి.

## మాట్లాడటం/వ్యక్తపరచటం

స్వేచ్ఛగా, ధైర్యంతో మాట్లాడేందుకు దైవ ప్రజలంతా ఆహ్వానితులే. ఇక్కడ స్వేచ్ఛ అంటే సోదర ప్రేమతో, యదార్థంగా, సత్యంతో, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో మాట్లాడడానికి అందరూ అర్హులే. సమాజానికి ఉపయోగపడే అంశాన్ని మాట్లాడానికి, మంచి మాట్లాడటానికి అందరికి అవకాశం ఉంది. కాని కొన్ని

సందర్భాలలో శ్రీసభలో బాధ్యతాయుతంగా, ధైర్యంగా మాట్లాడేందుకు కొన్ని అడ్డుగోడలు వెంటాడుతున్నాయి. ముఖ్యంగా డబ్బు, అధికారం, పురుషాధిక్యం వంటి అడ్డుగోడలు బడుగు బలహీన వర్గాలు, అల్ప సంఖ్యాక వర్గాలు తమ వాక్ స్వాతంత్ర్యాన్ని కోల్పోతున్నారు. అధికారులు, సంఘ కాపరులు అనేక సందర్భాలలో అల్ప సంఖ్యాక వర్గాల వారితో మాట్లాడటానికి నిరాకరిస్తారు. కొన్ని పర్యాయములలో వారు మాట్లాడటానికి కూడా అవకాశం ఇవ్వరు. ఇటువంటి ధోరణిని మార్చుకోవాలని ఫ్రాన్సిస్ జగద్గురువులు శ్రీసభను ఆహ్వానిస్తున్నారు. ఇంకను కథోలికేతరులతో, ఇతర సంఘస్థులతో కూడా సదాభిప్రాయాన్ని కలిగి ఉండమని పిలుపునిచ్చారు. వారితో అన్యోన్య సంబంధం కలిగి జీవించాలి. కథోలిక శ్రీసభ అనేది అందరిని ఆహ్వానించేది. ఎటువంటి వర్గ తారతమ్యం లేకుండా అందరిని ఆహ్వానిస్తుంది. అటువంటి సంఘంలో ఉన్న మనము అన్యులను ప్రేమతో ప్రక్కకు తీసుకోవాలి గాని, అనునిత్యం దూరం చేసుకోకూడదు.

## మహోత్సవం-దైవార్చన ప్రక్రియ

శ్రీసభలో కలసి పయనించడం సాధ్యమయ్యేది దివ్య పూజాబలి సమర్పణ, వాక్య పరిచర్య ద్వారానే. మన ప్రార్థన, దైవార్చన సంఘంలో అనుదిన ప్రేషిత కార్యానికి, జీవితానికి ప్రేరణ, మార్గదర్శకత్వం కలిగించేదిగా ఉండాలి. సామాన్య క్రైస్తవులకు ఇవ్వబడిన ప్రత్యేక భాగస్వామ్య పరిచర్యలలో వారిని ప్రోత్సహించాలి. దివ్యబలిపూజ నిర్వహణకు సంబంధించిన అంశాల్లో సహాయపడేందుకు తగిన వారికి, తగిన విధంగా శిక్షణ ఇచ్చి నేర్పించాలి. ఉదాహరణకు పూజలో పఠనాలు చదవడం, దైవవాక్య పరిచయం, పూజకు ఉపోద్ఘాతం చెప్పడం, పాటలు పాడటం, కానుకలు పట్టడం, విశ్వాసుల ప్రార్థనలు, పీఠం అలంకరణ, వత్తాసు బాలురు తదితర భాగస్వామ్య సేవల ద్వారా దివ్యబలిపూజను అర్థవంతంగా కొనియాడటం జరుగుతుంది. ఇటువంటి పరిచర్యలు ద్వారా దైవార్చనలో విశ్వాసులంతా చైతన్యవంతంగా పాల్గొనే విధంగా ప్రోత్సహించాలి.

## మన సమిష్టి ప్రేషిత కార్యం కోసం సహబాధ్యత

సినడాలిటి అనేది శ్రీసభ ప్రేషిత కార్య సేవకు సంబంధించినది. దీనిలో శ్రీసభ సభ్యులంతా పాల్గొన పిలుపునొందారు. ద్వితీయ వాతికను మహాసభ బోధనల ప్రకారం, జ్ఞానస్నానం స్వీకరించి ప్రతి ఒక్కరు స్థానిక శ్రీసభ సేవ పరిచర్యలపట్ల బాధ్యత కలిగి ఉంటారు. ఒక సంఘాన్ని నిర్మించి, క్రీస్తు దైవారాజ్యాన్ని విస్తరింపజేయడమే పరిచర్య ప్రధాన లక్ష్యం. క్రీస్తు ప్రేషితకార్యము ఒకటే మీరు వెళ్లి సకలజాతి జనులకు సువార్తను బోధించి, జ్ఞానస్నానము ఇచ్చి, అందరిని క్రీస్తు అనుచరులుగా మార్చండి అని ప్రభు క్రీస్తు తన శిష్యులకు ఇచ్చిన ఆదేశం. అదే క్రీస్తు ప్రేషిత కార్యం. ఈ ప్రేషిత కార్యాన్ని నెరవేర్చడమే శ్రీసభ కర్తవ్యం. శ్రీసభ ఈ ప్రేషిత కార్యాన్ని పలువిధాలుగా నెరవేరుస్తుంది. ఆలా పలురకాలుగా చేసే సేవాకార్యాలే "పరిచర్యలు". క్రీస్తు చేసినట్లు చేసేందుకు క్రైస్తవులందరూ పిలువబడుతున్నారు. జ్ఞానస్నానం స్వీకరించిన ప్రతీ క్రైస్తవుడు ఈ ప్రేషిత కార్యంలో భాగస్తుడు, సహ బాధ్యత కలిగిన వాడు అవుతాడు. అలా మొత్తంగా క్రీస్తు మాదిరిగా ఈ లోకంలో పరిచర్యలను కొనసాగించేందుకే శ్రీసభ ఏర్పాటు చేయబడింది. కనుక ఈ శ్రీసభ సంక్షేమాభివృద్ధికి, దాని ఉనికిని చాటే కృషిలో ఇరువురూ కలసి పంచుకుంటారు. ఒకరికొకరు తోడుగా ఉంటూ కలసి పనిచేస్తారు.

జగద్గురువులు ఆశయం మేరకు శ్రీసభలో సామాన్య క్రైస్తవులను వేరుచేసే అడ్డుగోడలు, సరిహద్దులను తొలగించాలి. అనగా గురువుల నుండి సామాన్య క్రైస్తవులను, పురుషులనుండి స్త్రీలను, వేదనిపుణుల నుండి సామాన్య ప్రజలను, ధనికులనుండి పేదవారిని వేర్వేరుగా చూడ కూడదు. క్రీస్తు సంఘంలో మనమందరం పరస్పరం ఒకరిపై ఒకరం ఆధారపడే సంస్కృతిలో ఉన్నాం. ఒకరు తగినంత జ్ఞానం, ఆర్థిక సంపదను కలిగి ఉన్నప్పటికీ, అవి మరొకరితో అనుసంధానమై ఉన్నప్పుడు మతమే అభివృద్ధి, ఆనందం లభిస్తుంది. అందువల్ల పరిచర్యలు పవిత్రాత్మ శ్రీసభకు ఒసగిన కృపానుగ్రహ వరాలని, వాటిని ఇతరుల సహకారంతోనే పరిపూర్తి చేయగలం అని ఆసియా ఖండ పీఠాధిపతుల సమాఖ్య వక్కాణించింది.

క్రీస్తు జ్ఞాన శరీరమే శ్రీసభ. అది ప్రేమతో నిర్మించబడింది. కనుక ప్రతి ఒక్కరి సహకార భాగస్వామ్యంతోనే వర్ధిల్లుతుంది. ఒక దేహంలోని అవయవాలన్నీ అనుసంధానమై కలసి తమ వంతు కర్తవ్యాన్ని నెరవేర్చినప్పుడే అది ఆరోగ్యవంతమై ఉంటుంది. ఈ ఐక్యత అనేది లోలోపల నిక్షిప్తంగా ఉండేది కాదు. అలా జరిగితే అది స్వయం వినాశకరంగా మారుతుంది. కనుక అది బయటకి కనపడే విధంగా ఉండాలి. ఇటువంటి ఐక్యతా భావనే శ్రీసభ కలిగి ఉండాలి. దైవ రాజ్య నిర్మాణానికి నాంది పలకాలి.

## సమాజంలోను, శ్రీసభలోను సంభాషణ

ప్రస్తుత ప్రపంచంలో శ్రీసభ సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. ఈ నూతన శకంలో మానవత్వం కొరవడుతుండగా అనేకమైన ప్రాపంచిక విషయాలు శ్రీసభకు, మనిషికి మధ్య దూరాన్ని పెంచుతున్నాయి. అత్యంత విషాదకరమైన సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. సంభాషణ సాధ్యమవ్వాలంటే పట్టుదల, ఓపిక ఉండాలి. అది పరస్పర అవగాహనను పెంపొందిస్తుంది. జగద్గురువులు పీఠాధిపతులను, గురువులను కేవలం దివ్యపూజాబలికి, పాప సంకీర్తనకు మాత్రమే పరిమితం కాకుండా ప్రజల మధ్యలోనికి వెళ్లి వారితో కలసి జీవించమని అభ్యర్థిస్తున్నారు. దేవాలయ వీధుల్లో పయనిస్తూ ప్రజల సాధక బాధలను గుర్తించాలి. విచారణ సంఘంలో ఉన్న ప్రతీ కుటుంబం యొక్క యోగక్షేమాలు తెలుసుకోవాలి. క్రైస్తవ విలువలను వాటి ముఖ్యోద్దేశాలను కుటుంబాలకు తెలిపి సక్రమమైన మార్గంలో నడిపించాలి. కేవలం సువార్తను ప్రకటించడమేకాక సేవారూపంలో కూడా క్రీస్తును ప్రకటించాలి.

శ్రీసభలో సాధారణ ప్రజల పాత్రకు సంబంధించిన మనస్తత్వం మారాలి. దైవ ప్రజలను దైవాంకితుల సహకారులుగా పరిగణించకూడదు. సహబాధ్యత కలిగిన వ్యక్తులుగా దైవ ప్రజలను పరిగణించాలి. పరిపక్వత, నిబద్ధత కలిగిన గృహస్థ క్రైస్తవులు ఏకీకృతం కావడం వలన దైవరాజ్య నిర్మాణం, వ్యాప్తి అను ప్రేషితకార్యం బాగా జరుగుతుంది. శ్రీసభలో పీఠాధిపతులు ఎల్లప్పుడూ స్నేహపూర్వక సంభాషణ కలిగి దైవప్రజలతో సహవాసం కలిగి ఉండాలి.

విశ్వాసుల సంప్రదింపుల విషయంలో పీఠాధిపతులకు తప్పనిసరిగా విచక్షణ ఉండాలి. దేవుని ప్రజల తరగని విశ్వాస నిధి (Sensus Fidei) కి శ్రద్ధ వహించాలి. పీఠాధిపతులు పవిత్రాత్మ సూచనలను అనుసరించి, మారుతున్న ప్రజాభిప్రాయాలను గుర్తించగలగాలి.

దైవాంకితులు కేవలం దేవాలయాలకే నిమగ్నం కాకుండా సమాజంలో జరిగే సమస్యలు, ఇబ్బందులు, మత ఘర్షణలు, మొదలైన వాటిని సాధ్యమైనంత వరకు పరిష్కరించే ఏర్పాటు చేయాలి. సమాజాన్ని శ్రీసభ ఏకతాటిపై నడిపించాలి. పేదలు, బిచ్చగాళ్ళు, మాదక ద్రవ్యాలకు బానిసలైన వారు, సమాజంలో విస్మరింపబడే వారందరూ సినడ్ లో భాగమే. వారు కూడా శ్రీసభలో భాగమే. వారిని కూడా మన సంఘంలో భాగస్వాములను చేసుకోకపోతే ఈ సినడల్ ప్రక్రియను పరిపూర్ణంగా నిర్వహించిన వాళ్ళము కాలేము. వారితో కూడా సమయం గడపాలి. వారు చెప్పేది వినడమే కాకుండా, ఏమి అనుభూతి చెందారో గ్రహించాలి. శ్రీసభ నుండి వారిని దూరం చేయకుండా వారితో సహవాసం చేస్తూ, వారు కూడా శ్రీసభకు అవసరమని గుర్తించడం వలన మన పరిధులను విస్తృతం చేసుకోగలుగుతాము. పరస్పర సంభాషణ, వినడం అనేది ఈ సినడ్ యొక్క ముఖ్య ఉద్దేశం.

## క్రైస్తవ సమైక్యత స్థాపన

క్రైస్తవ సమైక్యత స్థాపనలో ఈ సినడ్ ప్రత్యేకమైన ప్రాముఖ్యతను కలిగి ఉంది. ప్రధానంగా విశ్వాసులందరు కలసి ఏవిధంగా విశ్వాస ప్రయాణం కొనసాగించాలో సమాలోచనలు చేయాలని ఫ్రాన్సిస్ జగద్గురువులు పిలుపునిచ్చారు. ఈ అంశమే, సినడల్ ప్రక్రియలో ప్రాథమిక చర్చనీయాంశం. క్రైస్తవ సమైక్యత స్థాపనలో భాగంగా విభిన్న సంస్కృతుల మధ్య ఏక మనస్సు కలిగి ఒకే మార్గంలో విశ్వాస జీవన ప్రయాణం సాగించడమే ఈ సినడల్ ప్రక్రియ లక్ష్యం. ఈ ప్రక్రియలో కేవలం కథోలిక క్రైస్తవులే కాకుండా ఇతర క్రైస్తవ సంఘాలను, ఇతర మతస్థులను,నాస్తికులను సహితం కలుపుకొని లక్షసాధన దిశగా ముందుకు నడవాలి. ఒకరి భావాలను మరొకరు ఆలకించడం వలన వారి మధ్య సత్సంబంధాలు బలపడడానికి దోహదపడుతుంది. దైవ

చిత్తాన్ని తెలుసుకోటానికి, ప్రేషితకార్య నిర్వహణకు సహాయపడుతుంది.

ప్రస్తుతం విశ్వ శ్రీసభ ప్రారంభించిన ఈ సినడల్ ప్రక్రియ అన్ని దశలలో, స్థాయిల్లోనూ, క్రైస్తవ సమైక్య సాధనకు ఒక గొప్ప అవకాశం కల్పిస్తుంది. కథోలిక క్రైస్తవులంతా క్రైస్తవ సమైక్య స్థాపన దిశగా అడుగులు ముందుకు వేయాలి. క్రైస్తవ సంఘాలన్నీ కలసి మన విశ్వాస సత్యాలను కార్యరూపంలో చూపించి, మనం క్రీస్తుకు విశ్వసనీయమైన సాక్ష్యంగా నిలవాలి. క్రైస్తవ సంఘాలన్నీ సమ సమాజ నిర్మాణానికి కట్టుబడి పని చేయాలి. దైవ రాజ్య స్థాపన దిశగా ప్రణాళికలు వేయాలి. ప్రజల మధ్య సౌభ్రాతృత్వం, దయ, ప్రేమ, సేవా తత్పరత వంటి సద్గుణాలు వికసించేలా ప్రయత్నించాలి. ఒకే జ్ఞానస్నానం ద్వారా ఏకం చేయబడిన క్రైస్తవ సంఘాల మధ్య పరస్పర చర్చలు, అవగాహన సదస్సులు ఆవరసం అని ఫ్రాన్సిస్ జగద్గురువులు పిలుపునిస్తున్నారు. ఇతరులను కలుపుకొని నడిస్తేనే క్రైస్తవ సమైక్యత సాధ్యమవుతుంది.

## అధికార భాగస్వామ్యం

సినడల్ శ్రీసభ అంటే సహబాధ్యత, భాగస్వామ్యంగల దైవ జన సంఘం. శ్రీసభలో అందరి కర్తవ్యం – సేవా లక్ష్యం ఒక్కటే. కాని పనితీరులు పలువిధాలు. అంటే శ్రీ సభ కార్యం ఒక సమిష్టి సాధన. కనుక అందరూ బాధ్యులే. అందువల్ల శ్రీసభలోని సభ్యులందరూ సమాన గౌరవాన్ని, సమాన బాధ్యతను కలిగి ఉంటారు. అంటే పనుల్లో భిన్నత్వం ఉన్నప్పటికీ లక్ష్యం మాత్రం ఒకటే ఉంటుంది. ఈ అంశంపై అపోహలు తొలగించి, సభ్యుల్లో సరైన అవగాహన కలిగించేందుకు, గురువులు సామాన్య క్రైస్తవుల కార్య నిర్వహణ విధానాల గురించి ద్వితీయ వాతికను మహాసభ ఓ స్పష్టమైన వివరణను ఇస్తూ ఇలా పేర్కొంది. శ్రీసభ సేవా కార్యాలలో భిన్నత్వం ఉంది కానీ సేవాధర్మం, సేవా బాధ్యత, సేవాకర్తవ్యం మాత్రం ఒక్కటే. (సామాన్య క్రైస్తవులు నెం. 2)

ప్రస్తుత శ్రీసభలో విధానపరమైన మార్పుల కారణంగా తీవ్ర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. దైవరాజ్య విలువైన, తగ్గింపుతనం, నిరాడంబరత, సేవాపరిచర్యలనే క్రైస్తవ సుగుణాలను ప్రక్కకు నెట్టి ఆడంబరత్వం, హోదా,

దర్పం, పరిపాలనా సామర్థ్యం, విలాసవంతమైన జీవితం, బల నిరూపణ అనే అధికార ప్రదర్శనలకు ప్రాధాన్యత పెరిగింది. అంతేగాక శ్రీసభ పరిపాలనా వ్యవహారాల్లోనూ కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల ప్రమేయం పెరిగి చివరికి వారు సూచించిన విధంగా పాలన జరిగే దారుణ పరిస్థితి దాపురించింది. అటువంటి పరిస్థితులకు ఈ సినడ్ ద్వారా చరమగీతం పాడాలి.

దైవాంకితులు శ్రీసభ ద్వారా వారికి సంక్రమించిన అధికారాన్ని గృహస్థ క్రైస్తవుల మంచి కొరకై వినియోగించి శ్రీసభను ఫలభరితం చేయాలి. మేత్రాసన, విచారణ సలహా సంఘాలు, గురువుల సమాఖ్యలు మొదలైనవి నిర్వహించి శ్రీ సభను అభివృద్ధి చేస్తూ, ప్రగతి పథంలో ముందుకు నడిపించాలి. శ్రీసభ సేవక కర్తవ్యాన్ని ఎత్తిపట్టి, ఆధునిక ప్రపంచంలో సామాన్య క్రైస్తవులు మరింత క్రియాశీలకంగా, ఔదార్యముగా సేవ చేయాలని ద్వితీయ వాతికను మహాసభ ఉద్బోధించింది *(GS: 93).* సామాన్య క్రైస్తవుల ద్వారానే శ్రీసభ లోకాన్ని ప్రభావితం చేయగల్గుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేసింది. సామాన్య క్రైస్తవులంటే ఎవరో సరైన అవగాహన కల్పిస్తూ, గురువులు - సామాన్య క్రైస్తవులు సహవాస జీవితం కలిగి, సహబాధ్యతతో వ్యవహరించే సరికొత్త యుగానికి తలుపులు తెరిచింది.

## విచక్షణ - నిర్ణయం

ఈ సినడల్ విధానంలో పరిశుద్ధాత్మతో ఏకమై విచక్షణ ద్వారా క్రైస్తవ సమాజం, కలసి నిర్ణయాలు చేస్తుంది. శ్రీసభలో ఏదైనా నిర్ణయాలు చేసేటప్పుడు కొందరి అభిప్రాయాలు సేకరించి వాటిని క్రైస్తవ సమాజంపై బలవంతంగా రుద్దకూడదు. శ్రీసభలో అభివృద్ధి గురించి చర్చించి నిర్ణయం తీసుకొనేటప్పుడు కేవలం ఉన్నత వర్గాల వారి అభిప్రాయాలు మాత్రమే కాకుండా అందరి అభిప్రాయాలను తీసుకొని సన్మార్గంలో ముందుకు నడవాలి. వివిధ అంతస్తులలో (Hierarchical) నిర్ణయాలను చేసేటప్పుడు భాగస్వామ్య పద్ధతిని ప్రోత్సహించాలి. అందరి అభిప్రాయాలను స్వాగతించాలి. అందులో మేలైన వాటిని, ఉపయోగపడే వాటిని స్వీకరించి శ్రీసభను ప్రగతి పథంలో నడిపించాలి.

దైవాంకితులు శ్రీసభ అభివృద్ధికై తీసుకునే చర్యలు, నిర్ణయాలు సామాన్య ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలేగానీ, శ్రీసభకు దూరం చేసేవిగా ఉండకూడదు. ఆ నిర్ణయాలు జవాబుదారీతనంతో కూడి ఉండి, పారదర్శకతను ప్రోత్సహించాలి. సంఘ అభివృద్ధికై పాటుపడాలి. శ్రీసభ భవిష్యత్తు పేదల ఆర్తనాదాలను ప్రార్థనా పూర్వకంగా వినటంలో ఉంది. ఆ ఏడుపులను విని ఓదార్చడంలో ఫ్రాన్సిస్ జగద్గురువులు స్వయంగా మనకు ఆదర్శం. పేదలకు ప్రాధాన్యత లేకుండా శ్రీసభలో చేసే ప్రతీ కార్యం, నిర్వహించే సువార్త పరిచర్యల వలన అపార్థం చేసుకొనే ప్రమాదం ఉంది *(Evangeli Gaudium 199).* పేదలకు ప్రాధాన్యత అనేది సువార్తలలో మాత్రమే కాకుండా ద్వితీయ వాతికను మహాసభ ద్వారా కూడా తెలియజేసారు. పేదలకు ప్రాధాన్యత ఇవ్వటం అనేది ఎదో వారికీ మంచి చేయటం అన్న ఉపశమన ధోరణి కాదు, వారిని కూడా కలుపుకొని శ్రీసభ పరిచర్యలో ముందుకు సాగాలి. ఆలోచనల్లో, ప్రార్థనా విధానంలో నడవడికలో మార్పురావాలి. ప్రజల సామాజిక స్థితిగతుల్లో మార్పు రావాలి. భిన్నత్వంలో ఏకత్వం ఏర్పడాలి.

## సినడాలిటిలో మనకు మనం ఎలాంటి శిక్షణ, తర్ఫీదు అందించుకోగలం

సినడాలిటి అంటే మార్పుకు సుముఖత, నిరంతర అధ్యాయనం, స్వీయ తర్ఫీదు. భాగస్వామ్య శ్రీసభ నిర్మాణంలో ప్రజలందరు పాల్గొనాలంటే శ్రీసభ ఒక భాగస్వామ్య శ్రీసభగా మారాలి. అలా రూపాంతరం చెందాలంటే ముందుగా గృహస్థ క్రైస్తవులు శ్రీసభ విశ్వాసుల, సిద్ధాంతం, పాలన, పరిశుద్ధ గ్రంథ సంబంధిత అంశాల్లో తగిన తర్ఫీదు పొందాలి. క్రైస్తవ జీవిత ఆచరణకు సంబంధించిన ప్రాధమిక అంశాల్లో వారు సరైన అవగాహన కలిగి ఉండాలి. అంతేగాక శ్రీసభ అధికార వర్గం గురువులు, మఠవాసులు కూడా తమ ఆలోచనా విధానంలో, పనితీరులో అందుకు తగిన రీతిలో మార్పుచెందాలి.

శ్రీసభ వ్యవహారాలు, పరిచర్యలు, ఎదుర్కొంటున్న సమస్యల గురించిన వర్తమాన సమాచారం ప్రజలకు ఎప్పటికప్పుడు అందడం లేదు. గృహస్థ క్రైస్తవులు ఎప్పుడు, ఎక్కడ, ఏమి చేయాలో, ఎందులో భాగస్వామ్య బాధ్యత

స్వీకరించాలో తెలియని గందరగోళంలో ఉంటున్నారు. కేవలం ఆదివార పూజ పఠనాలు, గురువుల ప్రసంగాలు మాత్రమే తమ జీవితంలో విశ్వాసపరంగా సరిపోతాయని భావిస్తున్నారు కాని వాటిని దాటి మతపరమైన, విశ్వాస పరమైన తర్ఫీదు, విషయ పరిజ్ఞానం, పరిపక్వత అవగాహన పొందవలసిన తక్షణ ఆవశ్యకత ఉంది. దైవారాజ్య విస్తరణ అనేది సంస్థలు, భవనాల నిర్మాణం ద్వారా జరగదు. ప్రజలు క్రీస్తు సాక్షులుగా జీవించడమే దైవారాజ్య విస్తరణ.

గృహస్థ క్రైస్తవులు పొందే తర్ఫీదు కేవలం గృహస్థ సంబంధమైన, మతపరమైన, మానవ సంబంధాల గురించిన అంశాలపైన మాత్రమే కాదు. దీని ద్వారా మూడు ఉద్దేశాలు నెరవేరాలి. మొదటిగా ఈ తర్ఫీదు ద్వారా ఒక వ్యక్తి అంతర్గత మార్పు కలగాలి. రెండవదిగా, శ్రీసభలో మార్పు రావాలి. మూడవదిగా, నవ సమాజం ఏర్పడాలి. ఈ తర్ఫీదు అంతిమ లక్ష్యం దైవారాజ్య నిర్మాణం. శిక్షణ సమయంలో పాఠాలు, ప్రణాళికలు సిద్ధం చేసేటప్పుడు మనిషి వ్యక్తిగత మార్పుకు ప్రాధాన్యతనివ్వాలి. ఇది ఫలప్రదం కావాలంటే స్థానిక శ్రీసభలో అనగా మేత్రాసనాలలో, విచారణలలో వీటికి తగినంత ప్రాధాన్యత నివ్వాలి. అప్పుడే మనం భాగస్వామ్య శ్రీసభ లక్ష్యాన్ని సాధించగలం.

## ఈ సినడ్ దేవుని నుండి వచ్చిన పిలుపు

దేవుని శ్రీసభలో యాత్రికులమైన మనము దేవునికి దగ్గరగా జీవించాలంటే మన సుఖాలను విడిచిపెట్టమని ఫ్రాన్సిస్ జగద్గురువులు తెలియజేసారు. కలసి ప్రయాణించడం, కలసి ప్రార్థించడం, కలసి పనిచేయడం వంటి అంశాలు ఫ్రాన్సిస్ జగద్గురువులు గారి యొక్క ఆలోచనా విధానం. క్రైస్తవుల నడవడికను ఒకరితో ఒకరు పంచుకోవడం ద్వారా, అందరం కలసి ప్రార్థించడం ద్వారా, క్రైస్తవ సంఘాలన్నీ కలసి వారి పరిచర్య ద్వారా క్రీస్తుకు సాక్షులుగా జీవించడం వలన క్రీస్తు ప్రభువు ఆశించిన ఐక్యత (ఒకే మంద, ఒకే కాపరి) క్రైస్తవ సమైక్య స్థాపన సాధించగలం.

## ముగింపు

సినడ్ ప్రక్రియ శ్రీసభ తన ప్రేషిత కార్యాన్ని ఫలవంతంగా కొనసాగించడానికి, దైవరాజ్య స్థాపన దిశగా ముందడుగులు వేయడానికి ఉపకరిస్తుంది. విభిన్న సంస్కృతుల మధ్య ఏక మనస్సు కలిగి ఒకే మార్గంలో విశ్వాస జీవన ప్రయాణం సాగించడమే ఈ సినడ్ ప్రక్రియ లక్ష్యం. ఈ ప్రయాణంలో కేవలం కథోలిక క్రైస్తవులమైన మనము మాత్రమే కాకుండా ఇతర క్రైస్తవ సంఘాలకు చెందిన వారిని, ఇతర విశ్వాస సాంప్రదాయాలకు చెందిన వారిని, నాస్తికులను సహితం కలుపుకొని లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలనేదే ప్రధాన ఉద్దేశం. ఒకరి భావాలను మరొకరు ఆలకించడం, తద్వారా వారి మధ్య సత్సంబంధాలు బలపడటానికి దోహద పడుతుంది. దైవచిత్తాన్ని తెలుసుకోడానికి, ప్రేషిత పరిచర్య నిర్వహణకు సహాయ పడుతుంది.

శ్రీసభ నూతన దృక్పథం కార్యరూపం దాల్చాలంటే ఇరువైపులా అనగా దైవాంకితులు, గృహస్థ క్రైస్తవుల్లో ప్రాథమికంగా మార్పు అవసరమౌతుంది. ఈ ప్రకారంగా గురువులు, సామాన్య క్రైస్తవులు తమ విధులను, పరిధులను గ్రహించి వ్యవహరిస్తే, శ్రీసభ ప్రజల శ్రీసభగా ఎదుగుతుంది. చిన్న మంద పెద్ద సమూహంగా వర్ధిల్లుతుంది. తద్వారా సామాన్య క్రైస్తవులు శ్రీసభను తమ సొంత కుటుంబంగా అనుభూతి చెందుతారు. శ్రీసభ సంక్షేమాభివృద్ధి పట్ల ప్రత్యేక ఆసక్తి కలిగి ఉంటారు.

ప్రస్తుత సినడ్ విభిన్న సభ్యుల ఐక్యతకు వారధిగా ఉండాలి. క్రైస్తవ సంఘాలన్నీ కలసి మన విశ్వాస సత్యాలను కార్యరూపంలో చూపించి, మనం క్రీస్తుకు విశ్వసనీయమైన సాక్షులుగా నిలవాలి. అందరు కలసి సమసమాజ నిర్మాణానికి కట్టుబడి పనిచేయాలి. ఇది కేవలం ప్రశ్నాపత్రాన్ని నింపడం మాత్రమేకాదు. పరిశుద్ధాత్మ మనకు అందజేస్తున్న ఫలాలను సేకరించాలి. కేవలం సినడాలిటి గురించి మాట్లాడటమే కాదు, ప్రపంచ వ్యాప్తంగా దీనిని ఆచరణలో పెట్టాలి. శ్రీసభలో వివిధ అంతస్తులలో ఉన్న వారందరూ తమ జీవన శైలిని పునరుద్ధరించుకొని, కలిసి పనిచేస్తూ శ్రీసభను ప్రగతి పథంలో ముందుకు నడపాలి.

# 7. సినడ్: శ్రీసభ భవిత

- బ్రదర్ కాలెంతు సాగర్



## ఉపోద్ఘాతం

రెండవ వాటికన్ మహాసభ తరువాత 2021-2023లో సహవాసము, భాగస్వామ్యము, ప్రేషిత కార్యము అంశాలపై జరిగే సినడ్, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శ్రీసభలో జరిగే ఒక ముఖ్యమైన వివేచన ప్రక్రియ. ఈ సినడ్‌కి ఒక ప్రత్యేకత ఉంది. సాధారణంగా సినడ్ అంటే కేవలం విశ్వశ్రీసభలో ఉన్న పీఠాధిపతులందరు రోము నగరంలో పరిశుద్ధ పాపుగారి అధ్యక్షతన సమావేశమై విశ్వాసము, కథోలిక సిద్ధాంతాలు, ప్రస్తుత ఆధునిక సమస్యల గురించి తర్కించి చివరకు ఆ సభ యొక్క ఫలితాలను గురించి పరిశుద్ధ పాపుగారు విశ్వలేఖను జారీ చేస్తారు. ఆ లేఖ ప్రపంచములో ఉన్న కథోలికులకు వర్తింపచేయటం మాత్రమే కాక, ఆచరణలో పెట్టమని పాపుగారు పిలుపునిస్తారు. కాని ఈ 2021-2023లో జరిగే సమైఖ్య మహాసభ కేవలం పీఠాధిపతుల సహాలు మాత్రమే కాక స్థానిక శ్రీసభలో ఉన్న విశ్వాసులందరి అభిప్రాయలను కూడా స్వీకరించడం జరుగుతుంది. అందువలన ఇది ఒక క్రొత్త ఆవిష్కరణకు, శ్రీసభ భవితకు బాటలు వేస్తుంది అని చెప్పడంలో అతిశయోక్తిలేదు. శ్రీసభలో ఈ నూతన ఆవిష్కరణ ద్వారా పాపుగారు ప్రపంచములోని విశ్వాసనులందరి అభిప్రాయాలను తెలుసుకొని వాటిని పీఠాధిపతుల సలహాలతో చేర్చి ఒకే మందగా, ఒకే దేవుని ప్రజలుగా విశ్వాసయాత్రను కొనసాగించాలన్న మంచి ఆలోచనతో ఈ సినడ్ ప్రక్రియను ప్రారంభించడం జరిగింది. అలా అందరు ఒకే విశ్వాస సంఘముగా క్రీస్తు నుండి వారసత్వముగా పొందిన సమానత్వ హోదా, సమతా భావము, పరపస్పర

మమతానురాగాలను కలిగి క్రీస్తు రాజ్యాన్ని స్థాపించడంలో కలిసి ముందుకు పోవాలని ఈ సినడ్ పిలుపునిస్తుంది.

కావున ఈ సినడ్ యొక్క ముఖ్య ఉద్దేశము "శ్రీసభ భవిత."ఇది శ్రీసభ మనుగడకు బాటలు వేస్తుంది. ఒకే దేవుని మందగా శ్రీసభ భవితకు తోడ్పడుతూ విశ్వాసులందరి సలహాలను తీసుకొని ఒకే కాపరియైన క్రీస్తు ప్రభుని మార్గములో నడవడానికి ప్రయత్నం చేయాలి. అప్పుడే శ్రీసభ భవితను నిర్ధారించగలుగు తాము. కావున ఈ భవిష్యత్తును నిర్ధారించే క్రమములో అసలు శ్రీసభ అంటే ఏమిటో అని ఈ క్రింది అయిదు అంశాలను అర్థం చేసుకున్నప్పుడే దాని మనుగడ సాధ్యమవుతుంది.

1. శ్రీసభ : భవనాలు లేదా బంగళాలు కాదు, శ్రీసభ అనేది దేవుని ప్రజలు
2. శ్రీసభ : దైవవాక్కును ఆలకించేది
3. శ్రీసభ : ఒక సహవాస జీవితం, ప్రేషిత కార్యం
4. శ్రీసభ : కలిసి ప్రయాణించడం
5. శ్రీసభ : ఒక రక్షణ ద్వారం

## 1. శ్రీసభ: భవనాలు లేదా బంగళాలు కాదు, శ్రీసభ అనేది దేవుని ప్రజలు

శ్రీసభ, 'చర్చ్' అనే ఆంగ్ల పదం నుండి, 'ఎక్లేసియ' అనే గ్రీకు పదం నుండి ఉద్భవించినది. దీని అర్థం దేవుని ప్రజలు. ఒకే విశ్వాసాన్ని ప్రకటించే ప్రజలందరినీ కలిపి చర్చ్ లేదా సంఘం అని పిలుస్తారు. చర్చ్ అనేది ఒక గ్రామం, లేదా ప్రాంతంలో ఉన్న దేవుని ప్రజలను సూచిస్తుంది. ఈ చర్చ్ అనే ఇంగ్లీషు పదాన్ని తెలుగులో శ్రీసభ లేదా దేవుని సంఘం అని పిలువబడుతుంది. (ఫాదర్ త్రైనీస్ అల్ఫోన్స్, భాగస్వామ్య శ్రీసభ, "అందని ఆకాశమా?")

క్రీస్తు ప్రభువు తన పన్నెండు మంది అపోస్తులులను నియమించి "మీరు ప్రపంచమందంతట తిరిగి, సకల జాతి జనులకు సువార్తను బోధింపుడు" (మార్కు 16:15) అని వారిని ఆజ్ఞాపించాడు. ఏ విధంగా క్రీస్తు వాడ వాడలా పర్యటించి దేవుని రాజ్యాన్ని బోధించాడో, అపోస్తులులు కూడా అనేక ప్రాంతాలు

తిరిగి క్రీస్తు సువార్తను ప్రకటించి, స్థానిక శ్రీసభలను లేదా క్రీస్తు సంఘాలను ఏర్పాటు చేశారు.

అపోస్తులుల కార్యాలలో మనం చూసినట్లుగా వారు చిన్న చిన్న సంఘాలను (శ్రీసభ) ఏర్పాటు చేసి, వాటికి నాయకులను నియమించి, విశ్వాసంలో దృఢంగా ముందుకు పోవాలని ప్రోత్సాహాన్ని అందించారు. ఆదిమ శ్రీసభ కాలంలో ఆనాటి క్రైస్తవ సంఘాలు మొదట గృహస్థ శ్రీసభలుగా కనిపించేవి. కాలక్రమేణ క్రైస్తవ్యం రోమన్ రాజ్య అధికార మతంగా గుర్తింపు పొందినపుడు చిన్న చిన్న మందిరాలు, దేవాలయ నిర్మాణాలు జరిగాయి. అలా ఆనాటి శ్రీసభ నిర్మాణం దేవుని ప్రజల మధ్య సహవాసాన్ని పెంపొందించడానికి సహాయపడింది.

క్రీస్తు సంఘం లేదా శ్రీసభ అభివృద్ధిచెందుతున్న క్రమంలో శ్రీసభ అంటే "దేవుని ప్రజలు" అనే అర్థం నుండి భవనాలు లేదా బంగ్లాలు అనే అర్థంగా మారటం జరుగుతూ వచ్చింది. ఈ కారణం చేతనే పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారు ఈ సినడ్ ద్వారా శ్రీసభకు ఒక క్రొత్త అర్థం ఇవ్వాలనే భావనతో శ్రీసభ అనేది దేవుని ప్రజలు అని స్పష్టముగా తెలియజేస్తున్నారు. శ్రీసభ అంటే భవనాలు బంగ్లాలు కాదు దేవుని ప్రజలు అని పాపుగారు రెండవ వాతికను మహాసభ అనుసారంగా తెలియజేస్తున్నారు. ఎఫెస్సీయులకు వ్రాసిన లేఖ 5 అధ్యాయములోచెప్పిన విధంగా శ్రీసభ అనేది క్రీస్తు శరీరము. ఆయన దేహంలోని భాగం. ఆయనే దానికి శిరస్సు. కాబట్టి ఎప్పుడైతే క్రీస్తు శరీరం అనగా, పాపుగారు, పీఠాధిపతులు, గురువులు, మఠవాసులు మరియు సకల విశ్వాసులు అందరూ కలసి దేవుని సహవాసంలో పాలుపంచుకుంటూ ప్రేమ, ఐక్యతా కలిగి దైవరాజ్య విస్తరణకై పాటుబడతారో అప్పుడే శ్రీసభ అంటే దేవుని ప్రజలు మరియు దైవరాజ్యాన్ని స్థాపించే వారు అనే అర్థం సార్ధకమవుతుంది. ఆనాటి క్రైస్తవ సంఘాలలో దేవుని ప్రజలే ముఖ్యం కాని భవనాలు లేదా పెద్ద పెద్ద దేవాలయాలు కాదు.

కావున ఇలాంటి భావన ఈనాటి శ్రీసభలోని దైవ ప్రజల గుండెల్లో స్థాపించుకున్నట్లైతే అది శ్రీసభ మనుగడకు దోహద పడుతుంది, ప్రాణం పోస్తుంది.

## 2. శ్రీసభ: దైవవాక్కును ఆలకించేది

ఎటువంటి దురాభిప్రాయాలు లేకుండా నివృత్తమైన మనస్సు, హృదయంతో శ్రీసభ దైవవాక్కును ఆలకించడం చాలా అవసరం. కావున శ్రీసభ ఎవరు చెప్పే మాటలు వినాలి? గృహస్తక్రైస్తవులు, యువకులు, స్త్రీల నుండి శ్రీసభ ఏవిధంగా వినగలుగుతుంది? ఏ విధంగా పీఠాధిపతులు, గురువులు, మఠవాసులు, సకల విశ్వాసుల యొక్క సహకారాన్ని ఏకీభవించగులుగుతున్నారు? అల్పసంఖ్యాకులకు, త్రోసివేయబడ్డవారలకు, వెలివేసిన వారలకు శ్రీసభలో సముచిత స్థానాన్ని కల్పిస్తున్నామా? శ్రీసభ తన మనుగడ సాగించే ప్రాంతాలలోని సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక సమస్యలను వినగలుగుతుందా? అనేది ఒకసారి ఆలోచన చేయాలి. శ్రీసభ ఇటువంటి సమస్యలను వినగలిగితే దైవవాక్కును ఆలకించడం సాధ్యమవుతుంది. శ్రీసభ యొక్క "కలిసి ప్రయాణించే యాత్రను" వికసింపజేసి, జీవముపోసి, అపోస్తులుల ద్వారా సంక్రమించిన క్రీస్తు ప్రేషిత కార్యములో సహాయపడే దేవుని ఆత్మ ఆ దైవవాక్కును విని, దానిని ఆచరింప చేయడానికి కావలసిన శక్తిని మనకు ఒసగుతుంది. ఈ ఆత్మ కేవలం ప్రేషిత కార్యాన్ని కొనసాగించడం మాత్రమేకాక దానిని వికసింపజేసి అవసరమైన సహాలను ప్రేరేపిస్తుంది కావున ఈ మన సమైఖ్య శ్రీసభ నిర్మాణ యాత్రలో దైవవాక్కులో దాగియున్న ముఖ్యమైన రెండు ప్రతిబిబాలు ప్రభావితం చేస్తాయి.

1. సంఘ ఆరంభము: ఇది ఎల్లప్పుడు ప్రేషిత కార్యానికి తోడ్పడుతుంది.
2. ఆత్మానుభూతి: దీని ద్వారా విశ్వాసాన్ని ఇతరులకు పంచడం, క్రీస్తుకు సాక్షులుగా జీవించడం సాధ్యం అవుతుంది.

శ్రీసభ యొక్క ఈ సమైఖ్య ప్రయాణం దేవుని యందు వినయంతో, ఆత్మ సహకారంతో చేసినట్లయితే ఈ రెండు దైవవాక్కు ప్రతిబింబాల నుండి ప్రేరణ పొందడం తప్పక జరుగుతుంది. గౌరవంతో దేవుని వాక్కును వినటం, విశ్వాసంతో దానిని ప్రచారం చేయడం, అన్న పునీత యోహానుగారి మాటలను పీఠాధిపతుల సమాఖ్య నొక్కి వక్కాణిస్తుంది. 1 యోహాను 1:1-3 "సృష్టి

ఆరంభమునుండి జీవవాక్కు గురించి మేము మీకు తెలుపుచున్నాము, మేము దానిని చెవులార విని, కనులారా చూచితిమి. కనులారా చూచుటయే కాదు, మా చేతులు దానిని స్పృశించినవి.” దేవుడు తాను ఉద్దేశించిన దానిని నెరవేర్చెను, అంతేకాక క్రీస్తు ద్వారా తాను పరిపూర్తి చేయవలసిన చిత్తమును మనకు ఎరిగించెనని ఎఫెసీ 1:9 పలుకుచున్నది. కావున భాగస్వామ్య శ్రీసభ క్రీస్తు దివ్యవాణిని ఆలకించడం అనేది ఎంతో ప్రాముఖ్యమైన అంశం. ఆ వాణిని వినటం ద్వారా తండ్రి చిత్తాన్ని ఎరిగి దానిని నెరవేర్చి శ్రీసభ భవితకు బంగారు బాటలు వేయగలుగుతాము.

దైవిక సంబంధమైన సత్యాలు బైబిలు గ్రంథములో పరిశుద్ధాత్మ దేవుని ప్రేరణ వలన పొందుపరచబడ్డాయి. కావున భాగస్వామ్య శ్రీసభ అపోస్తలుల విశ్వాసం మీద ఆధారపడుతూ, పవిత్రాత్మ ప్రేరణగా ఎల్లప్పుడు పరిశుద్ధ గ్రంథాన్ని ఆలకించడానికి ప్రయత్నం చేయాలి. ఎందువలన అనగా, యేసు దేవుని కుమారుడని విశ్వసించి ఆ విశ్వాసంద్వారా ఒకే మందగా ఆయన నామమున మనము జీవము పొందుటకు ఉద్దేశించబడినది.

దైవవాక్కు పరిశుద్ధాత్మ ప్రేరణ వలననే కలిగి సత్యమును బోధించుటకు శ్రీసభలోని దోషములను ఖండించి తప్పులు సరిదిద్ది, నీతియందు నడిపిస్తూ (2 తిమోతి 3:16) దాని భవితకు మూలాధారం అవుతుంది. అందువలననే 2 పేతురు 1:19 ప్రకారం ప్రవక్తల ప్రబోధం నందలి సందేశములను మరింత అధికముగా నమ్మి దానిని శ్రద్ధతో ఆలకించుట శ్రీసభ మనుగడకు ప్రాణంపోస్తుందని వివరిస్తుంది.

ఈ కారణం చేతనే దైవవాక్కుకు అధిక ప్రాధాన్యతనిస్తూ ఎల్లప్పుడు దానిని మననం చేసుకున్నప్పుడే శ్రీసభ భవితను నిర్ధారించడం జరుగుతుంది. ఇది కేవలం పీఠాధిపతులు, గురువులు, మఠవాసులు మాత్రమే కాక, భాగస్వామ్య శ్రీసభ సభ్యులుగా దేవుని వాక్కును మననం చేస్తూ దానిని మన అనుదిన జీవితాలలో కార్యరూపం దాల్చడానికి కృషిచేయాలి. అప్పుడే మన క్రైస్తవ జీవితం సార్థకం, పరమార్థకం అవుతుంది.

## 3. శ్రీసభ: ఒక సహవాస జీవితం, ప్రేషిత కార్యం

ద్వితీయ వాతికను మహాసభ ప్రకారం శ్రీసభ అనేది తండ్రి దేవుని బహుమానం, ప్రేషిత కార్యం. ఈ బహుమానాన్ని శ్రీసభ జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి అంటే, పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారు ఇచ్చిన పిలుపును అనుసరించి "సహవాసం, భాగస్వామ్యం" అనేవి ఉండాలి. అదేవిధంగా సహవాస జీవితంలో అర్థాన్ని, పరమార్థాన్ని తెలుసుకున్నప్పుడే శ్రీసభలో విశ్వాసులందరి మధ్య సమిష్టి భావన అనేది నెలకొని ఉంటుంది. దీని ద్వారా ఒకే మనస్తత్వాన్ని కూడా కలిగిన వారమవుతాము. కావున ఈ అనుభూతి స్థానిక శ్రీసభల నుండే ప్రారంభం కావాలి. అలా ప్రారంభం అయినప్పుడు శ్రీసభ కేవలం ఒక బహుమతి లేదా పరమరహస్యమని మాత్రమే కాక, ఒక ప్రేషిత కార్యంగా భావించడానికి వీలు కలుగుతుంది. కావున ఈ సహవాస జీవితం అనేది మొదట కుటుంబములో, సంఘంలో, సమాజంలో కార్యరూపం దాల్చినప్పుడే ప్రపంచ వ్యాప్తంగా ప్రేషిత కార్యం ఆవిష్కృతమౌతుంది.

ఆసియా ఖండ పీఠాధిపతుల సమాఖ్య ప్రకారం, "శ్రీసభలోని సభ్యులందరు సమానమే" అందరు కూడా పరలోక యాత్రను కొనసాగిస్తున్నవారే, ఈ సహవాసం అనేది ఎక్కడో ఆకాశాన, పరలోకంలో కొనసాగించేది కాదు. ఇది ప్రజల మధ్య నెలకొని ఉంటుంది. ఇది కేవలం శ్రీసభ యొక్క ప్రేషిత కార్యం ద్వారానే సాధ్యం అవుతుంది. శ్రీసభ ప్రేషిత కార్యాన్ని నెరవేర్చేది పరిశుద్ధాత్మ దేవుడు. అది కేవలం ఒక సాధన మాత్రమే. ఆ ప్రేషిత కార్యాన్ని నెరవేర్చడంలో సహవాస జీవితాన్ని జీవించడానికి ఆత్మ దేవుడు మనలను ప్రేరేపించి తన ఫలాలతో, వరాలతో నింపుతాడు. అలా నింపబడిన ఫలాల యొక్క ఉద్దేశమును శ్రీసభ ద్వారానే నెరవేర్చుతాయి.

క్రీస్తులో జ్ఞానస్నానం పొందిన ప్రతి వ్యక్తి, క్రీస్తు సహవాస జీవితానికి ఆయన ప్రేషిత కార్యాన్ని నెరవేర్చేందుకు పిలువబడి ఆత్మతో నింపబడతాడు. అందువలననే ఈ ప్రేషిత కార్యాం, కేవలం పీఠాధిపతులు, గురువులు, మఠవాసులే కాదు, క్రీస్తులో జ్ఞానస్నానం పొందిన ప్రతివ్యక్తి పని. కావున ఈ 2021-2023 లో జరిగే పీఠాధిపతుల సమాఖ్య సభలో శ్రీసభ మనుగడకు

అత్యవసరమైన సహవాస జీవితం అనేది ఒక ముఖ్యమైన అంశం. కాబట్టి శ్రీసభ ప్రేషిత కార్యంలో సహబాధ్యత కలిగి ఆయన చిత్తాన్ని నెరవేర్చాలి. ఆయన ఇచ్చిన ప్రేషిత కార్యం ఏమిటంటే, "...మీరు వెళ్ళి సకల జాతిజనులకు, పిత, పుత్ర, పవిత్రాత్మ నామమున జ్ఞానస్నానమును ఒసగుచూ, వారిని నా శిష్యులను చేయుడు" (మత్తయి 28:19) అని యేసు తన శిష్యులను ఆదేశించాడు. అందువలననే క్రీస్తులో జ్ఞానస్నానం పొంది, ఆయన శిష్యులుగా మారిన మనం తన ప్రేషిత కార్యములో సహబాధ్యతను నిర్వర్తించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ఈ ప్రేషిత కార్యం అనేక విధాలుగా నిర్వర్తించబడుతుంది. పీఠాధిపతులు, గురువులు, మఠవాసులు, గృహస్థ క్రైస్తవులు, వారి వారి దైవపిలుపు అంతస్తులకు తగిన విధంగా ఈ కార్యమును పరిపూర్తి చేయడానికి ఎంతగానో కృషి చేయాలి. ఏవిధంగానైతే క్రీస్తు తండ్రి కార్యాన్ని నెరవేర్చాడో మనం కూడా మన అనుదిన జీవితంలో సహబాధ్యత కలిగి క్రీస్తు చిత్తాన్ని నెరవేర్చి శ్రీసభ భవిష్యత్తుకు దోహదపడాలి. ఈ ఉమ్మడి ప్రేషిత కార్య నిర్వహణలో ఒకే ఆత్మతో, ఒకే మనస్సుతో, క్రీస్తు నందు ఉన్న ప్రేమ వలన ఎన్ని కష్టాలు ఎదురైనా ధైర్యముతో, ఆత్మ దేవుని సహాయంతో పరిపూర్తి చేయడానికి ప్రయత్నం చేసి, క్రీస్తు పలికిన విధంగా "తండ్రీ నేను నీ చిత్తాన్ని సంపూర్ణంగా నెరవేర్చాను," అని మనం కూడా క్రీస్తు ప్రభుకు సమాధానం చెప్పడానికి నీతియుక్తమైన జీవితం జీవిస్తూ క్రీస్తు ప్రభుని పరులకు పంచడానికి ప్రయత్నం చేయాలి.

## 4. శ్రీసభ: కలసి ప్రయాణించడం

మనలను ప్రేరేపించి నడిపించే ఒక ప్రాథమిక ప్రశ్న, "కలసి ప్రయాణించడం" అనేది స్థానిక శ్రీసభ నుండి విశ్వ శ్రీసభ వరకు ఎలా సాధ్యపడుతుంది? అలాగే ఒక ఉమ్మడి శ్రీసభగా కలిసి ప్రయాణించటంలో, ఎటువంటి నిర్ణయాలను తీసుకోవడానికి ఆత్మదేవుడు శ్రీసభను ఆహ్వానిస్తున్నారు? ఈ ప్రశ్నల గురించి ఆలోచించే ముందు, గాలి వలే వీచే పరిశుద్ధాత్మ దేవుని ఆలకించడం ఎంతో అవసరం. అందుకే యోహాను 3:8

"గాలి తనకు ఇష్టమైనటుల వీచును, నీవు దాని శబ్దమును విందువే కాని అది ఎక్కడనుండి వచ్చునో ఎక్కడికి పోవునో ఎరుగవు. ఆత్మ వలన జన్మించు ప్రతి వారును అట్లే ఉండును." కావున ఆత్మ దేవుని క్రియలను చవిచూడడానికి మనము ఆత్మతో నింపబడాలి. అప్పుడే ఈ సమైఖ్య ప్రయాణం ద్వారా శ్రీసభ ఆద్భుతాలను చవిచూడగలుగుతుంది. కాబట్టి ఇవన్ని కూడా నాణ్యమైన శ్రీసభ జీవితం యొక్క వాస్తవికలు.

ఆది నుండి ఆత్మదేవుడు ఏవిధంగా ఇస్రయేలు ప్రజలను ముందుకు నడిపించాడో ఒకసారి గుర్తుచేసుకోవడం ద్వారా, అదే ఆత్మదేవుడు ఈరోజు, శ్రీసభను ముందుకు నడిపిస్తూ తన ప్రేమకు సాక్షులుగా ఉండాడానికి పిలుస్తున్నారని విశదమవుతుంది. భాగస్వామ్యశ్రీసభ జీవితం ద్వారా శ్రీసభ భవితను కాపాడగలుగుతాం. ఈ 2023 సినడ్ అనేది ప్రజలను విశ్వాసంలో, ఉమ్మడి కుటుంబంగా నడుస్తూ నూతన యెరూషలేమును చేరడానికి దేవుడు శ్రీసభకు ఇచ్చిన ఒక గొప్ప వరం. అందువలననే మనం దేవుని దర్శించాలి అంటే అది కేవలం ఇతర విశ్వాసులతో (శ్రీసభ) కలిసి ప్రయాణించడం ద్వారానే సాధ్యమవుతుంది.

ప్రపంచ వినాశనకరమైన కోవిడ్-19 ఈ జగమంతా ఒకే కుటుంబం అని చక్కటి సందేశాన్నిచ్చింది. అందరు ఒకే పడవలో ఉన్నవారు, ఎప్పుడైతే ఇటువంటి భావన విశ్వాసుల హృదయాలలో కలుగుతుందో ఒకరి సమస్య అందరి సమస్యగా మారుతుంది. ఎవరు కూడా ఒంటరిగా రక్షింపబడరు, అందరూ కలసి రక్షింపబడతారు అనే సత్యాన్ని కూడా ఈ మహమ్మారి నేర్పించింది.

ఇదే ఆలోచన 2021-2023 సినడ్ లో తీసుకొని శ్రీసభలో ఉన్న ఒక విశ్వాస సమస్య అందరి సమస్యగా పరిగణిస్తూ, ఒంటరిగా ప్రయాణించడంలో ఎవరూ రక్షింపబడరు, అందరు ఉమ్మడి కుటుంబంగా ప్రయాణించడంలో రక్షణ ఇమిడి ఉందనే సత్యాన్ని పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారు స్పష్టముగా తెలియజేస్తున్నారు. కాని కలిసి ప్రయాణించడం అనేది ఒక సవాలు. ఆ సవాలును ఎదుర్కోవడంలోనే ఆత్మీయత, ప్రేమ, దయ, శాంతి, సమాధానం,

అనురాగం అనే పరిశుద్ధాత్మ ఫలాలు దాగి ఉన్నాయి. ఇందువలననే శ్రీసభను ప్రతిక్షణము నూత్నీకరించుకోటానికి ఆత్మదేవుని సహాయం ఎంతో అవసరం. శ్రీసభ భవిష్యత్తు కూడా ఎల్లప్పుడు ఆత్మదేవునితో సంభాషించడంలో ఇమిడి ఉంది. క్రీస్తు ప్రభుని ప్రేషిత కార్యాన్ని, శ్రీసభ భవిష్యత్తు ముందుకు కొనసాగించబడాలి అంటే సహవాసం, భాగస్వామ్యం ఎంతో అవసరం.

కావున శ్రీసభ కలిసి ప్రయాణించాలని తీసుకున్న ఈ నిర్ణయం మానవ మనుగడకు, శ్రీసభకు భవిష్య సూచికగా నిలుస్తుంది. ఎందుకంటే క్రీస్తు ప్రేషిత కార్యంలో ఉమ్మడి కుటుంబంగా ఆయన రాజ్య స్థాపనకై ముందుకు వెళ్ళే సామర్థ్యం శ్రీసభకు ఉంది. ఆ సామర్థ్యం కేవలం ఆత్మదేవుని ద్వారా పొందుకున్నది. కావున కలిసి ప్రయాణించే మనస్తత్వం ఉండాలంటే పరిశుద్ధాత్మ ప్రేరణకై మన హృదయాలను తెరిచి ఉంచాలి. అప్పుడే మనం క్రీస్తుకు సాక్షులుగా మారగలుగుతాము.

## 5. శ్రీసభ: ఒక రక్షణ ద్వారం

తండ్రియైన  దేవుడు తాను సృష్టించిన మానవుడు తనకు వ్యతిరేకంగా పాపము చేసి, దూరంగా వెళ్ళినప్పుడు అతని రక్షణ కొరకై అనేక ప్రణాళికలను రూపొందించాడు. అన్ని సమయాలలో తన ప్రేమను వ్యక్త పరుస్తూ, మానవుని రక్షించాలనే తపనతో ప్రవక్తలను, రాజులను, చివరకు తన ఏకైక కుమారుడైన క్రీస్తు ప్రభుని ఈ లోకానికి పంపి, ఆయన మరణ, పునరుత్థానాల ద్వారా మూసియున్న మోక్షద్వారాలను మానవ రక్షణ నిమిత్తమై తెరువ చిత్తగించారు. అలా క్రీస్తు ప్రభువు తండ్రి దేవుని రక్షణ కార్యాన్ని కొనసాగించాలని తాను పండ్రెండు మంది అపోస్తులులను ఎన్నుకొని శ్రీసభ రక్షణ కార్యాన్ని వారి నాయకత్వానికి అప్పగించారు. అలా క్రీస్తు ఎన్నుకొనిన అపోస్తులుల వేద సాక్ష్యం ద్వారా క్రీస్తును విశ్వసించిన వారందరూ, శ్రీసభలో సభ్యులుగా, ఇతరులకు రక్షణ  ద్వారంగా నిలుస్తున్నారు.

ఇంతకు ముందు మనం అర్థం చేసుకున్న విధంగా శ్రీసభ అనగా భవనాలు కాదు,'దేవుని ప్రజలు', మరి ఆ దేవుని ప్రజలు ఎంత వరకు వారి జీవితాలలో

క్రీస్తు గురించి తెలియనివారికి రక్షణ ద్వారంగా నిలుస్తున్నారో ఒక సారి ఆలోచించవలసిన అవసరం ఎంతగానో ఉంది. రక్షణ కార్యం అనేది తిరుసభలో ఉన్న పీఠాధిపతులు, గురువులు, మఠవాసుల బాధ్యత మాత్రమే కాదు అది క్రీస్తులో జ్ఞానస్నానము స్వీకరించిన అందరి బాధ్యత అని గుర్తెరిగి, ఆ బాధ్యతను ఎవరి అంతస్తుకు తగినట్లుగా వారు నిర్వర్తించగలిగితే ఇతరులకు రక్షణ ద్వారంగా నిలబడటం మాత్రమే కాక తిరుసభ భవితను కాపాడగలిగిన వారమౌతాము.

ద్వితీయ వాతికను మహాసభ ప్రారంభించిన పునీత 23వ జాన్ పాపుగారు, "శ్రీసభ కిటికీలు, తలుపులు తెరువండి, స్వచ్ఛమైన గాలిని లోపలికి రానివ్వండి," అన్నట్లుగా ఈ 2021-2023 సినడ్ కూడా అదే కొణానికి చెందినది. అనగా శ్రీసభలో పీఠాధిపతులు, గురువులు, మఠవాసులు, సకల కథోలిక విశ్వాసుల సమకాలీన క్రొత్త భావాలను, మంచిని ఆహ్వానించి ఉమ్మడి శ్రీసభగా నూత్నీకరించబడి ప్రపంచానికి రక్షణ ద్వారంగా కావాలన్నదే ఈ సినడ్ యొక్క ముఖ్య ఉద్దేశము. అలా శ్రీసభ నూత్నీకరణలో, భవిష్యత్తును నిర్ణయించడంలో, క్రీస్తు ప్రేషిత కార్యాన్ని ముందుకు తీసుకు వెళ్ళడంలో గృహస్థ క్రైస్తవ భాగస్వామ్యం ద్వారా శ్రీసభ తన పూర్వ వైభవాన్ని తిరిగి పొందే అవకాశం ఈ సినడ్ ద్వారా సాధ్యంమౌతుంది.

## ముగింపు

శ్రీసభ అంటే కేవలం ఒక సంస్థ లేదా భవనము కాదు. అది సాక్షాత్తు క్రీస్తు ప్రభుని పరమ శరీరం, క్రైస్తవ విశ్వాస భవితను నిర్ధారించేది. కాబట్టి ఈ సమైఖ్య సినడ్ 2021-2023 శ్రీసభ భవితకు బంగారు బాటలు వేస్తుందనే ఆశాభావాన్ని కలిగిస్తుంది. ఎందుకనగా గృహస్థ క్రైస్తవులందరితో కలిపి భాగస్వామ్య శ్రీసభగా ఇహలోక యాత్రను కొనసాగిస్తూ నూతన యెరూషలేమైన పరలోక రాజ్యాన్ని చేరుకోవాలని మనకు గుర్తుచేస్తుంది. కావున ప్రియ సహోదరీ సహోదరులారా ఈ భాగస్వామ్య శ్రీసభ భవిష్యత్తు నిర్మాణంలో ఎవరి వంతు కృషిని వారు నిర్వహిస్తూ దాని అభివృద్ధికి పాటుబడుతూ, క్రీస్తు రాజ్యాన్ని స్థాపించడానికి పరిశుద్ధాత్మ దేవుని ప్రేరణకై అహర్నిశలు శ్రమిద్దాం, ప్రార్థిద్దాం, కలిసి ప్రయాణిద్దాం, తద్వారా పరలోక రాజ్యాన్ని చేరుకొందాం.

# 8. సినడ్ శ్రీసభ సువార్త పరిచర్య

- బ్రదర్ బొమ్ము మత్తయి



## ఉపోద్ఘాతం

శ్రీసభను సాక్షాత్తూ పవిత్రాత్మ సర్వేశ్వరుడే నడిపిస్తున్నారని మనము విశ్వసిస్తున్నాము. శ్రీసభ సువార్త పరిచర్య ద్వారా మనము ఈ లోకంలో దేవుని తెలుసుకొని, ప్రేమించి, సేవించి అటువెనుక మోక్షం పొందుటకు మార్గచూపరి అవుతుంది. తల్లి శ్రీసభ సువార్త పరిచర్య ద్వారా తన చెంతకు తరలివచ్చిన వారినందరిని తన అక్కున చేర్చుకుంటుంది. అందుకే పునీత పౌలుగారు "సువార్తను బోధింపకున్నచో నా పరిస్థితి ఎంతో దారుణమగును" అని తెలియజేశారు (1 కొరింతీ 9:16). ద్వితీయ వాతికను సమావేశము ముగిసిన యేబది సంవత్సరములు పైబడి, దానికి సంబంధించిన అన్ని పత్రికలు ప్రచురింపబడిన పిమ్మట, శ్రీసభ సుదూర ప్రయాణము చేసినది. అనేక సంస్కరణలు, మార్పులు శ్రీసభ జీవనశైలిలో సంభవించినను, శ్రీసభ సువార్తా ప్రబోధ పరిచర్యయందు మాత్రము ఆశించినంతగా పురోగతిలేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లున్నది. కావున క్రీస్తుప్రభువు స్థాపించిన శ్రీసభను ప్రపంచ నలుమూలలా విస్తరింపచేయడానికి ఆయన సత్య సువార్త పరిమళములను నలుదెసల వ్యాపింపజేయడానికి పాపుగారు, మేత్రాణులు (పీఠాధిపతులు), గురువులు, ఉపగురవులు, మఠవాసులు, గృహస్థక్రైస్తవులు ఇంకా ఎంతగానో కృషిచేయాలి. జగద్గురువులైన ఫ్రాన్సిస్ పాపుగారు కోరిక ప్రకారం జ్ఞానస్నానం పొందిన ప్రతి ఒక్కరూ ఈ విశ్వశ్రీసభ పీఠాధిపతుల, గృహస్థక్రైస్తవుల ప్రతినిధులు సినడ్‌లో ఉత్సాహంగా పాల్గొని శ్రీసభ సభ్యులందరూ ఐక్యతతో దైవరాజ్య నిర్మాణానికి, వ్యాప్తికై పాటుపడాలి.

## శ్రీసభ దేవుని పరమ రహస్యం

"మానవులు అందరును రక్షింపబడవలయుననియు, సత్యమును తెలిసికొనవలయుననియు దేవుని అభిలాష. దేవుడు ఒక్కడే, దేవుని మనుజులను ఒకచోట చేర్చు మధ్యవర్తియు ఒక్కడే, ఆయనే మనుష్యుడైన క్రీస్తు యేసు" (1 తిమోతి 2:4-5). ఆయనయందు తప్ప వేరొకనియందు రక్షణ లభింపదు (అ.కా. 4:12). కనుక లోకంలోని మానవులందరు ప్రభు క్రీస్తును తెలుసుకోవాలి., ఆయనను అనుసరించాలి, జ్ఞానస్నానం ద్వారా ఆయన దివ్యదేహంలో (శ్రీసభలో) అంతర్భాగాలుగా మారాలి. స్వయంగా క్రీస్తు ప్రభువే ఈ సత్యాన్ని వెల్లడించారు. మానవులు రక్షణ పొందడానికి విశ్వాసం జ్ఞానస్నానం ఆవశ్యకమని చెప్పారు (మార్కు 16 :16, యోహాను 3:5). తద్వారా మానవ రక్షణ ప్రక్రియలో శ్రీసభకుగల ప్రాధాన్యతను కూడా వ్యక్తం చేశారు. మరో మాటలో చెప్పాలంటే శ్రీసభలోచేరడానికి జ్ఞానస్నానం ప్రవేశ ద్వారం వంటిది. ఈ కారణం చేతనే శ్రీసభను సాక్షాత్తూ తండ్రి దేవుడు క్రీస్తు ప్రభువు ద్వారా స్థాపించారనీ తెలియపరచబడినది.

పునీత పౌలుగారు శ్రీసభ ముఖ చిత్రాన్ని కొన్ని పోలికలతో విశదీకరించారు. శ్రీసభ అంటే దేవుని ప్రజ, క్రీస్తు శరీరము, దేవుని ఆలయం, నగరం, భవనం, ద్రాక్షతోట అనే పలురకాల పోలికలతో శ్రీసభ రూప దర్శనాన్ని వివరించారు. "శ్రీసభ అంటే దైవజనం" "దైవ సమూహం" అని ద్వితీయ వాతికను మహాసభ ఘంతాపథంగా నొక్కి చెప్పింది. అదే విధంగా శ్రీసభ అంటే వంశానుగత లేదా క్రమానుగత పారంపర్యం అధికారం మాత్రం కాదని, దైవ జనులు అందరు క్రీస్తు ప్రేషిత కార్యములో భాగస్తులని, శ్రీసభ ప్రేషిత కార్యం అనేది దైవవాక్కు పరిచర్య, దివ్య సంస్కారాలను ఆచరించుట, నెరవేర్చుట, సువార్తకు వ్యక్తిగతంగా సాక్ష్యమిచ్చుట, అవసరతలో ఉన్న వారికి సహాయం అందించుట మొదలైన వాటిలో ఇమిడి ఉన్నది.

శ్రీసభ అంటే కేవలం ఒక సంస్థ లేదా ఒక వ్యవస్థ మాత్రమే కాదు, దేవుని పరమ రహస్యం, దివ్యసంస్కారం కూడా. ఈ పరమ రహస్యంలో పాలుపంచుకునే వారందరూ దైవజనంగా భాసిల్లుతారు. శ్రీసభ అంటే ఒక

ఐక్యతా సహవాస దివ్యసంస్కారం. అనగా విశ్వాసుల మధ్య ఐక్యతతో కూడిన సహవాస జీవన సంస్కారమే శ్రీసభ అని అర్థం. క్రీస్తు ద్వారా పవిత్రాత్మ యందు దైవత్వంలో పాలుపంచుకొనడమే సహవాస సాంగత్యం. సభ్యులందరు పవిత్రాత్మ సహవాసంలో భాగం పంచుకుంటారు. జ్ఞానస్నానం ద్వారా త్రియేక సర్వేశ్వరుని సహవాసంలో ఐక్యతనొందుతారు. ఈ ఐక్యతానుబంధ జీవనం దివ్య సత్ప్రసాదం వలన శక్తినొంది బలపడుతుంది. శ్రీసభ రూప నిర్మాణంలో సభ్యులందరు సమాన హోదా, సమాన గౌరవం కలిగి ఉంటారు.

## సువార్త ప్రబోధం-దైవజన సంఘ నిర్మాణం

దైవ కుమారుడు క్రీస్తు ప్రభువు తన ప్రజలను పాపపు బంధాల నుండి విముక్తులను చేయడానికి, తద్వారా మానవులందరినీ శుద్ధీకరించడానికి ఈ లోకానికి వచ్చారు. తండ్రి దేవుడు తనను పంపినట్లే, తానూ తన అపోస్తులులను ప్రపంచ నలుమూలలకు పంపారు. అంతకు మునుపే ఆయన తన పవిత్రాత్మను అనుగ్రహించడం ద్వారా వారిని పవిత్ర పరిచారు, పాప విముక్తులను చేశారు. తాను తన తండ్రి దేవుని మహిమ పరచునట్లు, వారు కూడా ఈ లోకంలో తండ్రిని మహిమ పరుస్తూ సాటి మానవులకు రక్షణ వరాన్ని ప్రసాదిస్తూ "క్రీస్తు దివ్య దేహ (దైవ ప్రజా సంఘు) నిర్మాణానికి కృషిచేయుటకు" (ఎఫెసీ 4:12) ప్రభువు అపోస్తులులను ఎన్నుకున్నారు. వారిని నలుదిక్కులకు పంపించారు. అలా అపోస్తులుల ద్వారా ప్రభు క్రీస్తు నిర్మించిన దైవప్రజా సంఘుమే-శ్రీసభ. దీనిని బట్టి సువార్తా ప్రబోధం చేయడం శ్రీసభ ప్రధాన ధర్మమన్న సత్యం స్పష్టమవుతుంది. మానవులకు రక్షణ సందేశమును ప్రకటించడం, వారిని ప్రభు విశ్వాసులుగా తీర్చిదిద్దడం శ్రీసభ కర్తవ్యం. ప్రధానంగా రెండు కారణాల వలన సువార్తా ప్రబోధం శ్రీసభ కర్తవ్యమవుతుంది: క్రీస్తు ప్రభువిచ్చిన ఆదేశం ఒక కారణం కాగా, ప్రభువు అనుగ్రహించే సజీవం మరో కారణం.

క్రీస్తు ప్రభువు అపోస్తులులకిచ్చిన ఆదేశం ప్రకారం శ్రీసభ యావత్తూ సువార్తా బోధక సంఘుమవుతుంది. నాడు క్రీస్తు ప్రభువు అపోస్తులులకిచ్చిన ఆదేశాన్నే అపోస్తులుల వారసులైన పీఠాధిపతులు నేటికి తలదాల్చుతూ వస్తున్నారు. ప్రభు ఆజ్ఞాపాలనంలో గురువులు-పీఠాధిపతులకు సహకారులుగా

సేవలందిస్తుంటే, విశ్వశ్రీసభ అధినాయకులైన జగద్గురువుల మార్గనిర్దేశం ప్రకారం పీఠాధిపతులు సువార్తా ప్రబోధ ధర్మాన్ని నిర్వర్తిస్తున్నారు. శ్రీసభ క్రీస్తు ప్రభువు తనకు అప్పగించిన బాధ్యతలను ఆదర్శ జీవనం ద్వారా, సత్యసువార్త ప్రబోధం ద్వారా, దివ్య సంస్కారాల ద్వారా, ఇతర దైవానుగ్రహ (కృపావర) సాదక మార్గాల ద్వారా నిర్వర్తిస్తూ వస్తుంది. అవును. ప్రభు క్రీస్తు ఆదేశానికి విధేయిస్తూ, పవిత్రాత్మ సహకారంతోను ప్రేమ స్పూర్తితోను శ్రీసభ ప్రపంచ ప్రజల మధ్యకు వెళ్తోంది, ప్రభు అనుగ్రహించే విశ్వాస వరాన్ని ఆంతరంగిక స్వేచ్ఛను శాంతి సమాధానాలను సకల జాతి జనులకు పంచిపెడుతోంది. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రభు క్రీస్తు మరణ పునరుత్థాన మహద్భాగ్యంలో సంపూర్ణ భాగస్వామ్యాన్ని పొందే సువర్ణావకాశాన్ని సువార్తా ప్రబోధం ద్వారా శ్రీసభ మానవులందరికి కల్పిస్తోంది.

నిజానికి సువార్తా ప్రబోధం ద్వారానే ప్రభు క్రీస్తు దివ్యమైన శ్రీసభ బలోపేతమవుతుంది, సమగ్ర వికాసాన్ని పొందగలుగుతుంది (ఎఫెసీ 4:11-16). కనుకనే శ్రీసభ సభ్యులైన విశ్వాసులందరు దేవుని పట్ల తమకు గల ప్రేమకొద్దీ (తమ తమ పరిధులలో) సువార్తా ప్రబోధం చేయడానికి కృషిచేయాలి, ఇహ పరలోకాలలో జీవన సార్థకతను ఒనగూర్చే ఆధ్యాత్మిక సిరులను సాటి మానవులందరితోనూ పంచుకోడానికి సిద్ధపడాలి. ఈ విధంగా సువార్తా ప్రబోధం ద్వారా దైవ జన సంఘం నిర్మింపబడుతుంది.

## శ్రీసభ సువార్త పరిచర్యలో పీఠాధిపతుల బాధ్యత

లోకంలోని సమస్త జాతిజనులకు సువార్తను బోధించే బాధ్యత ప్రధానంగా అపోస్తలుల వారసులైన పీఠాధిపతులపై ఉంది. పీఠాధిపతులు కేవలం ఒక్క గురుపీఠానికి చెందినవారు కారు, వీరు యావత్ విశ్వ శ్రీసభకు చెందినవారు. పీఠాధిపతిగా పట్టాభిషేకము పొందిన వీరు జగద్గురువుల నేతృత్వంలోని ప్రపంచ పీఠాధిపతుల మహా సమాఖ్యలో సభ్యులవుతారు, తద్వారా అపోస్తలులకు వారసులవుతారు. ఈ అపోస్తోలిక వారసత్వమే వీరికి ప్రపంచములోని సకలజాతి జనుల రక్షణ బాధ్యతను అప్పగిస్తుంది. “మీరు ప్రపంచమందంతట తిరిగి,

సకల జాతి జనులకు సువార్తను బోధింపుడు" (మార్కు 16:15) అంటూ క్రీస్తు ప్రభువిచ్చిన ఆదేశం ప్రధానంగా పేతురు వారసులైన జగద్గురువులతో పాటు పీఠాధిపతులందరికి వర్తిస్తుంది. పీఠాధిపతులు నిర్వహించవలసిన ప్రధానమైన బాధ్యతల్లో సువార్తా ప్రబోధం అత్యంత ప్రధానమైనది. ఎందుకంటే విశ్వాస సత్యాలను ఎలుగెత్తి చాటుతూ, ప్రజలను ప్రభు శిష్యులుగా మలచ వలసిన బాధ్యత ప్రధానంగా పీఠాధిపతులదే. ఎందుకంటే శ్రీసభలో సాధికార సువార్తా బోధకులు పీఠాధిపతులే, ప్రభు క్రీస్తు అనుగ్రహించిన అధికారం వారి చేతుల్లోనే ఉంది. ఆ దివ్యాధికారంతోనే వారు తమకు అప్పగించబడిన దైవజనులకు విశ్వాస ప్రబోధం చేస్తారు, వారి విశ్వాసాన్ని పటిష్ఠపరుస్తారు.

పవిత్రాత్మ ప్రసాదించే జ్ఞాన కాంతిలో పీఠాధిపతులు తమ విశ్వాసాన్ని ప్రకాశింపజేస్తారు. ప్రభువు ఆవిష్కరించిన వేద సత్యాల భాండాగారం నుండి పురాతన అధునాతన సత్యసంపదను వెలికి తీసి ప్రజల ఎదుట ఆవిష్కరిస్తారు (మత్తయి 13:52). ప్రజల విశ్వాసాన్ని ఫలప్రదం చేస్తారు, ప్రభువు తమకు అప్పగించిన దైవ జనులలో ఏ ఒక్కరు సత్యమార్గాన్ని వీడి భ్రష్టులు కాకుండా వేయి కళ్ళతో కనిపెట్టుకొని ఉంటారు (2 తిమోతి 4:14). శ్రీసభ అగ్రనేత జగద్గురువులతో సంఘీభావం కలిగి ఆయన ఆదేశాలకు అనుగుణంగా సత్య ప్రబోధం చేసే పీఠాధిపతులను విశ్వాసులంతా "సత్య సాక్షులుగా" గౌరవించాలి, దివ్య సత్యాలకు సార్వత్రిక సత్యలకు వారు సజీవ సాక్షులని తెలుసుకోవాలి.

పీఠాధిపతులు తాము చేసే ప్రార్థనల ద్వారా, నిర్విరామంగా కొనసాగించే వేద బోధన కార్యక్రమాల ద్వారా క్రీస్తు ప్రభువులో మూర్తీభవించిన పావనత్వం నుండి వెల్లువలై ప్రవహించే కృపావరాలను తరతమ బేధాలుగాని పరిమితులుగానీ లేకుండా తమ పాలనలోగల విశ్వాసులందరికీ ధారాళంగా పంచిపెడుతూ ఉంటారు. సువార్తా ప్రబోధం ద్వారా సత్యవేదాన్ని విపులీకరించి చెబుతూ విశ్వాసులకు దివ్యశక్తిని ఆత్మచేతనను దైవానుగ్రహాలను ప్రసాదిస్తారు, వారు ముక్తిభాగ్యాన్ని పొందడానికి సత్యమార్గాన్ని చూపుతారు (రోమీ 1:16). దివ్య సంస్కారాలను నియమనిష్టలతో ఆచరింపజేయడం ద్వారా విశ్వాసులను శుద్ధీకరిస్తారు, పీఠాధిపతులుగా తమకుగల ప్రత్యేకాధికారంతో దివ్యసంస్కారాల

ఆచరణ విధానాన్ని క్రమబద్ధీకరిస్తారు.

క్రీస్తు ప్రతినిధులుగా, క్రీస్తు పంపిన ప్రత్యేక దూతలుగా పీఠాధిపతులు స్థానిక శ్రీసభలను సాధికారికంగా పరిపాలిస్తూ ఉంటారు. కేవలం కథోలిక సంఘంలో, తన ఆధీనంలో ఉన్న "చిరు మందలో" సభ్యులైన విశ్వాసుల విమోచనకు వికాసానికే కాకుండా, తమ తమ ప్రాంతాలలో ఉన్న కథోలికేతర ప్రజలందరినీ ప్రభువు తమకు అప్పగించిన ప్రజలుగా భావించి, సర్వజన సంక్షేమ లక్ష్యంతో పీఠాధిపతులు తమ సేవా కార్యక్రమాలకు రూపకల్పన చేయాలి, విశాల హృదయంతో ఔదార్యంతో వ్యవహరించాలి. అంతే కాదు పునీత పౌలుగారి మాదిరి పీఠాధిపతులలో ప్రతి ఒక్కరు తాను సాటి మానవులందరి సముద్ధరణకు బద్ధుడై ఉన్నాడని గుర్తించాలి, ఆమేరకు తమ ప్రాంతంలోగల ప్రజలందరికీ సువార్తా ప్రబోధం చేయడానికి చిత్తశుద్ధితో కృషిచేయాలి (రోమీ 1:14-15). తన నేతృత్వంలోని కథోలిక సత్యవేదాన్ని సర్వజనులకు బోధించే ఏర్పాట్లు చేయాలి.

చివరిగా పీఠాధిపతులు వ్యక్తిగతంగా ఆదర్శ జీవనం గడుపుతూ సాటి విశ్వాసులకు మార్గదర్శులుగా నిలవాలి. ఆదర్శ జీవనం ద్వారా వారికి లభించే నైతికాధికారంతో ప్రజలను ప్రభావితులను చేయాలి. వారి ఆధ్యాత్మిక జీవనాన్ని క్రమబద్ధం చేయాలి. అందుకుగాను పీఠాధిపతులు వ్యక్తిగతంగా దుష్కార్యాలకు దూరంగా ఉండాలి. ప్రభు క్రీస్తు కృపావర సహాయంతో తమలో ఉన్న లోటుపాటులను సరిదిద్దుకోవాలి. తమ వ్యక్తిత్వానికి వన్నెతెచ్చుకోవాలి. తద్వారా పీఠాధిపతులు తమ నేతృత్వములోగల విశ్వాసులతో కలిసి నిత్య జీవావరణం లోనికి ప్రవేశించే యోగ్యతను పొందగలుగుతారు, ముక్తి భాగ్యాన్ని అందుకోగలుగుతారు.

## శ్రీసభ సువార్త పరిచర్యలో గురువుల బాధ్యతలు

గురువులు సాక్షాత్తూ క్రీస్తు ప్రభువుకు ప్రతినిధులు. ప్రభు క్రీస్తు త్రివిధ ధర్మాల (యాజక ధర్మం, ప్రవచన ధర్మం, పాలనా ధర్మం) నిర్వహణలో గురవులు పీఠాధిపతులకు సహకారులు. ఈ త్రివిధ ధర్మాల నిర్వహణ ద్వారానే వారు శ్రీసభ కొనసాగించే లోక రక్షణ ఉద్యమంలో భాగస్వాములు కాగలుగుతారు.

నిజానికి తాము గురుపట్టాభిషేకము పొందినది ప్రధానంగా వేద ప్రబోధం కోసమేనన్న సత్యాన్ని గురువులు గుర్తుంచుకోవాలి. దైవ ప్రజలందరినీ ఒక్కటిగా నిలిపే మొట్టమొదటి ఏకతా సూత్రం దేవుని జీవవాక్కు. దేవుని వాక్కును తరచుగా గురువు నోట వినాలని దైవ ప్రజలు కోరుకుంటారు. పీఠాధిపతులకు సహకారులైన గురువుల ప్రథమ కర్తవ్యం మానవులందరికీ సువార్తను బోధించడం. తద్వారా వారు "మీరు ప్రపంచమందంతట తిరిగి, సకల జాతి జనులకు సువార్తను బోధింపుడు" (మార్కు 16:15) అంటూ ప్రభువిచ్చిన ఆదేశాన్ని పాటించిన వారవుతారు. దైవజన సంఘాన్ని విస్తరింపజేసిన వారవుతారు. రక్షణ ప్రదమైన దైవవాక్కు అవిశ్వాసుల్లో విశ్వాసాన్ని అంకురింపజేస్తుంది. విశ్వాసుల హృదయాల్లో ఉన్న విశ్వాసపు మొలకలను దినదిన ప్రవర్ధమానంగావిస్తుంది. ఈ విశ్వాసం ద్వారానే విశ్వాసుల సంఘం ఆరంభమవుతుంది. ఆ విధంగా అపోస్తలులు (పౌలుగారు) పలికిన మాటలు అక్షరాల నిజమౌతాయి. "వినుట వలన విశ్వాసలము కలుగును, వినుట క్రీస్తును గూర్చిన వాక్కు వలన కలుగును" (రోమీ 10:17).

గురువులు సత్య సువార్తను తమ సాటి ప్రజలందరితో పంచుకోవడం (సువార్తా ప్రబోధం చేయడం) తమ కర్తవ్యంగా భావించాలి. తద్వారా వారు ప్రభు సన్నిధానంలో ఆనందానుభవాన్ని పొందగలుగుతారు. గురువులు తమ సాధారణ సంభాషణలద్వారా అన్యజనులకు (క్రైస్తవేతరులకు) సువార్తా సందేశాలను వినిపించినపుడు కూడా వారు దేవుని మహిమ పరచడానికి అవకాశం కల్పించినవారవుతారు. అలాగే బహిరంగ సువార్తా ప్రబోధం ద్వారా గురువులు అవిశ్వాసులకు క్రీస్తు నిగూఢ తత్వ మహత్వాలను ప్రకటించినపుడు గానీ, లేదా క్రైస్తవ సందేశాన్ని శ్రీసభ సిద్ధాంతాలను(విశ్వాస సత్యాలను) బోధించినపుడుగానీ, లేదా సమకాలీన సమస్యలకు క్రీస్తు సందేశాలకనుగుణమైన పరిష్కారాలను కనుగొనే ప్రయత్నాలు చేసినపుడుగానీ (సువార్తా స్ఫూర్తితో సమస్యలను పరిష్కరించినపుడుగానీ) ఆయా సందర్భాలన్నింటా జరిగేది సువార్తా ప్రకటనయే, దైవవాక్కు ప్రబోధమే. గురువుల బాధ్యత దైవవాక్కును ప్రకటించడమే తప్ప, స్వీయ జ్ఞానాన్ని ప్రదర్శించడం కాదు. అలాగే సువార్తా ప్రబోధం ద్వారా మనోపరివర్తనం చెంది పవిత్ర జీవనం గడుపుమని ప్రజలను

ఉద్బోధించడం, వారికి రక్షణాహ్వానాన్నందించడం గురువుల బాధ్యతల్లో అంతర్భాగం.

సువార్తా ప్రబోధం చేయడమే కష్టతరమవుతోన్న సమకాలీన పరిస్థితుల్లో గురువులు తమకు లభించిన బోధనావకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. తమ ప్రబోధాలు ప్రజలను ప్రభావితుల్ని చేయాలంటే, శ్రోతల హృదయాలను కదిలించాలంటే దైవవాక్కును పైపైన వివరించడమో, శ్రోతలకు కొరుకుడుపడని భాష్యాలు చెప్పడమూ చేయరాదు. సువార్తా గ్రంథములోని నిత్యసత్యాలను ప్రజల దైనందిన జీవితాలకు జీవన సమస్యలకు అన్వయిస్తూ అర్థవంతంగా బోధించాలి. క్రైస్తవులు కాని వారు అధికంగా ఉన్న ప్రాంతాలలో బహిరంగ సువార్తా ప్రకటన ద్వారా, దివ్య సంస్కారాల ఆచరణ ద్వారా అనేక మంది క్రైస్తవ విశ్వాసాన్ని స్వీకరిస్తున్నారు. క్రైస్తవ సంఘాలలో విశ్వాస సత్యాలకు సత్య ప్రబోధాలకు సిసలైన అర్థాలు తెలియని వారికీ, విశ్వాస విషయంలో దుర్బలులైన వారికీ సువార్తా ప్రబోధం (దైవవాక్కు పరిచర్య) తప్పక జరగాలి. అప్పుడే వారు దివ్యసంస్కారాలను అర్థవంతంగా ఆచరించగలుగుతారు. ఎందుకంటే దివ్యసంస్కారాలన్నీ విశ్వాస ప్రధానమైనవి. దివ్యసంస్కారాలన్నింటి మూలమూ బలమూ దైవవాక్కులోనే దాగి ఉంటాయి. అదే విధంగా విశ్వవిద్యాలయాలలోనూ, గురువిద్యాలయాలలోనూ విద్యాబోధన చేసే గురువులు ప్రాపంచిక స్థితిగతుల గురించి, శ్రీసభ నిర్వర్తించే సువార్తా ప్రబోధ ఉద్యమం గురించీ విద్యార్థులకు వివరిస్తూ వారిలో సువార్తా ప్రచార దీక్షను పెంపొందించాలి. ఈ విధంగా గురువులు శ్రీసభ సువార్త పరిచర్యలో తమ బాధ్యతలను నిర్వహించగలరు.

## శ్రీసభ సువార్త పరిచర్యలో సామన్య క్రైస్తవుల బాధ్యతలు

శ్రీసభలో సామాన్య గృహస్థ క్రైస్తవుల ముఖ్యమైన వారు అని చెప్పేందుకు కారణం, విశ్వాసులు లేకుండా శ్రీసభ ఉనికే లేదు. సంఘమే లేకుంటే సంఘ పరిచర్యకు అర్థమే లేదు. కేవలం దేవుని వాక్కు బోధించడం వలన క్రమానుగత నిర్మాణం పాపుగారు, పీఠాధిపతులు, గురువులు, మఠవాసులు, గుడులు, గోపురాలు, విచారణ నిర్మాణాలు, దివ్య సంస్కారాలు తదితర మతకర్మల

నిర్వహణ మాత్రమే శ్రీసభ ఉనికికి అద్దం పట్టలేవు. ఇవన్నీ చాలా ముఖ్యమైనవే. కాని విశ్వాసాన్ని పాటించి ప్రకటించే విశ్వాసుల సంఘం లేదా సభ్యులే లేకుంటే ఎన్ని ఉన్నా వ్యర్థమే. కనుక విశ్వాసాన్ని ప్రకటించే సభ్యుల ద్వారానే శ్రీసభ ఉనికి ప్రస్ఫుటమౌతుంది. ద్వితీయ వాతికను మహాసభ ముఖ్యంగా శ్రీసభలోనూ, ప్రపంచములోనూ సామాన్య గృహస్థుల పాత్రను, వారి గుర్తింపు, శిక్షణ, భాగస్వామ్యం, ప్రేషిత కార్యాలను ఎత్తిపట్టింది. వాటిని నాలుగు అంశాలుగా క్లుప్తంగా చెప్పవచ్చు: (1) శ్రీసభలో క్రీస్తు విలువలతో కూడిన జీవితం (2) క్రైస్తవులందరి మధ్య మౌళిక సమానత్వం (3) శ్రీసభలోనూ, బయటి సమాజంలోనూ సామాన్య గృహస్థ విశ్వాసుల బాధ్యత (4) సామాన్య క్రైస్తవులు ప్రేషిత కార్యాల్లో – సేవల్లో గురువులతో కలిసి పనిచేయడం. ఈ నాలుగు అంశాలను స్థూలంగా రెండు మాటల్లో చెప్పాలంటే, సామాన్య క్రైస్తవుల "పిలుపు – సేవాధర్మం" అని చెప్పవచ్చు. శ్రీసభ తొలిదశ నుండి సామాన్య క్రైస్తవులు ఎంత స్వచ్ఛందంగా, ఎంత చైతన్యవంతంగా, క్రైస్తవ సంఘాలలో ఎంతటి ప్రధాన పాత్రను వహించారో, ఎంతటి ఫలప్రదమైన సేవలనందించారో పవిత్ర గ్రంథం స్పష్టంగా చెబుతోంది (అ.కా. 11:19–21, 18:26; రోమీ 16:1–16; ఫిలిప్పీ 4:3). తొలిదశలో మాదిరి ఇప్పుడు కూడా సామాన్య క్రైస్తవులు శ్రీసభలో చైతన్యవంతమైన పాత్ర వహించాలి. పవిత్రాత్మ సర్వేశ్వరుడు నేడు ప్రపంచ వ్యాప్తంగా అనేకమంది సామాన్య క్రైస్తవులను ప్రేరేపిస్తున్నారు, శ్రీసభలో తమకుగల బాధ్యతలను గుర్తుచేస్తున్నారు, ప్రభు క్రీస్తు సేవకూ ప్రభు జన సంఘు (శ్రీసభ) సేవకూ అంకితం కమ్మని ఆహ్వానిస్తున్నారు, ప్రోత్సహిస్తున్నారు.

సమాన్య క్రైస్తవులు సాక్షాత్తూ ప్రభు క్రీస్తుకు స్వంతమైన యాజక ధర్మాన్ని, ప్రవచన ధర్మాన్ని, పాలక ధర్మాన్ని పంచుకోగలుగుతున్నారు. ఈ త్రివిధ ధర్మాల కారణంగానే సామాన్య క్రైస్తవులకు ఇటు శ్రీసభలోను అటు ప్రపంచంలోను ప్రభు నిర్దిష్టమైన బాధ్యతలను అప్పగిస్తున్నారు. శ్రీసభ (దైవ ప్రజలు) నిర్వర్తించే లోక రక్షణ ధర్మములో వారు క్రియాశీలకమైన పాత్ర వహించగలుగుతున్నారు. వారు సువార్తా ప్రబోధం చేస్తూ, సాటి మానవుల శుద్ధీకరణకు తోడ్పడటం ద్వారా, సువార్తా విలువలతో లౌకిక వ్యవహారాలను సంస్కరించడం ద్వారా, ప్రభు క్రీస్తుకు సాక్షులుగా జీవిస్తూనే, తమ లౌకిక బాధ్యతలను సక్రమంగా

నిర్వర్తించడం ద్వారా, అలాగే సాటివారికి రక్షణ మార్గం చూపడం ద్వారా సామాన్య క్రైస్తవులు తమ అపోస్తోలిక ధర్మాలను సంపూర్ణంగా ఫలప్రదంగా నెరవేర్చగలుగుతారు.

సామాన్య క్రైస్తవుల ప్రత్యేకత ఏమిటంటే వారు ప్రధానంగా లౌకిక జీవులు. వారు లౌకిక వ్యవస్థలో అంతర్భాగాలుగా జీవిస్తుంటారు, నిత్యమూ సంసారిక (ప్రాపంచిక) బాధ్యతలతో తలమునకలవుతూ ఉంటారు. అలా వారు లౌకిక ప్రపంచములో జీవిస్తూనే తమ అపోస్తోలిక ధర్మాలను నిర్వర్తించాలన్నది దేవుని సంకల్పం. తదనుగుణంగా సామాన్య క్రైస్తవులు "పిండిలో పులుపు" మాదిరి తమ క్రైస్తవ స్ఫూర్తితో ప్రపంచాన్ని (లౌకిక సమాజాన్ని) ప్రభావితం చేయగలగాలి.

సాటి మానవులకు సువార్తా ప్రబోధం చేయడానికి, వారిని పవిత్రీకరణ మార్గంలో నడిపించడానికి సామాన్య క్రైస్తవులకు అనేక అవకాశాలుంటాయి. ప్రభు క్రీస్తుకు సాక్షులుగా వారు గడిపే ఆదర్శ జీవనం, పారలౌకిక విలువలతో వారు చేసే పనిపాటులు వృత్తి ధర్మాలు ఇవన్నీ సాటివారి హృదయావరణాలలో సువార్తా బీజాలను వెదజల్లుతాయి, వారిని దైవసాన్నిధ్యానికి నడిపిస్తాయి. యేసు ప్రభువిచ్చిన ఆదేశం కూడా ఇదే: "ప్రజలు మీ సత్కార్యములను చూచి పరలోకమందున్న మీ తండ్రిని సన్నుతించుటకు వెలుగును వారి ఎదుట ప్రకాశింపనిండు" (మత్తయి 5:16).

సామాన్య క్రైస్తవ విశ్వాసుల మధ్య గురువులు సేవాభావం గల నాయకులుగా వారికి నేతృత్వం వహించాలి. అలాగే శ్రీసభలో సామాన్య క్రైస్తవులకు గల గౌరవనీయమైన స్థానాన్ని గురువులు గుర్తించి, ఆత్మగౌరవంగల వ్యక్తులుగా వారిని ఆదరించాలి, శ్రీసభ (లోక రక్షణ) ధర్మ నిర్వహణలో సామాన్య క్రైస్తవులకు గల ప్రత్యేకమైన పాత్రను గుర్తెరిగి, అందుకు వారిని చిత్తశుద్ధితో ప్రోత్సహించాలి. అదేవిధంగా, సమాజంలో పౌరులుగా, సామాన్య క్రైస్తవులకు గల న్యాయమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను గురువులు తప్పక గౌరవించాలి. వారు చెప్పుకునే కష్టసుఖాలను శ్రద్ధగా ఆలకించాలి, సోదరభావంతో వారి మనవులను మన్నించాలి, లౌకిక జీవన రంగంలో వారికి గల అనుభవాన్ని సామర్థ్యాన్ని గుర్తించాలి, ప్రోత్సహించాలి.

అదేవిధంగా, గురువులకు సామాన్య క్రైస్తవులకు శక్తి సామర్థ్యాల మీద నమ్మకముండాలి. శ్రీసభ సేవా రంగంలో తగిన బాధ్యతలను అప్పగించాలి. అలాగే తమకు అప్పగించిన బాధ్యతలను నెరవేర్చడంలో వారికి పూర్తి స్వేచ్ఛనివ్వాలి. అంతే కాదు అవకాశాలున్నచోట సామాన్య క్రైస్తవులు తమంతట తాము సత్ సంకల్పంతో సేవా కార్యక్రమాలను చేపట్టి, స్వతంత్రంగా నిర్వహించుకోవడానికి గురువులు సహృద్భావంతో తమ సహకారాన్ని అందజేయాలి.

సామాన్య క్రైస్తవులు కేవలం ప్రభు సాక్షులుగా జీవించడమే కాకుండా సువార్తా ప్రబోధానికి గల ప్రతి అవకాశాన్ని వారు సద్వినియోగం చేసుకోవాలి. అంటే క్రైస్తవేతరులకు సువార్తా ప్రబోధం చేస్తూ వారిని ప్రభు క్రీస్తు విశ్వాసులుగా తీర్చిదిద్దడానికీ, సాటి క్రైస్తవ విశ్వాసులకు పునఃసువార్తా ప్రబోధం చేస్తూ వారి విశ్వాసాన్ని పటిష్ట పరచి వారిలో నవ చైతన్యాన్ని వికసింపచేయడానికి గల సదవకాశాలన్నింటినీ సామాన్య క్రైస్తవులు సద్వినియోగం చేసుకోవాలి. "ప్రభు క్రీస్తు ప్రేమ ప్రభావం" తో వారు సువార్తా ప్రబోధానికి పూనుకోవాలి (2 కొరింతీ 5:14). "సువార్తను బోధింపకున్నచో నా పరిస్థితి ఎంతో దారుణమగును" (1 కొరింతీ 9:16) అంటూ పునీత పౌలుగారు పలికిన మాటలు సామాన్య క్రైస్తవుల హృదయాలలో నిత్యమూ ప్రతిధ్వనిస్తూ ఉండాలి. సాధారణ విశ్వాసులమైన మనందరము క్రీస్తు అనబడే జీవ వృక్షమునకు కాచిన ఫలములువంటి వారము. ఆ క్రీస్తు సుగంధ ఫలములను పరులకు ఆశీర్వాదముగా ఉండునట్లు జీవించే బాధ్యత మన అందరిపై ఉన్నది. క్రీస్తు గురుత్వములో, ఆయన శరీరములో అవయవములవలే ఉన్న మనందరికి ఉన్న బాధ్యత ఏమనగా, శిరస్సుయైన క్రీస్తు చెప్పినట్లు చేయడమే. నేటి సినడల్ శ్రీసభ, సువార్త వ్యాప్తి అనే ప్రేషిత కార్యములో నీవు, నేను కూడా భాగస్తులుగా ఉంటూ, పాపుగారు, పీఠాధిపతులు, గురువులు, ఉపగురువులు, మఠవాసులు అందరితో సరిసమానంగా క్రీస్తు సువార్తను సర్వజాతి జనులకు అందించే మహోన్నత కార్యమునకు ఆహ్వానమే నేటి సినడల్ శ్రీసభ.

## ముగింపు

క్రీస్తు సువార్తా సందేశమే పరమ ప్రమాణంగా, సువార్తా విలువలే జీవన విలువలుగా పుణ్య జీవనం గడిపే క్రైస్తవ విశ్వాసులందరు కూడా సువార్తా ప్రబోధం తమ బాధ్యతగా గుర్తించాలి. క్రీస్తు సువార్తను ప్రపంచ నలుమూలల ప్రకటించడం, అందరిని క్రీస్తు వైపుకు మరల్చడం మనందరి కర్తవ్యం. అదేవిధంగా, ఈ సినడ్ యొక్క ముఖ్య ఉద్దేశం కూడా ఏ ఒక్కరిని విడిచిపెట్ట కుండా, అందరిని కలుపుకొని, అధికులు-అల్పులు, ధనికులు-పేదలు, హెచ్చు-తగ్గులు, కుల, మత, వర్గ, వర్ణ తారతమ్యం లేకుండా అందరు ఒకరినొకరు గౌరవించుకుంటూ, అభిప్రాయాలను పంచుకుంటూ, ఒకరి నుండి మరొకరు నేర్చుకుంటూ, అభినందించుకుంటూ, సహవాసం, భాగస్వామ్యం, ప్రేషితకార్యాల ద్వారా విశ్వాస జీవన ప్రయాణంలో ముందుకు నడవాలి. కలసి ప్రయాణించడం, కలసి ప్రార్థించడం, కలసి పనిచేయడం వంటి అంశాలు జగద్గురువులు ఫ్రాన్సిస్ పాపుగారి ఆలోచనా విధానం. కావున, పవిత్రాత్మ సర్వేశ్వరుని నడిపింపులో శ్రీసభ సభ్యులందరూ కలసి సువార్తా పరిచర్యలో అహర్నిశలు కృషి చేయాలి.

# 9. సినడ్ "నూత్నీకరించబడిన" శ్రీసభ

– బ్రదర్ గోలి బాలస్వామి & బ్రదర్ కర్రి శేఖర్





## ఉపోద్ఘాతం

శ్రీసభలో, ప్రజల విశ్వాసం పెరగాలనీ, ప్రజలు శ్రీసభలోభాగస్వాములుగామారాలనీఆశిస్తూ, ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తుంది, సార్వత్రికపీఠాధిపతుల సమాఖ్య. అంతేకాదు మానవులందరి జీవన గమ్యము ఒక్కటే, దేవుని సాన్నిధ్యానికి చేరడం, దేవుని ఔదార్యం, సౌజన్యం, రక్షణ ప్రణాళికలన్నీ మానవులందరికీ వర్తిస్తాయి.

## విశ్వాసుల నూతన దృక్పథం

విశ్వాసులు అందరూ కోరుకునేది ఒక్కటే. అది ఒకే క్రైస్తవత్వం. క్రీస్తుప్రభువు ఒకే శ్రీసభనుస్థాపించాడు. కానీ క్రైస్తవులే అనేక శాఖలుగా విడిపోయారు. ఇలా విడిపోయిన క్రైస్తవ శాఖలన్నింటినీ సఖ్యపరచి ఏకత్వాన్ని పెంపొందించడం ఒక దైవజన సంఘాన్ని (ఏకైక శ్రీసభను) పునరుద్ధరించడం ద్వితీయ వాటికను మహాసభ ప్రధాన లక్ష్యాల్లో ఒకటి.క్రీస్తు స్థాపించిన శ్రీసభ ఒక్కటే అయినప్పటికీ, విశ్వాసులు అనేక చీలికలుగా జీవిస్తూ క్రీస్తు ప్రభువు స్థాపించిన యథార్థమైన శ్రీసభ తమదేనని చెప్పుకుంటున్నారు. ప్రతి క్రైస్తవ సంఘం వారు తామే ప్రభు క్రీస్తుకు యథార్థమైన వారసులమని ప్రకటిస్తూ ఉంటున్నారు. వాళ్ళందరూ క్రైస్తవ ఏకత్వానికి భిన్నంగా ఆలోచిస్తూ ఉన్నారు.ఒకే ప్రభువు అనేక రూపాలుగా చీలిపోయాడా అనే భ్రమ కలిగేటట్టు వీరు

ప్రవర్తిస్తున్నారు. నిజానికి క్రైస్తవ సోదరులలో అనేక మంది ప్రభు కృపావర ప్రభావాన్ని చవిచూస్తూ ఏకత్వం పట్ల మక్కువ చూపుతున్నారు. యేసుక్రీస్తే తమ ప్రభువు రక్షకుడని విశ్వసించే వారందరు ఈ క్రైస్తవ సమైక్యత కోసం ఎంతగానోఎదురచూస్తున్నారు. కేవలం వ్యక్తులే కాకుండా శ్రీసభ తమదిగా చెప్పుకొనే క్రైస్తవ సంఘాలతో సహా విశ్వాసులెందరో ఈ సమైక్యత కోసం నిరీక్షిస్తున్నారు. నిజానికి క్రైస్తవుల్లో దాదాపు ప్రతిఒక్కరూ తమతమ పరిధుల్లో, విభిన్న మార్గాల్లో వివిధ క్రైస్తవ శాఖల పునఃఏకీకరణ కోసం ఏకైక దైవజన సంఘ స్థాపన కోసం ఆశగా ఎదురు చూస్తూనే ఉన్నారు. ప్రభువు స్థాపించిన శ్రీసభ ఏనాటికైనా ఒకటిగానే ఉండాలని ఈ భాగస్వామ్య శ్రీ సభ కోరుకుంటుంది అశతో ఎదురుచూస్తుంది. అందుకోసమే మనందరి ఉద్దేశాన్ని తెలుసుకోవడానికి మరీ ముఖ్యముగా మనల్ని కూడా భాగస్వాములుగా చేస్తుంది ఈ సినడ్.

## గురువులు మఠవాసుల పాత్ర

శ్రీసభ మధ్యయుగంలో సామాన్య క్రైస్తవుల్ని గురువులకు చెందినవారిగా భావించేవారు. శ్రీసభ అంటే మతాధికారులైన గురువులు, మఠవాసులు నడుపుతున్న సంఘమనీ, దానికి చెందిన వారు సామాన్య క్రైస్తవులనీ, వారు తమ అవసరాలకు గురువుల వైపు, వారి సహాయం కోసం ఎదురుచూసేవారుగా, వారి దీవెనలకై, వెదికే వారుగా భావించేవారు.ఇది ఇంచుమించుగా తమకు అవసరమైన సేవలను పొందే మతపరమైన రేషన్ షాపుగా మిగిలిపోయింది. అందువల్ల దాని నిర్వహణలో వారికి ఎటువంటి భాగస్వామ్యం లేనందువల్ల దాని లాభనష్టాలపైన కూడా వారికి ఆసక్తి లేకుండా పోయింది. ఈ పరిస్థితిని మార్చేందుకు, సామాన్య క్రైస్తవులు శ్రీ సభలో తమ సముచిత భాగస్వామ్యాన్ని తిరిగి పొందేందుకు ఆసియా ఖండ పీఠాధిపతుల సంఘం కూడా కృషిచేసింది. వారి బోధన ప్రకారం, సామాన్య క్రైస్తవులు గురువుల మఠవాసులకు చెందిన వారు కాదని, గురువులుమఠవాసులే సామాన్య క్రైస్తవులకు చెందిన వారని పేర్కొనడం జరిగింది.బాప్తిస్మం పొందిన ప్రతి విశ్వాసి క్రీస్తు సామాన్య గురుత్వంలోమరియుమఠవాసజీవితంలో పాలు పంచుకుంటాడు. అనగా క్రైస్తవులందరూ సామాన్య గురువులే. ఈ సామాన్య గురువులకు పరిచర్యలు

అందించేందుకే కొందరిని ఎంపిక చేసి, తర్ఫీదునిచ్చి, అభిషేకించి గురువులుగాను మఠవాసులుగాను నియమిస్తారు. అనగా సామాన్య క్రైస్తవుల సేవకోసమే గురువులు అభిషేకించబడతారన్నది గమనార్హం.

ఈ నూతన దృక్పథం ప్రకారంగా గురువులు, మఠవాసులు ప్రజలతో మమేకమైన ప్రభు యేసు దైవ రాజ్య వ్యాప్తికి కృషి చేయాలి. గురువుల మఠవాసుల యొక్క జీవితం ప్రజలను యేసు ఏసుక్రీస్తు వైపు నడిపించడానికి, ప్రేమ సేవా అనే సుగుణాలను తమ సోదరుల పట్ల ప్రదర్శించడానికి, పాపములో నుండి తమ జీవన విధానములను తొలగంచుకోవడానికి సహాయపడుతూ ఉండాలి. అదే శ్రీసభ ఉద్దశం, నినాదం.అయితే ఈ సినడ్ తరువాత గురువులలో మఠవాసులలో ఉన్నటువంటి కుల వివక్ష, సంఘంలో చీలికలు తొలగి ఒకే శ్రీసభగా ఉంటుందని బావిస్తుంది.అదే విధంగా ప్రజలలో ఉన్న అనేక అపోహలు తొలగించి గురువులుగా, మఠవాసులుగా చేరడానికి యువతి యువకులను ప్రేరేపించేటట్టుగా గురువులు, మఠవాసులు అవుతారని శ్రీసభ ఆశిస్తుంది.

## ఇతర మతాల యొక్క దృక్పథం

సమకాలీన ప్రపంచంలో మానవుల మధ్య అంతరాలు తరిగి పోతున్నాయి, వారు పరస్పరం చేరువవుతున్నారు, వివిధ ఖండాలకు విభిన్న జాతులకు చెందిన ప్రజల మధ్య స్నేహసంబంధాలు నెల కొంటున్నాయి. ఈ నేపథ్యంలోనే శ్రీసభ తనకూ, క్రైస్తవేతర మతాలకు మధ్యగల సంబంధాలను ఈసారి పునః సమీక్షించడానికి పూనుకుంటోంది.నిజానికి క్రైస్తవేతర మతాలతో సత్సంబంధాలను ఏర్పరచుకోవడం మాత్రమేకాదు, లోకంలోని మానవులందరి మధ్య సఖ్యతా సామరస్యాలను ఏకతాభావాన్ని పెంపొందించవలసిన బాధ్యత కూడా శ్రీ సభకు ఉంది. అలాగేప్రపంచ దేశాల మధ్య స్నేహ వారధుల్ని నిర్మించడమూ శ్రీసభ లోక ధర్మాలలో ఒక్కటి.మానవుల మధ్యగల సమానధర్మాలకు, సౌహార్ద సంబంధాలకు దోహదం చేసే అంశాలను చర్చిస్తోంది శ్రీసభ.మానవులందరూ ఒక్కటే, వారంతా ఒకే మానవ కుటుంబానికి చెందినవారు. భూలోకంఅంతటా విస్తరించడానికి దేవుడు ఎవరినైతే సృష్టించాడో, ఆ వంశవృక్షంనుంచే మానవులంతా ఉద్భవించారు. మానవులందరుఏ జాతికి,

ఏ మతానికి చెందినవారైనా అందరూ దేవుని రూపురేఖలను పుణికిపుచ్చుకున్న దేవుని సంతానమే. కనుక ఏ ఒక్కరినైనా ఏ కారణం చేతనైనా ద్వేషించి హింసించినా మన తోడబుట్టినవారిలా ప్రేమతో ఆదరించకపోయినా, మనం దేవుని తండ్రి అని సంబోధిస్తూ ప్రార్థన చేయడానికి అయోగ్యులము అవుతాము. అంతేకాదుమానవులకు దేవుడితో ఏర్పడే ఆధ్యాత్మిక బంధానికి, మానవులకు సాటి మానవులతో ఏర్పడవలసిన సోదర బాంధవ్యానికి అవినాభావ బంధం ఉంటుంది. అవి ఒకే నాణానికి రెండు ముఖాల వంటివి. "దేవుడు ప్రేమ స్వరూపుడు, కనుక ప్రేమింపనివాడు దేవుని ఎరుగనివాడే" (1 యోహాను 4:8). అందుకే జాతి పేరునగానీ, వర్గం పేరునగాని, మతం పేరునగాని, జీవన స్థితిగతులకారణంగా గానీ, సాటి మానవుల పట్ల వివక్ష చూపుతూ వారిని వేధింపులకు గురిచేయడం క్రీస్తు మనోభావాలకు ధార్మిక ప్రబోధాలకు బద్ధవిరుద్ధం, గనకనే కతోలిక శ్రీసభ వాటిని వ్యతిరేకిస్తుంది, తీవ్రంగా ఖండిస్తుంది. ఈ సినడ్ తరువాత అన్ని మతాలు వారివారి విశ్వాసాన్ని అందరూ గౌరవించాలని, వారి మంచి జీవితంద్వారా, పవిత్రాత్మ ఇతర మతాలలో కూడా పనిచేస్తుందని మనం తెలుసుకుంటాం.

## సంఘాల నిర్మూలన

ఇతర మతాలతో పోల్చకుంటే క్రైస్తవ మతం లేదా కథోలికులు మనిషి యొక్క అభివృద్ధికి ముఖ్యమని మొదట నుండి భావించారు, మానవనీయత సంబంధాలు మనిషిని సరియైన మార్గంలో నడిపిస్తాయి అని భావించారు. మనిషికి ప్రాథమిక అవసరాలు అయిన కూడు, గుడ్డ, నీడను అందివ్వడానికి పూర్వం మిషనరీలు ఇప్పటి సాంఘిక సేవా సంస్థల వరకు ఎంతో గొప్పగా మన తెలుగు శ్రీసభ కృషి చేస్తూ వచ్చింది, చేస్తుంది.

అయితే అప్పటి పరిస్థితులతో పోల్చుకుంటే నేటి పరిస్థితులు దానికి చాలా భిన్నంగాఉన్నాయి. ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాలలో సామాజిక, ఆర్థిక వ్యత్యాసాలు ఒకప్పటి కన్నా ఇప్పుడు పరిస్థితులుచాలా వరకు మెరుగు అని మనం గ్రహించగలం. కుటుంబ వ్యవస్థలో మార్పులు, పిల్లల పెంపకంలో మార్పులు, ఆర్థిక ఆర్జనలో మార్పులు ఒక్కమాటలో చెప్పాలంటే మనిషి జీవన

విధానమేపూర్తిగామారిపోయింది. ఇలా మనిషి జీవన విధానం మారడానికి పాశ్చాత్య సంస్కృతి కూడా ఒక కారణమని మన పెద్దవారిభావన. ముఖ్యంగా దేశానికైనా సంఘానికైనా యువత రేపటి భవిత మరి మన సంఘాలలో యువతీయువకుల ప్రమేయం ఎంత వరకు ఉందో మనకు తెలియనిది కాదు. మరి ఇటువంటిపరిస్థితులలో మనం కథోలిక సంఘాలను ఎలా నిర్మించగలం?

మార్పు అనేది కాలంతో పాటు వస్తుంది ఏ మనిషి అయితే దానికి అనుగుణంగా నడుచుకుని ముందుకు సాగుతాడో వారు విజయం సాధిస్తారు అనేది నేటిమేధావులయొక్క జవాబు. మరి మతపరమైన సంఘాలు నిర్మించడానికి కాలంతో పాటువచ్చేమార్పుకి అనుగుణంగా నడుచుకోవాలా లేదా పాత పద్ధతులకు అనుగుణంగా మలచుకోవాలా?

మనిషి కాలంతో వచ్చే మార్పును స్వాగతించాలి, అంటే మన పెద్దలు నేర్పిన ధర్మ నియమాలు మరువకూడదు. ఒక క్రైస్తవుడుగా కాకుండా ఒక మనిషి ఏ విధంగా జీవించాలో అనేది మన పది ఆజ్ఞల ద్వారా నేర్చుకొని యున్నాం, పది ఆజ్ఞలనేవి ఒక మనిషికిదేవునిపట్ల, తల్లిదండ్రుల పట్ల, ఇతరుల పట్ల ఏ విధంగా నడుచుకోవాలోనేర్పుతున్నాయి. తిరుసభ కట్టడలు ఒక విశ్వాసి తల్లియైన శ్రీసభకు ఎలాబాధ్యతగా వుండాలో తెలియజేస్తుంది.

కథోలిక సంఘాలు నిర్మించేటప్పుడు మనంఈయొక్కరెండుఅంశాలను మరువ కూడదు. కాలం ఎంతమారినా, సత్యము అనేది ఎప్పుడు ఒకేలా ఉంటుంది. మంచి పనినిఒక్కరు చేసినా మంచే అంటారు, చెడు పనిని వందమందిచేసినా చెడే అంటారు. క్రొత్త అంశాలను మన సంఘాల నిర్మాలన కోసం అన్వయించుకోవచ్చా? కాని అవి తల్లిశ్రీసభయొక్క స్వచ్ఛతను, ఔనత్యాన్ని, పవిత్రతను పెంపొందించే విధంగా ఉండాలి. అంతే గాని శ్రీసభను దిగజార్చే విధంగా ఉండకూడదు.

ప్రస్తుతం జరుగుతున్న సినడ్ కథోలిక సంఘాలను నిర్మించడంలోబలమైన పాత్రనే పోషిస్తుంది. ప్రస్తుత సినడ్ ద్వారా ప్రజలకు శ్రీసభకు మధ్య ఉన్న సంబంధం బలపరిచే విధంగా ఉంటుంది. అయితే సంఘాలను నిర్మించేటప్పుడు ప్రాంతీయ పద్దతులను మరి ముఖ్యంగా ఇతర మతాల వారిని కించపరిచే,

అవమానపరిచేవిధంగా ఉండకూడదు. అలా అని శ్రీసభకు పూర్తి భిన్నంగా కూడా ఉండకూడదు. సంఘాలలో ఉన్న, నివసిస్తున్న వారి యొక్క అభిప్రాయాలమీదసంఘాలను నిర్మించుకోవాలి అప్పుడే వారికి దేవుని పట్ల, సంఘం పట్ల బాధ్యత ఉంటుంది. సంఘంలో ప్రజలు దేవునితో ఏవిధంగా సంబంధాన్ని బలపరుచుకుంటారో అదే విధంగా సంఘంలో ఉండే ప్రజల మధ్య కూడా, ఆహ్లాద, ఆరోగ్యకరమైన సంబంధాలు బలపడడం అంతే ముఖ్యం. ముఖ్యంగా సంఘాలలో పెత్తనంఅనే మాటకువిలువఇవ్వకుండాఅందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలి. యువతకు స్త్రీలకు సరియైన ప్రాధాన్యం ఇచ్చివారిలో దేవుని పట్ల ప్రేమను, దివ్య గ్రంథ పఠనాల యొక్క ఔనత్యాన్ని తెలియజేయాలి. ఇలా చేయడం వల్ల సంఘాలలో నమ్మకం, విశ్వాసం రాతి పునాదిపై కట్టిన ఇల్లు వలె పెనుగాలులకు పడిపోకుండా దుష్టశక్తులకు చెదరకుండా సంఘాలు అభివృద్ధి పథంలో నడుస్తాయి.

## శ్రీసభ వసుదైక కుటుంబం

సామాన్య క్రైస్తవులు గురువర్గానికి లోబడి ఉన్నవారు కాదు, వారు కూడా సమాన క్రియాశీలక సభ్యులు గనుక శ్రీసభ సేవల్లో లేదా వారికికూడా ప్రాధాన్యత ఇచ్చినట్లయితే, గురువు– సామాన్య క్రైస్తవులకు మధ్య ఏమైనావిభేదాలుఉంటే సమసిపోతాయి. అంతేకాక సామూహిక అనుబంధం, సహవాసం అవుతుంది. అలాగే శ్రీసభకు, ప్రపంచానికి అందించవలసిన ఒకే క్రీస్తు ప్రేషిత కార్యంలో పాలు పంచుకుంటున్న వారిగా పరిగణించడం జరుగుతుంది. ఆవిధంగా వారిరువురి మధ్య పరస్పర సహకార, అనుబందాన్ని సాధించగలుగుతాము. ఈ సినడ్లో సామాన్య క్రైస్తవులు సహబాధ్యతతో చాలా అంటే చాలానే ఉపయోగపడుతుంది, ఎందుకంటే సామాన్య గృహస్థ క్రైస్తవులకు వాక్య పరిచర్య, దైవార్చనలోని ప్రార్థనలు పర్యవేక్షణ, జ్ఞానస్నానం ఇవ్వడం, దివ్యసత్ప్రసాదం పంచడం వంటి పనులను అప్పగించ వచ్చని రెండవ జాన్ పౌలు పాపుగారు, ఫ్రాన్సిస్ పాపుగారు ప్రతిపాదించారు. ఇప్పటికీ వాటిలో కొన్నింటిని అనుసరిస్తున్నాం. ఇలాంటి సహ బాధ్యతతో వ్యవహరిస్తే సరికొత్త యుగానికి తలుపులు తెరవచ్చు.

సంఘంలో విశ్వాస పరంగా గానీ, పరిపాలనా పరంగా గాని, నైతిక పరంగా గాని సామాజికపరంగా గాని ఏవైనా సమస్యలు ఎదురైనప్పుడు అందరం కలిసి అందరి శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని నిర్ణయం తీసుకోవడానికి అవకాశం ఉంటుంది. గురువు– గృహస్థక్రైస్తవుల సహవాసం ఇతర సంఘాలకు ఆదర్శనీయంగా ఉంటుంది. దీని ద్వారా సంఘం ఇంకా బలపడుతుంది. ఒకరి సేవలో కొరతను ఇంకొకరి సేవ పరిపూర్తి చేస్తుంది. గురువు గ్రహస్త క్రైస్తవులు పనిచెయ్యడం ద్వారా శ్రీసభ ఒక ఉమ్మడి కుటుంబంగా వుంటుంది సంఘ చీలిక ఉండదు. అయితే ఇలా వుండటం వల్ల కొన్ని లోటు పాట్లు కూడా లేకపోలేదు ముఖ్యంగా ఆధిపత్యంచలాయించేందుకు ఆస్కారం ఉంది. లౌకిక విషయాల ద్వారా, వ్యవహారాల్లో తమకు అప్పగించబడిన బాధ్యతలను చక్కగా నిర్వర్తించ లేకపోవచ్చు సభ్యుడు సంఘ శ్రేయస్సు కోసం కాకుండా కుటుంబ శ్రేయస్సు కోసం ఉబలాట పడవచ్చు. ఇలాంటి సమస్యలు సంఘంతో గాని, తోటి మానవులలో గాని అస్పష్టంగా ఉండటం ద్వారా సంఘం చీలిపోవచ్చు. గుర్తింపు పొందిన కొందరికి మంత్రమే ప్రాధాన్యత ఇవ్వడం, ఆధిపత్యం చలాయించటం, వివక్ష పక్షపాతంఇవిసంఘాన్ని చిన్నాభిన్నం చేయగలవు.

తల్లి శ్రీసభ ఇప్పటికి ఇంత బలంగా నిలబడి వుంది అంటే అది మొదటిగా దేవుని కృప, రెండవది మనమతాధికారులు తీసుకున్న కొన్ని నిర్ణయాలు. ప్రపంచంలో చాలా సంస్థలు, శ్రీసభ యొక్క పరిపాలన విధానాన్నీ అనుసరిస్తున్నాయి అని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ఎందుకంటే శ్రీసభ ప్రతి పనిని ఒక క్రమశిక్షణలో కార్యాచరణ దాల్చి చేస్తుంది. అయితే ప్రస్తుత సమాజంలో ప్రజలుగాని యువతగాని పూర్వం రాజులు పరిపాలించే పద్ధతులులాంటి చట్టం క్రింద ఉండాలని అనుకోవడం లేదు.మరి తల్లి శ్రీసభ, పరిశుద్ధ పావు గారు చెప్పిన విధంగా మతాధికారులు, గురువులు, పరిపాలించే వారు. ప్రజలు చెప్పిన ప్రతి అంశాలను జాగ్రత్తగా ఆలకించి వాటిలో మంచివాటిని లేదా అందరికి ఉపయోగకరమైన వాటిని తీసుకొనిపాటించాలి. ఇక్కడ గురువు మతాధికారులు ప్రజలను ఒక కృత్రిమ సంఘంలా కాకుండా

కుటుంబంలా భావించి ప్రజలకు మంచిని, చెడును చెప్పి వారిని దేవుని రాజ్యం వైపు, ముందుండి నడిపించాలి.

## దైవాంకిత జీవితంలో మార్పులు

తల్లియైన శ్రీసభలో జరిగే సినడ్ సమావేశాలలో ఎన్ని అంశాలు చర్చించినా అవి ప్రజలు, మతాధికారుల యొక్క ఆధ్యాత్మిక జీవితాన్ని అభివృద్ధి పరిచే విధంగానే ఉండాలి అలా లేని యెడల ఎన్ని సినడ్ సమావేశాలు జరుపుకున్నా చలనం లేని నీరులాగే ఏ ఉపయోగం లేకుండా పోతుంది.

తొలి నాటి క్రైస్తవులు ముఖ్యంగా తొలి క్రైస్తవ సంఘాలు ఎక్కువగా గృహాలలోనే ప్రార్థన కూటములు జరుపుకోవడం మనం చూస్తున్నాం (1 కొరింతీ 1:16, రోమీ 16:10). ప్రేమ, ఐక్యత కలిగిన ఒక కుటుంబంగా వారు దేవుని వాక్కు వింటూ, కలిసి ప్రార్థిస్తూ, ప్రభు భోజన స్మరణను కొనియాడుతూ, ప్రేమ విందులో పాలు పంచుకునే వారు. వీరు సంఘాలపట్ల పూర్తి బాధ్యతతో వ్యవహరించేవారు ముఖ్యంగా సంఘ పనుల్లో శ్రద్ధతో పాలుపంచుకునేవారు. అయితే సంఘాలను అభివృద్ధి చెయ్యడం కోసం కొంతమందిని ఎన్నుకోవడం జరిగింది వాళ్ళనే మనం ప్రస్తుతం పాపుగారు, పీఠాధిపతిని, గురువులు కన్య స్త్రీలుగా కొనియాడుతున్నాం. పూర్వం ప్రజలలో దివ్యసత్ప్రసాదం పట్ల దివ్యపూజ పట్ల ప్రత్యేక శ్రద్ధను కనబరిచేవాళ్లు కానీ రాను రాను ప్రజల యొక్క దైవాంకిత జీవితంలో చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. వాటికి ముఖ్య కారణం మొదటిది కాలంలో వచ్చిన మార్పులు, అయితే రెండవది శ్రీసభలో కొంతమంది అధికారులు తమ యొక్క సొంత అవసరాలకు ఉపయోగించుకున్న వైనం.

ద్వితీయ వాతికను మహాసభ తల్లియైన శ్రీసభలో చాలా మార్పులు తెచ్చిందనేది వాస్తవం ఎందుకంటే రెండవ వాతికను మహాసభకు ముందు దైవ సాంగ్యాలు గాని, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు గాని, లతీను భాషలో ఉండేవి కాని వాతికను మహాసభలు తరువాత ప్రజలు దివ్య పూజాబలిని ప్రాంతీయ భాషలలో మరీ ముఖ్యంగా దివ్య పూజాబలిని ప్రజలుచూసేవిధంగా ఈ యొక్క సభలు జరిగాయి. తద్వారాప్రజలకుదేవునికి మధ్య మంచి వారదిగా

ఈ యొక్క సభలు జరిగాయి. వీనిద్వారానే మన దేశం లో ఎన్బి సిఎల్సి (NBCLC) (నేషనల్ బిబిలికల్ క్యాటికెటికల్ లిటర్జికల్ సెంటర్) ద్వారా దివ్య బలిపూజకు భారతీయ ఆచారాలను జోడించారు తద్వారా ప్రజలకుదివ్య బలిపూజయొక్కఅర్థం పరమార్ధం క్లుప్తంగాఅర్ధమై వాళ్ళ జీవితాలలో ఆధ్యాత్మికతకు భీజం మరింత బలపడింది.

మరి నేటి ఈ ఆధునికయుగంలో మనిషికి ఆధ్యాత్మిక లేదా దైవాంకిత కార్యక్రమాల వైపు నడిపించాలి అంటే కత్తి మీద సాము వంటి పనే. కాని సరియైన విధానంలోఒక ప్రణాళిక ప్రకారం ప్రజలకు ఉపయోగకరమైన అర్థవంతమైన రీతిలో మనం నడిపించినట్లైతే దేవుని ప్రణాళికల వలన ఇది అంత కష్టతరమైన పనిగా కాకుండా ఇష్టతరమైన పనిగా మారుతుంది. మనం చేయవలసినది అంతా ప్రజలను దైవ కార్యాలలో ఎక్కువగా భాగస్వాములను చెయ్యడం.

మతాధికారులు గురువులు, కన్యస్త్రీలు ప్రజలకు వెన్నంటి ఉండి ఒక నాయకులుగా, ఒక బాధ్యత కలిగిన తండ్రిలా ముందుకు సాగనంపాలి. కానిమన కతోలిక శ్రీసభలోజరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కొన్ని నియమ నిబంధనలు ఉంటాయి, ఆ నియమ నిబంధనల పవిత్రతకు భంగం కలుగకుండామనం తీసుకునే నిర్ణయాలు ఉండాలి. ముఖ్యంగా నేటి తరం యువత ఎంతో నైపుణ్యం కలిగి ఉండాలి వారికి ప్రార్థన కూటములలో, ఆధ్యాత్మిక కార్యక్రమాలో కొన్ని కార్యక్రమాలను వాళ్ళ ద్వారా నడిపించి వారికి దేవుని పట్ల దివ్యసత్ప్రసాదం పట్ల ఆకర్షితులను చెయ్యాలి. అదే విధంగా చిన్న పిల్లలకు పాత పద్దతిలో సత్యోపదేశం కాకుండా వాళ్ళని ఆకర్షించే విషయాలు అయిన కథలు, వీడియోలు, పాటల ద్వారావాళ్లకి శ్రీసభ యొక్క ప్రార్ధనలు, ఆజ్ఞలను బోధించాలి. దైవాంకిత జీవితానికి ఇప్పటి నుండే మనం బాధ్యత కలిగి ఉండాలి.

తెలుగు శ్రీసభ స్థాపించిన జ్యోతిర్మయి సంస్థ ద్వారా ప్రజలను మనం కొంత వరకు ఆధ్యాత్మికత వైపు మార్చగలిగాము. దీని ద్వారాప్రజలు స్వంత ప్రార్ధనల చెప్పటం, దివ్య గ్రంథ పఠనాలలో ఉన్న వచనాలను నేర్చుకోవడం వారికి తోచిన రీతిలో ప్రసంగాలను, ప్రార్ధనా కూటములలో చెప్పుకోవడం జరిగింది. మరి ఇలాంటి పద్ధతులను మనం మరింత బలపరచి పరలోకపు రాజ్యం యొక్క గొప్పతనాన్ని ప్రజల యొక్క హృదయాలలో పదిల పరచడం ద్వారా మనం ఎన్నో ఆత్మలను కాపాడిన వారిగ, క్రీస్తు ప్రభువు యొక్క ఆశయాలను కాపాడిన వారమౌతాము.

## ముగింపు

భాగస్వామ్య శ్రీ సభ యొక్క ముఖ్య ఉద్దేశం ఏమిటంటే శ్రీ సభనూత్నీకరించ బడాలి. అది ఏవిధంగా అంటే, మారుతున్న కాలానుగుణంగా మనిషితనలోని మానవత్వం అనేది మరచిస్వార్థంతో నిండిపోతున్నాడు, దాని ద్వారా యేసు ప్రభుని బోధనలను, శ్రీసభ ప్రబోధించిన అనేక ప్రబోధాలు కేవలం మాటలలో మాత్రమే ఉన్నాయి అవి కార్యరూపం దాల్చడం లేదు. విశ్వాసులు వాటిని గ్రహించడానికి అనుకూలత లేకపోతుంది. ఇలాంటి ఎన్నో సమస్యలను మదిలో నిలుపుకొని, భాగస్వామ్య శ్రీసభలో అందరూ సమానమేనని, దేవునికి ప్రియమైన వారని తెలుపుతూ, ప్రపంచంలోని అన్ని ప్రాంతాల వారిని అన్ని జాతుల వారిని శ్రీసభలో భాగమని తెలుపుతుంది. అదే విధంగా ఈ సినడ్ తర్వాత యేసు క్రీస్తు ప్రభువు ప్రేమ ఆయన ప్రభోదాలు అందరికీ చేరువౌతాయి అనడంలో ఎలాంటి అనుమానం, సందేహం లేదు.

# పీఠాధిపతుల సమాఖ్య 2021-2023





పీఠాధిపతుల సమాఖ్య 2021-2023 ను పరిశుద్ధ ఫ్రాన్సిసు పాపుగారు,
2021 అక్టోబరు 10 న, వాటికన్ లోని పునీత పేతురుగారి
మహా దేవాలయములో దివ్య బలిపూజను సమర్పించి, ప్రారంభించారు.



# సినడ్ 2021-2023

## పవిత్రాత్మ సహాయమునకై ప్రార్థన

ఓ మా పవిత్రాత్మ సర్వేశ్వరా,/ మీ నామమున సమావేశమైన మేము/ మీ ఎదుట నిల్చొని మిమ్ము ప్రార్థిస్తున్నాము./ మీరు మాత్రమే మాకు మార్గచూపరిగా ఉండుటకుగాను/ మా హృదయంలో మీ నివాసం ఏర్పరచుకొనండి./ మేము నడవాల్సిన మార్గం మాకు చూపించి,/ అందులో మేము ఏ రీతిగా ప్రయాణించవలెనో మీరు బోధించండి./ మేము బలహీనులము,/ పాపస్వభావమును కలిగినవారము./ కావున మేము/ అనైక్యత, అశాంతిని సృష్టించే ఆలోచనలు చేయకుండా,/ మాట్లాడకుండా,/ ప్రవర్తించుటకుండునట్లు చేయండి. /అసత్య సమాచారం,/ అవివేకం/ మమ్ములను పెడమార్గంలో నడిపించకుండునట్లు చేయండి./ రాగద్వేషాలు, పక్షపాత ధోరణి/ మమ్ములను మా నిర్ణయాలను ప్రభావితం చేయకుండునట్లు చేయండి./ మేము నిత్య జీవమునిచ్చు మార్గంలో ప్రయాణించుటకై/ జీవమును, సత్యమును, వెలుగునైన మిమ్ము/ ఎన్నటికి వీడకుండునట్లు చేయండి./ అన్ని వేళల, అన్ని స్థలాలలో/ తండ్రి కుమారుల పరిశుద్ధ సహవాసములో పనిచేస్తున్న/ ఓ మా పరిశుద్ధాత్మ సర్వేశ్వరా,/ ఈ మనవులన్నిటిని/ మేము మీకు సమర్పించుచున్నాము./ ఆమెన్.

**భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయము**

**రామంతపురం, హైదరాబాదు**